అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 25-11-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 276 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు వెల : 6.50

ముగ్గురు ముస్లిం యువకుల బలి

సంభాల్‌లో మసీదు సర్వే హింసాత్మకం



11లో..

భాష్పవాయువు, రబ్బరు బుల్లెట్లు ప్రయోగం

15 మందిని అదుపులోకి తీసుకున్నాం : యూపీ అధికారుల వెల్లడి


ఎన్నికల్లో అవతకలపై దృష్టిని మరల్చే చర్య : అఖిలేశ్ యాదవ్

మోదానీ దోస్తానా!

2014 తర్వాతే అదానీ వ్యాపార సామ్రాజ్యం విస్తరణ

- విమర్శలకు జవాబుగా కక్ష సాధింపులు
- సెబీ నిష్క్రియాపరత్వం

ప్రధాని నరేంద్ర మోడీ, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ మధ్య అనేక సంవత్సరాలుగా సత్సంబంధాలు కొనసాగుతున్న విషయం బహిరంగ రహస్యమే. భారత చరిత్రలో ఓ దేశ ప్రధానికి, ఓ పారిశ్రామికవేత్తకు మధ్య ఇంతలా సంబంధాలు పెనవేసుకుపోవడం గతంలో ఎన్నడూ జరగలేదు. అదానీ కోసం మోడీ పనిచేస్తున్నారని చెప్పడానికి ప్రతిపక్షాలు తరచుగా 'మోదానీ' అనే పదాన్ని ప్రయోగిస్తున్న విషయం తెలిసిందే. గత సంవత్సరం జరిగిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో 'మోడీ-అదానీ భాయ్ భాయ్/దేశ్ బెచ్ కీ ఖాయే మలాయ్' అనే నినాదం మార్మోగింది. అదానీ గ్రూప్ సంస్థలు అనైతిక పద్ధతులకు పాల్పడుతున్నాయంటూ అమెరికా కోర్టు అభిశంసించడానికి చాలా కాలం క్రితమే పార్లమెంటులో ఈ నినాదాలు హోరెత్తాయి.మోడీ కూడా అదానీతో తనకున్న వ్యక్తిగత సాన్నిహిత్యాన్ని దాచిపెట్టేందుకు ఏనాడూ ప్రయత్నించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుండే మోడీ, అదానీల మధ్య అపవిత్ర సంబంధం ఉన్నదంటూ కాంగ్రెస్ ఆరోపణలు గుప్పించినా ప్రధాని ఏ మాత్రమో పట్టించుకోలేదు. ప్రత్యేక ఆర్థిక మండలి కోసం అదానీకి గుజరాత్‌లో ప్రభుత్వ భూమిని కారుచౌకగా (చదరపు మీటరు ధర రూపాయి నుంచి 32 రూపాయల వరకూ) కట్టబెట్టారని కాంగ్రెస్ 2014కు ముందే చెప్పింది. మోడీని గొప్ప పాలనాదక్షుడిగా, సంస్కరణవాదిగా చూపేందుకు అదానీ గ్రూప్ ముమ్మరంగా కృషి చేసింది. ఈ నేపథ్యంలో మోడీ, అదానీ సంబంధాలపై 'ది వైర్' పోర్టల్ అందించిన కథనం మీ కోసం...



సెబి ఏం చేస్తోంది?

అదానీ గ్రూపు సంవత్సరాల తరబడి ఎన్నో ఉల్లంఘనలకు పాల్పడుతున్నప్పటికీ సెబీ ఎందుకు పట్టించుకోలేదన్న ప్రశ్న ఇప్పుడు తలెత్తుతోంది. సెబీ ఛైర్‌పర్సన్ మాధబి బచ్ పూరీపై అనేక ఆరోపణలు వచ్చినప్పటికీ ప్రభుత్వం ఆమెను తొలగించలేదు. అదానీ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూసేందుకు కొన్ని శక్తులతో కూడిన భారీ నెట్‌వర్క్ పనిచేస్తోందని చెప్పడానికి ఇది సరిపోతుంది. అదానీకి ఒకటి కంటే ఎక్కువ విమానాశ్రయాలను ధారాదత్తం చేయడానికి మోడీ ప్రభుత్వం నిబంధనలు సవరించింది. అదానీ- అంబానీకి రూ.30 లక్షల కోట్ల విలువైన వ్యవసాయ వాణిజ్యాన్ని అప్పగించేందుకు జరిగిన కుట్రలో భాగంగానే వ్యవసాయ చట్టాలు తీసుకొచ్చారన్న ఆరోపణలూ వచ్చాయి. ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్న ఈడీ, సీబీఐలు అదానీపై వచ్చిన ఆరోపణలను పట్టించుకోవడం లేదు.

న్యూఢిల్లీ : 2001లో మోడీ గుజరాత్ ముఖ్యమంత్రి అయినప్పుడు అదానీ పెద్దగా పేరున్న వ్యక్తేమీ కాదు. 2014లో అదానీ నికర ఆస్తుల విలువ 2.8 బిలియన్ డాలర్లు మాత్రమే. అప్పట్లో ఫోర్బ్స్ జాబితా ప్రకారం ఆయనది భారతదేశంలోని సంపన్న వ్యక్తుల్లో 11వ స్థానం. కానీ 2022 ఏప్రిల్ నాటికి ప్రపంచంలోనే అత్యంత సంపన్నుల్లో రెండో వ్యక్తిగా నిలిచారు. అప్పుడు ఆయన నికర ఆస్తుల విలువ 90 బిలియన్ డాలర్లు.

ఇదేం స్పందన?

ఇటు దేశంలోనూ, అటు విదేశాల్లోనూ అదానీకి మేలు చేకూర్చేందుకు మోడీ ప్రధాని కార్యాలయాన్ని వాడుకున్నారని రాహుల్ గాంధీ అనేక బహిరంగ సభలు, పత్రికా సమావేశాల్లో చెబుతూ వచ్చారు. ఆ తర్వాత ఇతర రాజకీయ పార్టీల నేతలు కూడా రాహుల్‌కు మద్దతుగా మాట్లాడడం మొదలు పెట్టారు. అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ సంచలన నివేదిక బయటపెట్టిన తర్వాత తృణమూల్ కాంగ్రెస్ నేత మహువా మొయిత్రా, ఆమ్‌ఆద్మీ ...11లో

ఏ దేశమేగినా..

ఎన్ని ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ అదానీ వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా దినదినాభివృద్ధి చెందింది. అదానీపై వచ్చిన ఆరోపణలు విస్మరించదగినవేమీ కావు. ఎందుకంటే అవి చాలా తీవ్రమైనవి. ప్రపంచవ్యాప్తంగా ఓడరేవులు, విమానాశ్రయాలు, విద్యుత్, గనుల తవ్వకం, మౌలిక సదుపాయాలు, రక్షణ రంగాల్లో వ్యాపార ప్రయోజనాలను విస్తరించుకోవడంలో అదానీకి మోడీ తన కార్యాలయం ద్వారా సాయపడ్డారని రాహుల్ అనేక సందర్భాల్లో ఆరోపించారు. అదానీ వ్యాపార ప్రయోజనాలు, ప్రాజెక్టు లు, కాంట్రాక్టులను ముందుకు తీసికెళ్లేందుకు మోడీ మన దేశ దౌత్య అధికారాన్ని ఉపయోగించారని కూడా ఆయన విమర్శించారు. మోడీ ఏ దేశం లో పర్యటించినా అక్కడ అదానీ వ్యాపార సామ్రాజ్యం విస్తరించింది. అమెరికా పర్యటనకు ముందు శ్రీలంక, బంగ్లాదేశ్, కెన్యా, ఆస్ట్రేలియా దేశాల్లో వివాదా లు చెలరేగాయి. అయితే వీటిని మోడీ ఏ మాత్రం ఖాతరు చేయలేదు.



అదానీపై జేపీసీ వేయాలి

కేంద్రం వైఖరిపై ప్రధాని ప్రకటన చేయాలి

అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాల డిమాండ్

నేటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో అదానీ అవినీతిపై చర్చించాలి. కేంద్రం వైఖరిని ప్రధాని మోడీ ప్రకటించాలి.. ఈ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. నేటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం పార్లమెంట్ అనెక్స్ భవనంలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమయంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రి జెపి నడ్డా, అర్జున్ రామ్ మేఘ్వాల్, ఎల్.మురుగన్, అనుప్రియా పటేల్ (అప్నాదళ్), సీపీఐ(ఎం) తరపున ఎంపీ జాన్‌బ్రెట్టాస్, కాంగ్రెస్ నేతలు జైరాం రమేష్, ప్రమోద్ తివారీ, గౌరవ్ గొగొయ్, కె. సురేష్, జేడీయూ నేత ఉపేంద్ర కుష్వాహా, కె.ఆర్ సురేష్ రెడ్డి (బీఆర్ఎస్), లావు శ్రీకృష్ణదేవరాయులు (టీడీపీ), వల్లభనేని బాలశౌరి (జనసేన), విజయ సాయిరెడ్డి, మిథున్ రెడ్డి (వైసీపీ), టిఆర్ బాలు, తిరుచ్చి శివ (డీఎంకే), రాం గోపాల్ యాదవ్ (ఎస్‌పీ), సంజయ్ సింగ్ (ఆప్), సంతోష్ కుమార్ (సీపీఐ), వైకో (ఎండిఎంకె), సస్మిత్ పాత్ర (బీజేడీ), ఎన్‌కె ప్రేమ్ చంద్రన్ (ఆర్ఎస్‌పీ) తదితరులు పాల్గొన్నారు. అదానీ గ్రూప్‌పై ఆరోపణలు, మణిపూర్ అల్లర్లు, ఉత్తరప్రదేశ్‌లోని ఉప ఎన్నికల్లో అవకతవకలు, వక్ఫ్‌బిల్లుపై సభలో చర్చకు కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. అలాగే కాలుష్యం, రైలు ప్రమాదాలు వంటి అంశాలపై కూడా చర్చించాలని డిమాండ్ చేసినట్టు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ప్రమోద్ తివారీ మీడియాకు తెలిపారు. ప్రజా ప్రయోజనాల అంశాలపై చర్చ జరపాలని స్పష్టం చేశామన్నారు. అయితే అన్ని అంశాలపై చర్చకు కేంద్రం సిద్ధంగా ఉందని, సభ సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కోరారు. కాగా, పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ నెల 25 నుంచి డిసెంబర్ 20 వరకు జరగనున్నాయి. నవంబర్ 26న 75 ఏండ్ల రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సెంట్రల్ హాల్‌లో సంవిధాన్ సదన్ ...11లో

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

ఏఐసీసీ అగ్ర నేతలతో సమావేశం

మంత్రివర్గ విస్తరణ, కార్పొరేషన్ పదవుల భర్తీపై చర్చించే అవకాశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీ వెళ్లనున్నారు. సోమవారం సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు ఎంపీలు కూడా హస్తినకు వెళుతున్నట్టు తెలిసింది. త్వరలోనే మంత్రి వర్గ విస్తరణ జరుగుతందనే ఊహాగానాల మధ్య రేవంత్ పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మంత్రివర్గ విస్తరణతో పాటు పెండింగ్‌లో ఉన్న కార్పొరేషన్ పదవుల భర్తీపై కాంగ్రెస్ హైకమాండ్‌తో చర్చించే అవకాశం ఉంది. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాలకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేతో పాటు అగ్ర నేతలు సోనియా ఇతర ముఖ్య నేతలను కలిసి సీఎం ఆహ్వానించనున్నారు. డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు సభకు హాజరుకావాలని రాహుల్ గాంధీని కోరనున్నట్టు తెలుస్తోంది. అలాగే లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా కూతురు వివాహానికి హాజరు కానున్నారు.

కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నల్లగొండ జిల్లా కేతేపల్లిలో పార్టీ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-కేతెపల్లి

ప్రభుత్వాల్లో అస్థిరత, ఆర్థిక సంక్షోభం ఏర్పడినప్పుడు ప్రజలు కమ్యూనిస్టు పార్టీని కోరుకుంటున్నారని, దానికి నేడు శ్రీలంకలో కొలువుదీరిన కమ్యూనిస్టు ప్రభుత్వం నిదర్శనమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలకేంద్రంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల శ్రీనివాసరెడ్డి పేరు మీద నూతనంగా నిర్మించిన సీపీఐ(ఎం) కార్యాలయ (ఎన్ఎస్ఆర్) భవనాన్ని ఆదివారం తమ్మినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి మత రాజకీయాలను ప్రేరేపిస్తున్నదని అన్నారు. పన్నుల రూపంలో ప్రజాధనాన్ని కార్పొరేట్ శక్తులకు దారపోస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన మూసీ ప్రక్షాళనలో ఇండ్లు, భూమిని కోల్పోతున్న నిర్వాసితులకు ప్రత్యామ్నాయ వనరులు కల్పించాలని కోరారు. సామాన్య ప్రజల హక్కులకు పాలక ప్రభుత్వాలు భంగం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వాలు నిరంకుశంగా వ్యవహరిస్తే ప్రజలు తిరగబడతారన్న విషయాన్ని గమనించి పరిపాలన చేయాలని సూచించారు. లగచర్ల ఘటనలో రైతులపై పెట్టిన కేసులను ప్రభుత్వం వెంటనే ఎత్తేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను, రైతురుణమాఫీ, రైతుభరోసా పక్కగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారం ఉన్నా.. లేకున్నా.. పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడేది కమ్యూనిస్టులేనని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొరల గడీలను బద్దలు కొట్టి వారి ఆస్తులను పేదలకు పంచిన మండలంలోని కొప్పోలు గ్రామానికి చెందిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి పేరు మీద కార్యాలయం నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ...11లో

రాజ్యాంగ పరిరక్షణ విద్యార్థుల బాధ్యత

భారతదేశం కార్పొరేట్ల రాజ్యమైంది



వివరాలు 2లో

రాజ్యం, మతం..ఒక్కటి కాదు

భారత రాజ్యాంగం మతానికి కాదు..మతోన్మాదానికే వ్యతిరేకం

సమాజం పట్ల స్పందించే గుణాన్ని ఎస్ఎఫ్ఐ కల్పిస్తోంది :

ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో

వక్తలు ప్రొఫెసర్ నాగేశ్వర్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి వి.కృష్ణయ్య

ఆటపాటలతో ఉత్సాహంగా సాగిన సమ్మేళనం

కౌన్ బనేగా మహా సీఎం

ఫడ్నవీస్, శిండే, అజిత్ పవార్‌ల మధ్య కుర్చీలాట



మహారాష్ట్రలో తదుపరి సీఎం ఎవరన్నదానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. అటు బీజేపీ దేవేంద్రఫడ్నవీస్ కాబోయే సీఎం అంటూ లీకులిస్తోంది. మరోవైపు ప్రస్తుత సీఎం ఏక్‌నాథ్ శిండే పోటీపడుతున్నారు. ఎన్సీపీ చీలికవర్గం నేత అజిత్ పవార్ కూడా తగ్గేదేలేదంటున్నారు. దీంతో ముఖ్యమంత్రి చైర్ రేసులో.. ఈ ముగ్గురి మధ్య ముక్కోణపు పోటీ కనిపిస్తోంది.

ముంబయి :మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమిని విజయం వరించింది. మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) ఘోర పరాజయాన్ని చవిచూసింది. కాగా ఇప్పుడు మహాయుతిలో ప్రభుత్వ ఏర్పాటు కత్తిమీద సాములా మారింది. మహాయుతిలో ఆ మూడు పార్టీల మధ్య లాబీయింగ్ పర్వం కొనసాగుతోంది. దేవేంద్ర ఫడ్నవీస్, ఏక్‌నాథ్ శిండే, అజిత్ పవార్...ఈ ముగ్గురిలో మహారాష్ట్ర కొత్త సీఎం ఎవరు అనే ప్రశ్నకు ఇంకా సమాధానం రాలేదు. దీంతో మహారాష్ట్రలో తీవ్ర రాజకీయ ఉత్కంఠ నెలకొంది.

మహారాష్ట్రలోని 288 స్థానాలకు గాను 234 స్థానాలను ...10లో



జీవ పరిణామానికి బలమైన ఆధారాలు

ఆధిపత్యం నిలబెట్టుకునేందుకే దానిపై వ్యతిరేకత

ద్వేషించినా, దూషించినా సరే...

జీవ పరిణామ సిద్ధాంతం గొప్ప శాస్త్రం : ప్రొఫెసర్ ఎ.రామచంద్రయ్య

జేవీవీ తెలంగాణ ఆధ్వర్యంలో జీవ పరిణామ సిద్ధాంత ప్రచారోద్యమం ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీవ పరిణామానికి బ్రహ్మాండమైన ఆధారాలున్నాయని జన విజ్ఞాన వేదిక సైన్స్ కమ్యూనికేషన్స్ కన్వీనర్, ఎన్ఐటీ (వరంగల్) ప్రొఫెసర్ ఎ.రామచంద్రయ్య తెలిపారు. జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చెలిమల రాజేశ్వర్‌రావు అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో "జీవ పరిణామ సిద్ధాంత ప్రచార కార్యక్రమం" ప్రారంభమైంది.ఈ కార్యక్రమంలో జేవీవీ గౌరవాధ్యక్షులు, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ దాసరి ప్రసాద్ రావు ప్రచారోద్యమ గోడపత్రికను విడుదల చేశారు. జేవీవీ రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ కట్టా సత్య ప్రసాద్ రచించిన "దాచేస్తే దాగని సత్యం జీవ పరిణామం" పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ ఆధిపత్యం నిలబెట్టుకునేందుకు జీవ పరిణామ ...10లో

తెలంగాణ విముక్తికి మరో ఉద్యమం



60 ఏండ్ల స్వరాష్ట్ర పోరాటంలో చెరిగిపోని సంతకం కేసీఆర్

29న రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్ :

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు 11లో

శాసనసభాపక్ష నేతగా హేమంత్ సోరెన్

28న జార్ఖండ్ సీఎంగా ప్రమాణం



రాంచీ : జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందిన సీఎం, జేఎంఎం అధినేత హేమంత్ సోరెన్ కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సన్నాహాలు మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఆదివారం ఆయన గవర్నర్ సంతోష్ గంగ్వార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన గవర్నర్‌కు తన రాజీనామాను సమర్పించారు. కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఇండియా బ్లాక్ ఎమ్మెల్యేల మద్దతు లేఖను సమర్పించారు. సోరెన్ వెంట ఫోరం నేతలు ఉన్నారు. హేమంత్ సోరెన్ మాట్లాడుతూ 28న కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. ఇండియా ఫోరం తరపున ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించామన్నారు. రాజీనామాను గవర్నర్‌కు సమర్పించానన్నారు.గవర్నర్ తనకు తాత్కాలిక సీఎంగా బాధ్యతలు ...11లో

నవతెలంగాణ

అక్రమ నిర్మాణాల నేపథ్యంలో.. సినీ నటుడు అలీకి నోటీసులు

- ఎక్మామిడి గ్రామ పంచాయతీ జారీ



నవతెలంగాణ-నవాబుపేట

అక్రమ నిర్మాణాల విషయంలో సినీ నటుడు అలీకి పంచాయతీ కార్యదర్శి ఆదివారం నోటీసులు జారీ చేశారు. అక్రమ నిర్మాణాలపై వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం ఎక్మామిడి గ్రామంలోని నటుడు అలీ ఫామ్‌హౌజ్‌లో నిర్మాణాలు చేపట్టారు. వీటికి పంచాయతీ నుంచి అనుమతి లేదు. దాంతో ఈ నెల 5వ తేదీన అలీకి పంచాయతీ కార్యదర్శి శోభారాణి నోటీసులు జారీ చేశారు. నిర్మాణాలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు ఉంటే పంచాయతీలో అందజేయాలని తెలిపారు. దీనిపై అలీ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దాంతో మళ్లీ ఆదివారం రోజు పంచాయతీ కార్యదర్శి మరోసారి అలీకి నోటీసు ఇచ్చారు. అక్రమ నిర్మాణాలు వెంటనే నిలిపివేయాలని నోటీసులు పేర్కొన్నారు. మూడ్రోజుల్లో వివరణ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి స్పష్టం చేశారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నయా కిడ్నాపర్స్

- ప్లాట్స్ అమ్ముతామంటూ మహిళల వాయిస్‌తో ఫోన్ కాల్స్
- రియల్ ఎస్టేట్ వ్యాపారి నారాయణ కిడ్నాప్, అనంతరం విడిచిపెట్టిన దుండగులు

నవతెలంగాణ-ఆదిభట్ల

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నయా కిడ్నాపర్స్ హల్‌చల్ చేస్తున్నారు. ప్లాట్స్ అమ్ముతామంటూ లేడీస్ వాయిస్ కాల్స్‌లో పలువురికి ఫోన్లు చేసి ప్లాట్స్ ఉన్నవి అమ్మి పెట్టమంటూ మాటలు కలుపుతూ వ్యాపారులను కిడ్నాప్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనే రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం పట్టణం బోయవాడకు చెందిన నారాయణకు గుర్తు తెలియని వ్యక్తులు వారం రోజులుగా ఫోన్ కాల్ చేస్తూ తమకు ప్లాట్స్ ఉన్నవి అమ్మి పెట్టమని అడుగుతున్నారు. నారాయణ సరే అనడటంతో బొంగుళూర్ గేట్ సమీపంలోని మెట్రో సిటీ వెంచర్‌కి ఆదివారం పిలిపించుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న నలుగురు అగంతకులు నారాయణ కండ్లకు గంతలు కట్టి, గుర్తు తెలియని ప్రదేశానికి తీసుకెళ్లారు. నారాయణ తలకు గన్ గురిపెట్టి కోటీ రూపాయలు డిమాండ్ చేశారు. ఈ ఘటనతో ఒక్కసారిగా బెదిరిపోయిన నారాయణ భయంతో వణుకుతూ డబ్బులు లేవని చెప్పడంతో పది ఖాళీ పేపర్స్ మీద సంతకాలు చేయించుకున్నారు. అనంతరం ఓఆర్ఆర్‌పై నారాయణతోపాటు అతని డ్రైవర్‌ను వదిలిపెట్టిన ఆగంతకులు అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడు నారాయణ ఆదిభట్ల పీఎస్‌లో జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్య

- వికారాబాద్ జిల్లా యాలాల మండలంలో ఘటన

నవతెలంగాణ-యాలాల



యాదప్ప (ఫైల్) జ్యోతి

ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి దంపతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన వికారాబాద్ జిల్లా యాలాల మండలంలోని నాగసముందర్ గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగసముందర్ గ్రామానికి చెందిన మాసుల యాదప్ప(42), మాసుల జ్యోతి(32) దంపతులు. వీరికి కూతురు శ్రీలత, కుమారుడు సందీప్ ఉన్నారు. రెండేండ్ల క్రితం కూతురు వివాహం చేశారు. దీని కోసం దాదాపు రూ.7లక్షల వరకు అప్పు అయింది. వీరు వ్యవసాయ కూలీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కూతురి పెండ్లికి చేసిన అప్పు తీరకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలోనే పత్తికి వాడే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న యాలాల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాండూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కూతురు శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మెట్రోరైల్‌ను మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు విస్తరించాలి

- మెట్రోరైల్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సత్యనారాయణ
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావులకు వినతి



నవతెలంగాణ -పటాన్‌చెరు

మెట్రోరైల్‌ను మియాపూర్ నుంచి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మీదుగా ఇస్నాపూర్ వరకు పొడిగించాలని మెట్రోరైల్ సాధన సమితి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కె.సత్యనారాయణ కోరారు. ఈ మేరకు ఆదివారం మెట్రోరైల్ సాధన సమితి ఆధ్వర్యంలో కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావును కలిసి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇస్నాపూర్ వరకు మెట్రో రైలును విస్తరించాలని ప్రతిపాదించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవోలో పటాన్‌చెరు వరకు మాత్రమే ప్రతిపాదించిందని తెలిపారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన సంగారెడ్డి జిల్లాకు లాభం జరగాలంటే పారిశ్రామిక వాడ ఇస్నాపూర్ వరకు మెట్రోను పొడగించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేవిధంగా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై కిషన్‌రెడ్డి, రఘునందన్‌రావు సానుకూలంగా స్పందించినట్టు మెట్రోరైల్ సాధన సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్రోరైల్ సాధన సమితి సభ్యులు రుద్రారం శంకర్. అబ్దుల్ బాసిత్, ఈర్ల రాజు ముదిరాజ్, మెట్టు శ్రీధర్, పన్యాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛను పెంచాలి

- నేడు కలెక్టరేట్ల ముందు ధర్నాలు :ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగుల పింఛన్ రూ.ఆరువేలకు పెంచాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య ఒక ప్రకనట విడుదల చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయటంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్న నేపథ్యంలో నేడు అన్నికలెక్టరేట్ల ముందు ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ వికలాంగులకు పింఛన్ పెంపుతో పాటు అనేక హామీలను ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకొచ్చి 11 నెలలైనా వారికిచ్చిన హామీలను ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల ముందు ధర్నాలు నిర్వహించామనీ, అయినా హామీలులో సర్కారులో చలనం రానందున ధర్నాలు చేయబోతున్నామని తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణ విద్యార్థుల బాధ్యత

- భారత రాజ్యాంగం మతానికి కాదు.. మతోన్మాదానికే వ్యతిరేకం : ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో.. వక్తలు ప్రొఫెసర్ నాగేశ్వర్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి వి.కృష్ణయ్య



హాజరైన ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులు

సమాజం పట్ల స్పందించే గుణాన్ని ఎస్ఎఫ్ఐ కల్పిస్తోంది..

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

గాంధీజీ చెప్పినట్టు రాజ్యం, మతం ఒక్కటి కాదని, రాజ్యాంగ పరిరక్షణకు ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం బీజాలు వేయాలని ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థి, ప్రముఖ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. భారత రాజ్యాంగం మతానికి కాదు.. మతోన్మాదానికే వ్యతిరేకమని తెలిపారు. సమాజం పట్ల స్పందించే గుణాన్ని ఎస్ఎఫ్ఐ కల్పిస్తోందని తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్ ఏచూరి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ విజయవాడ మహాసభ ఇచ్చిన ఓ నినాదం గుర్తుచేశారు. 'ఎస్ఎఫ్ఐ స్టూడెంట్ ఈజ్ ఏ కంప్లీట్ స్టూడెంట్' అని నమ్మితే మనం ఎక్కడున్నా ఎస్ఎఫ్ఐ విలువలతో నడుచుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. సమాజం పట్ల స్పందించటమనేది మనకు ఎస్ఎఫ్ఐ నేర్పిందన్నారు. మరో రెండు రోజుల్లో భారత రాజ్యాంగ స్వర్ణోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఈ ఆత్మీయ సమ్మేళనం ఓ చారిత్రకతను సంతరించుకుందని తెలిపారు. ఖమ్మం జిల్లా ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం తెలుగునాట రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమానికి బీజాలు వేయాలన్నారు. రాజ్యాంగ విలువలపైన ఎందుకు ఉద్యమం జరగకూడదని ప్రశ్నించారు. జస్టిస్ చిన్నపరెడ్డి ఒక తీర్పులో "లౌకిక రాజ్యాంగం మతాతీత సమాజాన్ని కాదు.. మతాతీత రాజ్యాన్ని కోరుతుంది' అని చెప్పారన్నారు. 'స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం' అనే నినాదాన్ని ఎస్ఎఫ్ఐ ఇచ్చిన రోజు దాని లోతు తెలియకపోవచ్చు కానీ ప్రస్తుత సమాజంలో దాని ఆవశ్యకత ఏంటో బోధపడుతోందన్నారు. ఎస్ఎఫ్ఐ ఉద్యమ సమయంలో భారత రాజ్యాంగంలోని మౌలిక విలువలు.. మతం, లౌకికతత్వంపై ఘర్షణ పడ్డామని, ఇప్పుడు ఆ ఘర్షణ విశ్వరూపం చూస్తున్నామని తెలిపారు. మత విశ్వాసాలున్న వారిని వ్యతిరేకించాల్సిన అవసరం లేదని, కానీ మతం ఆధారంగా రాజకీయ సమీకరణాలు, సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టడాన్ని, మతాన్ని జాతీయతతో ముడిపెట్టే ఆలోచనలను వ్యతిరేకించాలని స్పష్టంచేశారు. మన పోరాటం మతంపైన కాదు.. మత ఉన్మాదం పైన అని అన్నారు. రాష్ట్రాల రాజకీయ ఉనికిపైన, న్యాయవ్యవస్థ స్వయం ప్రతిపత్తిపైన, భారతీయత భావనపైన దాడి జరుగుతోందన్నారు. ఆర్థిక అసమానతలు తొలగిపోవాలన్నారు. గౌతమ్ అదానీ గంటకు రూ.1600 కోట్లు సంపాదిస్తున్నారని, కానీ దేశంలో కటిక పేదరికంలో మగ్గేవారు అనేక మంది ఉన్నారని తెలిపారు. మతాన్ని విద్వేషంగా వాడుతున్న వారితో ఏ రకంగా ఎస్ఎఫ్ఐ ఉద్యమంలో పోరాడామో.. ఇప్పుడు కూడా ఆ మత విద్వేషాలకు వ్యతిరేకంగా ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఒక అంకురార్పణ కావాలని పిలుపునిచ్చారు.

1500 మంది హాజరు..

ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి 1500 మంది వరకు పూర్వవిద్యార్థులు హాజరయ్యారు. ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల్లో ఇప్పుడు ప్రజాప్రతినిధులుగా ఉన్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జెడ్పీ మాజీ చైర్మెన్ లింగాల కమలరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, నంది అవార్డు గ్రహీత దేవేంద్ర తదితరులు ప్రసంగించారు. ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులు ఆలపించిన గేయాలు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా భారతీయతకు భూమిక, నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన సీతారాంఏచూరి, జనవిజ్ఞాన వేదిక జీవ పరిణామం తదితర పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. దీనికి ముందు ఎస్ఎఫ్ఐ జాతీయ మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి, ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి మాటూరి రామచంద్రరావు సహా అశువులు బాసిన ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులకు సంతాపం తెలుపుతూ ఎస్ఎఫ్ఐ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి ఏజే రమేష్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి ముందు ఎస్ఎఫ్ఐ పతాకాన్ని సీనియర్ పూర్వ విద్యార్థి కొండపల్లి పావన్ ఆవిష్కరించగా.. మరో విద్యార్థి వీవీ లక్ష్మీనారాయణ రాజ్యాంగ ప్రవేశిక పఠనం ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక కన్వీనర్ ఎం.సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ ఆత్మీయ సమ్మేళనం కన్వీనర్ వెల్లంపల్లి శ్రీనివాసరావు, విప్లవ్‌కుమార్, కళ్యాణం వెంకటేశ్వర్లు, అనురాధ అధ్యక్షవర్గం గా ఈ ఆత్మీయ సమ్మేళనం కొనసాగింది.

భారతదేశం కార్పొరేట్ల రాజ్యమైంది.. : వి.కృష్ణయ్య



మోడీ అధికారంలోకి వచ్చాక భారతదేశం కార్పొరేట్ల రాజ్యంగా మారిందని ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి వి.కృష్ణయ్య అన్నారు. ఎస్ఎఫ్ఐ అంటే ఆకాశం ఎంత ఎత్తు ఉందో అంత ఎత్తున ఆలోచించమనే భావోద్వేగం, అధ్యయనం పోరాటం నినాదం.. మా దేహం ముక్కలైనా ఈ దేశాన్ని ముక్కలు కానివ్వమని చెప్పిన సిద్ధాంతం అన్నారు. 'స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం' మూడు లక్ష్యాలు ఢిల్లీలో మోడీ వచ్చాక ప్రమాదంలో పడ్డాయని తెలిపారు. భారతరాజ్యాంగాన్ని ఎలా కాపాడుకోవాలో మనందరికీ సీతారాం ఏచూరి విప్పిచెప్పారన్నారు. మోడీ పదేండ్లలో 252 చట్టాలు చేశారని, వీటి ద్వారా దేశంలో మన జీడీపీలో 50శాతం కార్పొరేట్ కంపెనీల వాటా అయిందన్నారు. రైతుల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులన్నింటిపై కార్పొరేట్ కంపెనీల పెత్తనమేనని తెలిపారు. ప్రజల చేతుల్లో ఉండాల్సిన స్వాతంత్ర్యం ఇప్పుడు ఎవరి చేతుల్లో ఉందని ప్రశ్నించారు. భారత స్టాక్ మార్కెట్లోని 1500 కంపెనీల్లో 50 శాతం కార్పొరేట్ వాటా ఉందని అన్నారు. ప్రజలందరీ స్వాతంత్ర్యం కార్పొరేట్ స్వాతంత్రంగా మారుతోందన్నారు. ప్రజాస్వామ్యయుతంగా నడవాల్సిన పార్లమెంట్.. మోడీ, ఆర్ఎస్ఎస్ నిర్ణయాల ప్రకారం జరుగుతున్నదని అన్నారు. రాష్ట్రాల హక్కులను కూడా హరించి వేస్తున్నారని, చివరకు పంట కాల్వల్లో పారే నీరు కూడా వారి నియంత్రణలో ఉంటోందని ఆరోపించారు. దేశంలోని 11 కోట్ల హెక్టార్ల భూములను రెండేండ్లలో డిజిటలైజ్ చేయాలని కేంద్రం ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. రాజ్యాంగమైనా ఉంటుందా.. అంటే ఉండకూడదూ అని బీజేపీ, ఆర్ఎస్ఎస్ నిర్ణయించుకున్నాయన్నారు. పెట్టుబడిదారీ మార్కెట్ కోసం ప్రపంచాన్ని అణుయుద్ధం వైపు పయనింపజేస్తున్నారని తెలిపారు. సోషలిజం వైపుగా ఈ ప్రపంచాన్ని నడిపించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వామపక్షాలు మినహా మిగిలిన రాజకీయ పార్టీలు అవినీతి చేస్తే తప్ప నడవలేని పరిస్థితి ఉందన్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలందరిని యధావిధిగా రెగ్యులర్ చేయాలి

- నేడు డీఎంహెచ్ఓ కార్యాలయాల ముందు ధర్నాలు జయప్రదం చేయాలి : వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కాంట్రాక్ట్ ఏఎన్ఎంలందరిని యధావిధిగా రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో నవంబర్ 25న (నేడు) 33 జిల్లాల డీఎంహెచ్ఓ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహిస్తున్నట్టు వైద్యారోగ్య శాఖలోని అన్ని యూనియన్లు, అసోసియేషన్ల ఆధ్వర్యంలో గల వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ తెలిపింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కమిటీ సమావేశంలో ఆ కమిటీ రాష్ట్ర నాయకులు కె.యాద నాయక్, కె.సాయి రెడ్డి, శ్యాంసుందర్, శ్రీనివాస్, ఈ. కిరణ్ రెడ్డి, మధురిమ, మమత, ఏ.కవిత, సకల రెడ్డి, ఎండి.ఫసియుద్దీన్, జి.రాజశేఖర్, మత్స్యగిరి, ప్రియాంక, కే.సరోజ, పి.మంజుల, పుష్పలత, విజయ తదితరులు పాల్గొన్నారు.ధర్నాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఏఎన్ఎంలు 20 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్నా రెగ్యులర్ చేయకపోవడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 సంవత్సరాలుగా సమస్యల పరిష్కారానికి వివిధ రూపాల్లో ఆందోళన పోరాటాలు, నిరవధిక సమ్మెలు జరిగాయని ఆయా ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు. గతంలో సమ్మె సందర్భంగా ఏఎన్ఎంల న్యాయమైన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్ 2న ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ఈ కమిటీ ఏఎన్ఎంలతో చర్చించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉన్నా... ఆ కమిటీ రిపోర్ట్ లేకుండా రాత పరీక్ష తేదీలు ప్రకటించడం వల్ల ఏఎన్ఎం తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఈ కమిటీని ఏఎన్ఎంలతో సమావేశపరిచి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు రాత పరీక్ష లేకుండా యధావిధిగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలకు ప్రభుత్వ స్పందనను బట్టి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్సీ కవిత పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని నివాసంలో జగిత్యాల నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యేలు పార్టీ మారారనే అంశంతో సంబంధం లేకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ గ్రామాన గులాబీ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఇంత ప్రజా వ్యతిరేకత మూట గట్టుకున్న ప్రభుత్వం భారత దేశ చరిత్రలో ఎక్కడా లేదని విమర్శించారు. ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయకుండా పార్టీ మారిన వ్యక్తులను ప్రజలు క్షమించరని వ్యాఖ్యానించారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి ఇంకో పార్టీకి మారిపోయినప్పుడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తేనే ప్రజలు ఆదరిస్తారని అన్నారు. అలా కాకుండా పదవినే పట్టుకుని పాకులాడితే ప్రజలు క్షమించరని స్పష్టం చేసారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ఏ ఒక్క పథకాన్ని ప్రారంభించలేదని విమర్శించారు. అనంతరం బీసీ నాయకులతో సమావేశమై కులగణనపై చర్చించారు. రాష్ట్రంలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం సమగ్రమైన నివేదికను కమిషన్‌కు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, బీసీ నేతలు గట్టు రాంచందర్‌రావు, బొల్లా శివశంకర్, రాజారాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌మీట్ పెట్టే స్వేచ్ఛకూడా లేదా?

- అరెస్టులకు భయపడం ... బిల్లులిచ్చేదాకా పోరాటం
- డిసెంబర్ 1 తర్వాత కుటుంబ సభ్యులతో మాజీ సర్పంచుల ఆందోళనలు
- ప్రభుత్వం రూ.750 కోట్లు ఇచ్చిందనేది పచ్చి అబద్ధం
- ఇవ్వని వాటిని కూడా ఇచ్చామనటం సీఎం హోదాకు తగదు :తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తాము గ్రామాల్లో అభివృద్ధి చేసిన పనులకు సంబంధించిన బిల్లులను ఇవ్వలేదని ప్రెస్‌మీట్ పెట్టి చెప్పే స్వేచ్ఛ లేదా? ఉగ్రవాదుల లెక్క మాజీ సర్పంచులను అరెస్టు చేయడం ఏంటి? పోలీసు స్టేషన్లకు తరలించడం ఏంటి? అని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపాక నాగయ్య, ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి పూడూరి నవీన్‌గౌడ్, కార్యదర్శి శేషబోయిన మల్లేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. డిసెంబర్ ఒకటో తేదీ వరకు పెండింగ్ బిల్లులను ఇవ్వకపోతే మాజీ సర్పంచులంతా కుటుంబ సభ్యులతో ఆందోళనకు దిగుతారని హెచ్చరించారు. గ్రామాల్లో మాజీ సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి రూ.750 కోట్ల బిల్లులను చెల్లించామని సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పడం ఆయనకు తగదన్నారు. ఆదివారం సచివాలయం సమీపం లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రెస్‌మీట్ పెట్టి వివరాలు వెల్లడిస్తామన్న తమను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం దారుణమన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకూ పంచాయతీ కార్మికులకు వేతనాలు, వీధిలైట్లు, బోర్ మోటార్లకు కరెంటు బిల్లులు, ఉపాధి హామీ చట్టం కింద వేసిన సీసీ రోడ్లు, కట్టిన పంచాయతీ భవనాలకే బిల్లులు వచ్చాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎస్‌డీఎఫ్ నిధులుగానీ, ఎస్ఎఫ్‌సీ నిధులుగానీ ఇవ్వలేదని తేల్చిచెప్పారు. పంచాయతీ జనరల్ ఫండ్ నిధులను ఫ్రీజింగ్‌లో పెట్టారని తెలిపారు. ఇప్పటికీ సర్పంచుల చెక్కులు ట్రెజరీలో మూలుగుతున్నాయని చెప్పారు. 2024 కి పూర్వం పెండింగ్ నిధుల్లో ఒక్కరూపాయి కూడా విడుదల చేయలేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సంబం ధించి కాంట్రాక్టర్లకు 40 వేల కోట్ల బిల్లులను ప్రస్తు త ప్రభుత్వం క్లియర్ చేసిందనీ, మాజీ సర్పంచు లకు చెందిన రూ.1200 కోట్ల పెండింగ్ బిల్లులను ఇవ్వడానికి ఎందుకు చేతులు రావడం లేదని ప్రశ్నించారు. మాజీ సర్పంచులను మంత్రులు, ఆఫీసర్లు సచివాలయం చుట్టూ, అసెంబ్లీ చుట్టూ తిప్పించుకోవడం తగదనీ, ఇది కక్షసాధిం పే అవుతుందని చెప్పారు. భేషజాలకు పోకుండా మాజీ సర్పంచుల బాధల్ని అర్థం చేసుకొని ఇచ్చేది కాస్త ఒకేసారి బిల్లుల్ని విడుదల చేయాలని కోరారు.



నాణ్యమైన విత్తనాలందించడంలో ఉద్యోగులది కీలక పాత్ర

- ఆత్మీయ సమ్మేళనంలో జేఏసీ చైర్మెన్ లచ్చిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాణ్యమైన విత్తనాలందించడంలో విత్తన ధ్రువీకరణ ఉద్యోగులది కీలక పాత్ర అని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) చైర్మెన్ వి. లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థకు చెందిన ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన ధ్రువీరణ సంస్థను వ్యవసాయ సహకార శాఖ ప్రత్యేక విభాగం కింద పరిగణించి, డిపార్ట్ మెంట్ హోదా కల్పించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. సంస్థ అభివృద్ధి విషయంలో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ తిరుపతి నాయక్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో విత్తన ధ్రువీకరణ సంస్థల పనితీరు అధ్యయనం చేసి విభాగంలో మార్పులు తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సర్కార్‌కు సూచించారు. తెలంగాణ విత్తన రంగ అభివృద్ధిలో ధ్రువీకరణ అధికారుల పాత్ర, ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేకంగా చర్చించారు. ఉద్యోగుల పెన్షన్‌ను రూ. 30 వేలకు పెంచాలనీ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పరిగణించాలనీ, ఉద్యోగులకు కొత్త హెల్త్ ఇన్స్యూరెన్స్ పాలసీని తీసుకొచ్చి ఆరోగ్య భద్రత కల్పించాలని సమావేశం తీర్మానించింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ విత్తన ధ్రువీరకరణ అధికారుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.జయ ప్రకాష్, పెబ్బేటి మహేష్, కోశాధికారి పృథ్విరాజ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం దేశానికి దిక్సూచి

- మంత్రి పొన్నం ప్రభాకర్




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం దేశానికి దిక్సూచిగా పనిచేస్తున్నదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని మన్సూరాబాద్‌లో జరిగిన పెరిక సామాజిక తరగతి కార్తీక వనభోజనాల కార్యక్రమంలో వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వన భోజనాలు సామాజిక తరగతుల ఐక్యతకు తోడ్పడతాయన్నారు. ప్రభుత్వం ఇంటింటి సర్వే చేపట్టిందనీ, దీంతో సామాజిక తరగతుల జనాభా తెలుస్తున్నదన్నారు. దీనికి అనుగుణంగా ప్రభుత్వ పథకాలు, ఆయా వృత్తుల అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. ఇంత ప్రాముఖ్యత కలిగిన ఆ సర్వేలో కుల పెద్దలు పాల్గొనాలనీ, సర్వే చేసే వారికి సహకరించాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పడగానే పెరిక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. రూ. 50 కోట్ల నిధులు కేటాయించామన్నారు. యువత ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకునేందుకు దోహద పడుతుందని తెలిపారు.కుల గణన చేసుకోవటం మూలంగా ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరం అభివృద్ధి చేందేందుకు ఉపయోగపడుతున్నదని చెప్పారు. ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ పెరిక కుల కార్పోరేషన్ సాధన సమితి కోరిక మేరకు పెరిక కులానికి కార్పోరేషన్ ఏర్పాటు చేసి, రూ.50 కోట్లు కేటాయించిన ఘన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఈ అంశం లో అత్యంత ముఖ్య పాత్ర పోషించిన ఆనాటి బీసీ డిక్లరేషన్ కమిటీ చైర్మెన్, ప్రస్తుత బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి ఫలితమేనన్నారు. ఆయనతో పాటు ఇందుకు కృషి చేసిన టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కుల పెద్దలు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శిగా అనురాగ్ సక్సేనా

- ఎనిమిది మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం
- 30 మందితో రాష్ట్ర కమిటీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీపీఐ(ఎం) ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శిగా అనురాగ్ సక్సేన ఎన్నిక అయ్యారు. మూడు రోజుల పాటు న్యూఢిల్లీలోని హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో జరిగిన సీపీఐ(ఎం) ఢిల్లీ 17వ రాష్ట్ర మహాసభ ఆదివారం ముగిసింది. మహాసభ ఎనిమిది మంది సభ్యులతో కూడిన కార్యదర్శివర్గం, 30 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర కమిటీని ఎన్నుకుంది. రాష్ట్ర కార్యదర్శిగా ప్రస్తుత సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి అనురాగ్ సక్సేనాను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కార్యదర్శి వర్గంలో కెఎం తివారీ, పిఎంఎస్ గ్రావాల్, ఆశా శర్మ, సుబీర్ బెనర్జీ, రాజీవ్ కున్వర్, సెబా ఫరూకీ, పివి అనియన్ ఉన్నారు. కార్యదర్శి వర్గానికి ఆహ్వానితుడిగా సిద్దేశ్వర్ శుక్లేను ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో ఆరుగురు కొత్త ముఖాలకు చోటు దక్కింది. ఎనిమిది మంది మహిళలు ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీలో జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షురాలు, ఎస్ఎఫ్ఐ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి ఐషి ఘోష్ కూడా ఉన్నారు. అఖిల భారత మహాసభకు నలుగురు ప్రతినిధులు ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న కెఎం తివారీ రిలీవ్ అయ్యారు. సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్ కరత్, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్ మహాసభకు హాజరై ప్రసంగించారు. మతోన్మాద, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని, వర్గ పోరాటాలను తీవ్రతరం చేయాలని మహాసభ నిర్ణయించింది. అనురాగ్ సక్సేనా 1996 నుంచి పూర్తికాలం పార్టీ కార్యకర్తగా ఉన్నారు. ఆయన ప్రస్తుతం సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. 2009లో తొలిసారిగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఢిల్లీలో అనేక కార్మిక పోరాటాలకు నాయకత్వం వహించారు. 1995 నుంచి 2003 వరకు కీలక సమయంలో ఎస్ఎఫ్ఐ ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేశారు. పోలీసుల క్రూరమైన దాడులతో పాటు అనేక కేసులు కూడా ఎదుర్కొన్నారు. 2003లో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక అయ్యారు.

పేట్రేగిపోతున్న ఇజ్రాయిల్

- గాజాలో 120 మంది ఊచకోత
- లెబనాన్‌లో మరో 15 మంది మృతి



గాజా: అమెరికా అండ చూసుకుని ఇజ్రాయిల్ అంతకంతకూ పేట్రేగి పోతోంది.మరీ ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడిగా పచ్చి మితవాది డొనాల్డ్ ట్రంప్ మళ్లీ ఎన్నికైన తరువాత నెతన్యాహు యుద్ధోన్మాదం పతాక స్థాయికి చేరుకుంది. అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసీసీ) నెతన్యాహును యుద్ధ నేరస్తుడిగా పరిగణించి ,అయన అరెస్టుకు వారెంట్ కూడా జారీ చేసింది. అయినా, డోన్ట్ కేర్ అన్న రీతిలో ఈ ఫాసిస్టు నేత వ్యవహరి స్తున్నాడు.గడిచిన 48గంటల్లో ఇజ్రాయిల్ జరిపిన క్రూర దాడుల్లో గాజాలో 120 మంది, బీరుట్‌లో 15 మంది మరణిం చారు. గాజా స్ట్రిప్ అంతటా ఇజ్రాయిల్ తన సైనిక దాడులను తీవ్రతరం చేసింది. గాజా ఉత్తర కోస్తా తీరాన ఉన్న ఆసుపత్రిపై బాంబుల వర్షం కురిపిం చింది. ఈ పాశవిక దాడిలో వైద్య సిబ్బంది కూడా గాయపడ్డారు. ఇదిలా వుండగా శనివారం లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో 15 మంది చనిపోయారు.

లేబర్ కోడ్‌లు అమలు చేయొద్దు

అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపండి

ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి.. ఆంక్షలు ఎత్తేయండి

- జీవోలను సవరించి కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించండి
- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి
- వీఆర్ఏల వారసులకు వారసత్వ ఉద్యోగాలివ్వాలి
- ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలో కార్మిక వర్గం సమస్యలను పరిష్కరించాలి : సీఎం రేవంత్‌రెడ్డికి సీఐటీయూ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కార్మికుల హక్కులను హననం చేసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను తెలంగాణలో అమలు చేయవద్దని సీఎం రేవంత్‌రెడ్డిని సీఐటీయూ రాష్ట్ర కమిటీ కోరింది. లేబర్‌కోడ్‌లను అమలు చేయబోమంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో ఉద్యోగులు, సంఘటిత, అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించింది. ఈ మేరకు సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డికి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు. 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ సవరించేందుకు జారీ చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో పెరుగుతున్న నిత్యావసర ధరలను పరిగణనలోకి తీసుకోని విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. అలా చేస్తే రాష్ట్రంలోని 1.20 కోట్ల మంది కార్మికులకు ప్రయోజనం కలుగుతుందనే విషయాన్ని సీఎంకు వివరించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర నాన్ పర్మినెంట్ ఉద్యోగులు, కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులివ్వాలని విన్నవించారు. పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచడంతో పాటు ఆరేడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలనీ, ఎన్నికల హామీ మేరకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని విన్నవించారు. రెండో పీఆర్సీలో మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఎన్ని మ్యానిఫెస్టోలో పొందుపర్చినట్టుగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రూ.18, వేల వేతనాన్ని ఇవ్వాలని విన్నవించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ కొత్త జీఓ జారీ చేయాలన్నారు. ఆశా వర్కర్లకు పారితోషికాలు కాకుండా ఫిక్సిడ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వహణకు అవసరమైన గ్యాస్‌ను ప్రతి పాఠశాలకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాలని, ఎన్నికల హామీ ప్రకారం మిడ్‌డే మీల్స్ కార్మికులకు రూ.10 వేల గౌరవ వేతనం చెల్లించాలని విన్నవించారు. ఐకేపీ విఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలనీ, ఎన్నికల హామీ మేరకు వేతనాన్ని రూ.20 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

మీసేవా, కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఏఎన్ఎం, ఎన్‌హెచ్ఎం, ఆస్పత్రుల్లో పనిచేసే కార్మికులు, 104, 108, ఆరోగ్యశ్రీ, టిసాక్స్, ఆయుష్, వైద్య విధాన పరిషత్ విభాగాల్లో పనిచేస్తున్న వేలాది మంది సిబ్బంది సర్వీసులు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. హెల్త్ డైరెక్టరేట్ పరిధిలో జీఓ నెం.142ను రద్దు చేయాలని, వైద్య విధాన పరిషత్ అటానమస్ హోదాను రద్దు చేసి ఉద్యోగులకు చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలన్నారు. జీఓ నెం.317 ద్వారా వస్తున్న ఉద్యోగుల విజ్ఞప్తులను పరిష్కరించాలనీ, ఆరోగ్యమిత్రలకు క్యాడర్ మార్పు చేసి వేతనాలు పెంచాలని కోరారు. ఎన్‌హెచ్ఎంలో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, యూనివర్సిటీల్లో నాన్ టీచింగ్ డైలీవేజ్, ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర సిబ్బందికి రెగ్యులర్ ఉద్యోగులకు ఇస్తున్న మూల వేతనాన్ని కనీస వేతనంగా చెల్లించాలని కోరారు.ఆర్టీసీని కార్మికోద్యమంపై ఆంక్షలు ఎత్తివేసి ప్రజాతంత్ర హక్కులు కల్పించాలనీ, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని విన్నవించారు. సింగరేణి కార్మికులకు సొంతిటి కల నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కోలిండియాలో మాదిరిగా ఆదాయ పన్నును సింగరేణి కార్మికులకు తిరిగి చెల్లించాలనీ, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కోలిండియా సిఫారసు చేసిన హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలనీ, విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులందరికీ అర్హతను బట్టి జెఎల్ఎం, జూనియర్ అసిస్టెంట్స్, సబ్ ఇంజనీర్స్, ఓఎస్‌లుగా కన్వర్షన్ ఇవ్వాలని, అన్‌మెన్డ్ కార్మికులను ఆర్టిజన్స్‌గా గుర్తించాలని కోరారు. ఈపీఎఫ్ టు జీపీఎఫ్ మొత్తం ఉద్యోగులకు అమలు చేయాలని, విద్యుత్ సంస్థలో ఉన్న 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ చేయాలని కోరారు. ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న పిఆర్‌సి, డిఎ, హెచ్‌ఆర్ఏ మరియు వయోపరిమితి పెంపును అమలు చేయాలనీ, అందుకు తగిన ఉత్తర్వులు ఇవ్వాలని విన్నవించారు. భవన నిర్మాణ కార్మికులకు గత ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన మోటార్ సైకిల్స్, స్కూటీలు వెంటనే ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికుల సలహా మండలి కమిటీని కార్మిక సంఘాల నాయకులతో నియమించాలని కోరారు. బీడీ కార్మికులకు 26 రోజుల పనికల్పించి కనీస వేతనం ఇవ్వాలన్నారు. పీఎఫ్‌తో ముడి పెట్టకుండా బీడీ పరిశ్రమలో పనిచేసే అన్ని కేటగిరీ కార్మికులకు జీవనభృతి రూ.4,016 చెల్లించాలని కోరారు. హమాలీలకు, రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్‌బోర్డులు ఏర్పాటు చేయాలనీ, వారికి రూ.10 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించాలని విన్నవించారు. మహాలక్ష్మితో ఉపాధి దెబ్బతిన్న నేపథ్యంలో ప్రతినెలా ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.4,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అవసరమయ్యే వస్త్రాలను, మహిళా సంఘాలకు ఇచ్చే చీరలను తయారు చేసే బాధ్యతను చేనేత కార్మికులకు అప్పగించాలని కోరారు. వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అమలు చేయాలని విన్నవించారు. పవర్‌లూమ్ కార్మికుడికి ప్రభుత్వ గ్యారంటీతో రూ.5 లక్షల పెట్టుబడి సాయం అందివ్వాలని విన్నవించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల నుండే అందులో పనిచేసే కార్మికులకు వేతనాలు, ఈపిఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని, రూ.5 లక్షల బీమా పాలసీ చేయించాలని కోరారు. జీఓ నెం.81 ప్రకారం మిగిలిన 3,797 మంది విఆర్ఏ వారసులకు ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ శాఖల ద్వారా రిపోర్టులు తెప్పించి తగు చర్యలు తీసుకొని పరిష్కరిస్తానని సీఎం హామీనిచ్చారని తెలిపారు.

జార్ఖండ్ అసెంబ్లీలో

12 మంది మహిళా ఎమ్మెల్యేలు





రాంచీ : జార్ఖండ్ నూతన శాసనసభకు మహిళలు రికార్డు స్థాయిలో ఎన్నికయ్యారు. తాజా ఎన్నికల్లో 12 మంది మహిళలు విజయం సాధించి శాసనసభలో ప్రవేశించబోతున్నారు. 2005లో ముగ్గురు, 2009లో 8 మంది, 2014లో 9 మంది, 2019లో 10 మంది మహిళా ఎమ్మెల్యేలు జార్ఖండ్ శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. కొత్త ఎమ్మెల్యేల్లో 59 శాతం మంది పట్టభద్రులు కావడం విశేషం. జార్ఖండ్ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ఇండి కూటమికి 56 స్థానాలు లభించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన వారిలో 41 శాతం మంది హయ్యర్ సెకండరీ వరకూ విద్యను అభ్యసించారు. 37 శాతం మంది గ్రాడ్యుయేషన్ పూర్తి చేయగా 22 శాతం మంది పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివారు. నూతన శాసనసభలో 70 శాతం మంది ఎమ్మెల్యేలు వృత్తిపరంగా రాజకీయ నాయకులు లేదా సామాజిక కార్యకర్తలు. 37 శాతం మంది వ్యాపారాల్లో ఉన్నారు. 31 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడిన వారే. కేవలం రెండు శాతం మంది మాత్రమే గతంలో పభుత్వోద్యోగాలు చేశారు. నూతన శాసనసభ్యుల్లో 16 శాతం మంది 25-40 సంవత్సరాల మధ్య వయస్కులు కాగా 47 శాతం మంది 41-55 సంవత్సరాల మధ్య వయసున్న వారు. 31 శాతం మంది 56-70 సంవత్సరాల మధ్య వయస్కులు కాగా 6 శాతం మంది 70 సంవత్సరాల పైబడిన వారు.

ఝాన్సీ ఆస్పత్రి దుర్ఘటన

- మరో ఇద్దరు శిశువుల మృతి
- 17కు చేరిన మృతుల సంఖ్య

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఝాన్సీ పట్టణంలోని ఆస్పత్రిలో జరిగిన అగ్ని ప్రమాదం నుంచి రక్షించిన నవజాత శిశువుల్లో మరో ఇద్దరు ఆదివారం మరణించారు. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 17కు చేరుకుంది. ఈ విషయాన్ని ఆస్పత్రికి చెందిన సీనియర్ అధికారి ఒకరు ఆదివారం తెలిపారు. ఈ నెల 15 రాత్రిన మహారాణి లక్ష్మీ బాయ్ మెడికల్ కాలేజీ ఆస్పత్రి చిన్నపిల్లల వార్డులో అగ్నిప్రమాదం సంభవించిన సంగతి తెలిసిందే. అదే రోజున 10 మంది నవజాత శిశులు మరణించగా, 39 మందిని రక్షించి వేరే వార్డుకు తరలించారు. వీరిలో ఇద్దరు శనివారం మరణించారని ఆస్పత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర సింగ్ సెనగార్ ఆదివారం తెలిపారు. ఈ మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించామని, ఇందులో 'అనారోగ్యం' కారణంగానే శిశువులు మృతి చెందినట్లు రుజువయిందని చెప్పారు. కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించినట్లు తెలిపారు.

గవర్నర్ తీరుపై గుస్సా

తన విగ్రహాన్ని తానే ఆవిష్కరించుకున్న పశ్చిమ బెంగాల్ గవర్నర్

- తప్పుబట్టిన అధికార టీఎంసీ, సీపీఐ(ఎం), కాంగ్రెస్
- సామాజి మాధ్యమాల్లో వీడియో వైరల్.. నెటిజన్ల ఆగ్రహం



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ గవర్నర్ సి.వి ఆనంద్ బోస్ చర్య వివాదాంశంగా మారింది. గతంలో ఓ మహిళపై రాజ్‌భవన్‌లోనే లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు వచ్చిన విషయం విదితమే. తాజాగా గవర్నర్‌గా రెండేండ్ల పదవీ కాలం పూర్తైన సందర్భంగా రాజ్‌భవన్‌లో ఒక కార్యక్రమంలో భాగంగా ఆయన తన విగ్రహాన్ని తానే ఆవిష్కరించుకున్నారు. ఈ చర్య ఇప్పుడు రాజకీయంగా తీవ్ర వివాదానికి దారి తీసింది. గవర్నర్ చర్యను ప్రతిపక్ష పార్టీలు తప్పుబట్టాయి. పాఠశాల విద్యార్థుల కోసం రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన డ్రాయింగ్ పోటీనీ, పేయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించటానికి ముందు గవర్నర్ తన విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు సైతం తీవ్రంగా స్పందించారు. అయితే, గవర్నర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయలేదనీ, అది ఒక కళాకారుడు బహూకరించాడని గవర్నర్ కార్యాలయం వివరణ ఇచ్చింది.

గవర్నర్ చర్యపై పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) స్పందించింది. దీనిని పబ్లిసిటీ స్టంట్‌గా అభివర్ణించింది. " ఎక్కడా వినని విధంగా మన గవర్నర్ సి.వి ఆనంద్ బోస్.. తన విగ్రహాన్ని తానే ఆవిష్కరించుకున్నారు. ఆయన తనకు కొంత పబ్లిసిటీ కావాలనుకున్నారు. అందుకే ఇలా చేశారు. తర్వాత ఏం చేస్తారు? ఆయన తన విగ్రహానికి పూలమాల వేస్తారా?" అని టీఎంసీ నేత జయప్రకాశ్ మజుందార్ అన్నారు. గవర్నర్ చర్య అవమానకరం, దురుదృష్టకరమని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు సుజన్ చక్రవర్తి అన్నారు. ఇది సిగ్గుపడాల్సిన విషయమనీ, బెంగాల్ సంస్కృతిపై చిన్న ఆటగా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సౌమ్య ఐచ్ రాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సి.వి ఆనంద్ బోస్ చర్యతో రాజకీయ దుమారం

గవర్నర్ తీరుపై ప్రతిపక్షాలే కాదు.. ఇటు నెటిజన్లు సైతం తీవ్రంగా స్పందిస్తున్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఆయన.. రాజ్‌భవన్‌లో తన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అయితే, కోల్‌కతాలోని ఇండియన్ మ్యూజియంకు చెందిన ఆర్టిస్ట్ పార్థ సాహా.. ఈ విగ్రహాన్ని గవర్నర్‌కు బహూకరించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. విగ్రహాన్ని గవర్నర్ ఏర్పాటు చేయలేదనీ, ఆర్టిస్ట్, ఇండియన్ మ్యూజియం నుంచి గిఫ్ట్‌గా వచ్చిందని గవర్నర్ కార్యాలయం స్పష్టతనిచ్చింది. అయినప్పటికీ, ఈ ఘటనపై విమర్శనల పర్వానికి అడ్డుపడలేదు. బతికున్న వ్యక్తి విగ్రహ ఏర్పాటు ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఆనంద్ బోస్.. రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టి రెండేండ్లు కావస్తున్నది. ఈ రెండేండ్లలో ఇటు ఇటు గవర్నర్‌కు, అటు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య అంత సఖ్యత లేదనే రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. గవర్నర్ వ్యవహార శైలిని అధికార టీఎంసీ ఎప్పటికప్పుడూ వ్యతిరేకిస్తూ వస్తున్నదనీ, ఇలాంటి తరుణంలో విగ్రహావిష్కరణ చర్య ఆయనకు మైనస్‌గా మారుతుందని అంటున్నారు. కాగా, తన విగ్రహావిష్కరణ సమయంలో.. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి ఏమాత్రమూ బాగాలేదని గవర్నర్ చెప్పటం గమనార్హం.

కుదిరిన రాజీ

మాట నెగ్గించుకున్న సంపన్న దేశాలు

- 30 వేల కోట్ల డాలర్ల ప్యాకేజీతో సరి



బాకూ: కాప్ ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్‌కి సంబంధించిన పార్టీల కాన్ఫరెన్స్ 29వ సెషన్‌లో సంపన్న దేశాలు తమ మాట నెగ్గించుకున్నాయి. వాతావరణంలోకి పెద్దయెత్తున కర్బన ఉద్గారాలను విడుదలజేసే సంపన్న దేశాలు క్లైమేట్ ఫైనాన్స్ కింద ఏటా లక్షా 30 వేల కోట్ల డాలర్లు చెల్లించాలని పేద, వర్ధమాన దేశాలు పట్టుబట్టగా సంపన్న దేశాలు 25 వేల కోట్ల డాలర్లతో సరిపెట్టాలని చూశాయి. దీనిని ఎట్టి పరిస్థితుల్లోను తాము అంగీకరించేది లేదని బడుగు దేశాలు స్పష్టం చేయడంతో కాప్-29 చర్చలు ప్రతిష్టంభనలో పడ్డాయి. దీనిని తొలగించడం కోసం సంపన్న దేశాలు కంటి తుడుపు చర్యగా 30 వేల కోట్లకు పెంచుతూ సరికొత్త ప్రతిపాదనను ఆఖరి నిమిషంలో తీసుకొచ్చాయి. ఇంతకు మించి ఒక్క డాలర్ కూడా అదనంగా ఇచ్చేది లేదని తెగేసి చెప్పాయి. అప్పటికే కాలాతీతం కావడంతో అనేక తర్జన భర్జనల అనంతరం ఆదివారం తెల్లవారుజామున 30 వేల కోట్ల డాలర్లు ప్యాకేజీకి బడుగు దేశాలు అయిష్టంగానే ఆమోదం తెలిపాయి.

ఈ ఒప్పందాల్లో వాతావరణ ఫైనాన్సింగ్ కోసం న్యూ కలెక్టివ్ క్వాంటిఫైడ్ గోల్ (ఎన్‌సిక్యూజి) , పారిస్ ఒప్పందంలోని ఆర్టికల్ 6 ప్రకారం గ్లోబల్ కార్బన్ మార్కెట్ మెకానిజానికి సంబంధించిన అంశాలు ఉన్నాయి. ఈ వాతావరణ ఆర్థిక లక్ష్యాలు 2025 తర్వాత అమలులోకి వచ్చేలా ఒప్పందం నిర్దేశించింది. అభివృద్ధి చెందిన దేశాల నుండి ఏటా 30 వేల కోట్ల డాలర్ల నిధులు వర్ధమాన దేశాల వాతావరణ చర్యలకు మద్దతుగా చెల్లిస్తాయని, 2035 నాటికి ఈ వార్షిక లక్ష్యం కనీసం లక్షా 30 వేల కోట్ల డాలర్లకు చేరుకోవాలన్నది స్థూలంగా వాతావరణ ఫైనాన్సింగ్ లక్ష్యమని అందులో పేర్కొన్నాయి. తదుపరి దశలో .అభివృద్ధి చెందుతున్న దేశాలు వాతావరణ చర్యలు చేపట్టడానికి, వచ్చే ఏడాది దేశాల వారీగా జాతీయంగా కోటాలు నిర్ణయించేందుకు ఈ ఒప్పందం ప్రాతిపదికగా ఉంటుందని భావిస్తున్నారు.పారిస్ ఒప్పందంలోని ఆర్టికల్ 6 ప్రకారం అంతర్జాతీయ కార్బన్ మార్కెట్ మెకానిజంపై ఏళ్ల తరబడి కొనసాగుతున్న ప్రతిష్టంభనను దాదాపు 200 పార్టీలు బహుపాక్షిక చర్చల ద్వారా బ్రేక్ చేసి దీనిపై ఏకాభిప్రాయానికి వచ్చాయి. దీంతో పారిస్ ఒప్పందానికి సంబంధించి అపరిష్కృతంగా మిగిలి ఉన్న చివరి అంశం పరిష్కారమైంది. అంతేకాదు, కార్బన్ ట్రేడింగ్ మెకానిజం, గ్లోబల్ స్టాక్‌టేక్ అమలు, ఉపశమన చర్యలు, గ్లోబల్ అడాప్టేషన్ గోల్‌తో సహా వివిధ అంశాలపైనా సదస్సు కొన్ని నిర్ణయాలు చేసింది. వర్ధమాన దేశాల అవసరాలను తీర్చడంలో సంపన్న దేశాల ఆర్థిక హామీలు ఇప్పటికీ ఆశించిన దానికన్నా చాలా తక్కువగా ఉన్నాయని ఎన్‌సిక్యూజి పత్రం వెల్లడించిందని, వారి ఆర్థిక బాధ్యతలను మరింత స్పష్టంగా వివరించాలని చైనా ప్రతినిధి బృందం నేత జావో యింగ్‌మిన్ పేర్కొన్నారు.ప్రపంచ భౌగోళిక రాజకీయ ముఖ చిత్రం ఎలా మారుతుందన్న దానితో సంబంధం లేకుండా, చైనా, బాధ్యతాయుతమైన ప్రధాన అభివృద్ధి చెందుతున్న దేశంగా, వాతావరణ మార్పుపై బహుపాక్షిక ప్రక్రియ, అంతర్జాతీయ సహకారాన్ని స్థిరంగా ప్రోత్సహిస్తుందని జావో పునరుద్ఘాటించారు.

"ఈ పత్రం ఆప్టికల్ భ్రమ తప్ప మరేమీ కాదని చెప్పడానికి నేను చింతిస్తున్నాను. ఇది మా అభిప్రాయం ప్రకారం, మనమందరం ఎదుర్కొంటున్న సవాలు యొక్క అపారతను పరిష్కరించదు. అందువల్ల, ఈ పత్రాన్ని ఆమోదించడాన్ని మేము వ్యతిరేకిస్తున్నాము, "అని భారత ప్రతినిధి ప్రతినిధి చాందినీ రైనా శిఖరాగ్ర సమావేశం ముగింపు ప్లీనరీ సమావేశంలో అన్నారు.

డీల్‌పై అభ్యంతరం వ్యక్తం చేసిన భారత్

కాప్ -29 ఫైనాన్స్ ఒప్పందాన్ని సదస్సు ఆమోదించిన తరువాత భారత్ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిని 'ఆప్టికల్ ఇల్యూషన్'గా పేర్కొంది క్లైమేట్ ఫైనాన్స్ ఫండ్ కింద ఏటా లక్షా 30 వేల కోట్ల డాలర్లు చెల్లించాలని వర్ధమాన దేశాలు గొంతు చించుకుంటుంటే 30 వేల డాలర్లతో సంపన్న దేశాలు సరిపెట్టాయని, దీనిని తాము వ్యతిరేకిస్తున్నామని కాప్-29 సదస్సులో పాల్గొన్న భారత ప్రతినిధి బృందం నాయకుడు చాందిని రైనా సదస్సు ముగింపు ప్లీనరీలో మాట్లాడుతూ చెప్పారు. భారత్ వైఖరిని నైజీరియా సమర్థిస్తూ, ఈ ఫైనాన్స్ డీల్ ఓ జోక్ అని వ్యాఖ్యానించింది.

మా ఇల్లు బఫర్ జోన్‌లో లేదు..

హైడ్రా కమిషనర్ రంగనాథ్



హైదరాబాద్: తన ఇల్లు విషయంలో వస్తున్న వార్తలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టత ఇచ్చారు. మధురానగర్‌లో తన ఇల్లు బఫర్ జోన్‌లో ఉందంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. ఈ అంశంపై ఆయన స్పందిస్తూ.. "సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు. 44 ఏండ్ల క్రితం మా నాన్న నిర్మించిన ఇంట్లోనే ఉంటున్నాం. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. ఒకప్పటి పెద్ద చెరువునే 25 ఏండ్ల క్రితం క ృష్ణకాంత్ పార్కుగా మార్చారు. క ష్ణకాంత్ పార్క్‌కు మా ఇంటికి మధ్య వేలాది ఇండ్లు ఉన్నాయి. చెరువు కట్టకు దిగువన 10 మీటర్లు దాటితే బఫర్ జోన్‌పరిధిలోకి రావు. మా ఇల్లు చెరువు కట్టకు దాదాపు కిలోమీటర్ దూరంలో ఉంది" అని తెలిపారు.

అదానీపై విచారణకు ఆదేశించండి

సుప్రీంకోర్టులో న్యాయవాది పిటిషన్



న్యూఢిల్లీ : అదానీపై అమెరికా న్యాయస్థానంలో ప్రాసిక్యూటర్లు అవినీతి, లంచం అభియోగాలు మోపిన నేపథ్యంలో ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించాల్సిందిగా అభ్యర్థిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అదానీ, ఆయన సన్నిహితులు భారత ప్రభుత్వ అధికారులకు రూ.2,236 కోట్ల మేర ముడుపులు అందించారంటూ అమెరికా న్యాయస్థానంలో అభియోగాలు మోపినందున వాటిపై భారత దర్యాప్తు సంస్థలు కూడా విచారణ జరిపేలా ఆదేశాలు జారీ చేయాలని న్యాయవాది విశాల్ తివారీ సుప్రీంకోర్టును కోరారు. అదానీ గ్రూప్ అనేక అవకతవకలకు పాల్పడిందని ఆరోపణలు వచ్చాయని, దేశ ప్రయోజనాల దృష్ట్యా వాటిపై కూలంకషంగా దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉన్నదని పిటిషనర్ అభ్యర్థించారు. విశాల్ తివారీ తన పిటిషన్‌లో సెబీ పనితీరును కూడా ప్రశ్నించారు. వాటాల ధరలను ఎక్కువగా చేసి చూపడం, సెక్యూరిటీల నిబంధనల ఉల్లంఘన, లావాదేవీలను బయటపెట్టకపోవడం వంటి ఆరోపణలకు సంబంధించి అదానీ గ్రూపుపై విచారణ జరపాల్సిందిగా గత సంవత్సరం మార్చిలో సెబీని సుప్రీంకోర్టు ఆదేశించిందని, అయితే ఇప్పటి వరకూ ఆ వివరాలు బహిర్గతం చేయలేదని, ఈ జాప్యం కారణంగా మదుపుదారుల విశ్వాసం సన్నగిల్లిందని తెలిపారు. సెబీపై విశ్వాసాన్ని కలిగించేందుకు, దాని పారదర్శకతను నిరూపించేందుకు దర్యాప్తు వివరాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. లేకుంటే భారతీయ ఆర్థిక మార్కెట్లపై ఇన్వెస్టర్ల విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉన్నదని పిటిషనర్ హెచ్చరించారు.

రాజ్యాంగంలో వక్ఫ్ చట్టానికి చోటు లేదు

- కాంగ్రెస్ పార్టీ బుజ్జగింపు రాజకీయాలకు అదొక ఉదాహరణ : ప్రధాని మోడీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : వక్ఫ్ చట్టంపై ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత రాజ్యాంగంలో ఆ చట్టానికి చోటు లేదన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీపై ఆయన ఆరోపణలు చేశారు. రాజ్యాంగ లౌకిక సూత్రాలను ఆ పార్టీ వమ్ము చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ 'బుజ్జగింపు రాజకీయాలకు' వక్ఫ్ చట్టం ఒక ఉదాహరణగా ఆయన తెలిపారు. రాజ్యాంగంలో వక్ఫ్ చట్టానికి స్థానం లేదని నొక్కి చెప్పారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధించటంపై హర్షం వ్యక్తం చేసిన ప్రధాని.. బీజేపీ ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. భారత రాజ్యాంగంలో వక్ఫ్ చట్టం, వక్ఫ్ బోర్డు వంటివి లేవన్నారు. కానీ, ఒక వర్గాన్ని సంతృప్తి పర్చేందుకే కాంగ్రెస్ పార్టీ వక్ఫ్ చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. రాబోయే పార్లమెంటు శీతాకాల సమావేశంలో వక్ఫ్ చట్టంలో మార్పులకు కేంద్రం యోచిస్తున్నది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమితో పాటు ముస్లిం సంఘాలు కేంద్రం చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ఈ చట్టంపై మోడీ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మహారాష్ట్రలో అవినీతిరహిత, పారదర్శక పాలనకు ప్రజలు పట్టం కట్టారని మోడీ అన్నారు. ఐక్యంగా ఉంటే, సురక్షితంగా ఉంటామన్న సందేశాన్ని మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఇచ్చాయని చెప్పారు. రాజ్యాంగం పేరుతో కాంగ్రెస్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నదనీ, జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని తీసుకొచ్చేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తున్నదని మోడీ తెలిపారు.

పుదిచ్చుకున్న పుట్టింటి గడప



పరాయింటికి వోయినా..
ఆడపిల్లెప్పటికీ
పుట్టింటికి పునాదిరాయే
అమ్మ అయ్యబోయినంక
అన్నమీద సాగుబాటంటే
వొదినబోసే వొడిబియ్యమే
అత్త ఆడబిడ్డతో కలిపి
మూడు వొళ్ళ బియ్యానికే
లగ్గం కాయమయితే
పేదింటి కలికుండ పెండ్లిపిల్లె మురుస్తది
తంగెడు పూల పాదాలు
మోదుగు పూలపారాణి అద్దుకున్నాక
ఏటి సూతకాలు ఎన్ని అడ్డమొచ్చినా
ఏండ్లుబడిపోకుంట
వొడిబియ్యం పోసుకొని
పుట్టింటి గడప పుదిచ్చుకుంటది
గొడ్డుగోదకు పోస దొరకని
గడ్డు కార్తెలెదురైనా
వంతన పడిపోవద్దనే కాదు
ప్రేమలు వాడిపోవద్దని
అమ్మింటి ఆరివారాన్ని
ఒడినిండా నింపుకుంటుంటే
ఇల్లు ఇల్లంతా పూలతీగలల్లుకుంటాయి
ఐదు కుడుకలు మూడు మడుపులు
నల్ల పోకలు తమలపాకులే కాదు
ఒడి బియ్యమంటే.. అమ్మింటి అండ
బతుకు నిండా ఉంటుందన్న భరోసా..
పుట్టింటి ధైర్నాన్ని నెత్తికెత్తుకుపోయి
అత్తింట్లో చూపించే ఆడపిల్ల పెగ్గె
దేవునర్రల బియ్యం ఇడిసి
తాంబాలంలో ఒంపిన
ఐదు పిడికిల్ల దీవనార్తికి
అన్నదమ్ముల కళ్ళు ఉప్పునీటి బుగ్గలైతయి
సముర్త సారె, శ్రావణ పట్టె, బారసాల,
తమ్ముడి పెళ్లి, పుట్టింటి కార్యం ఏదైనా
ఆడపిల్ల అధికారానికి
అమ్మింటి గౌరవమే ఒడి బియ్యం
దేవుడికి దండంబెట్టి
దర్వాజకు బొట్లు పెట్టి
పెనిమిటెంట కదులుతుంటే
అమ్మ నాన్నలకెప్పుడూ అప్పగింతలే
ఆడపిల్ల రెండు గుండెల్ని
ఒడిబియ్యంతో ముడివేసి కట్టిన
తాత ముత్తాతల సేతులకు
దండం పెట్టి తీరాలి..

- తుల శ్రీనివాస్, 9948525853

నీలి....



ఏటి వారనే తిరుగుతుండు ఇంటి ముఖమే లేదు
మందు పెట్టింద్రో మాకు పెట్టింద్రో మన సోయినే లేడు
చెట్టు అంటాడు పుట్ట అంటాడు వెన్నెలంటాడు ఏరంటాడు
పచ్చి అంటే ప్రాణం అంటాడు
తాళ్ల దిక్కు చూసినట్టు తాళి దిక్కు చూస్తలేడని
చుట్టుపక్కలొళ్ళ తోటి ఇంటిది వాపోతుందంట నీలి
వలలు తీసుకుపోయి వలలో పడ్డానంట
వలపు తప్పా నీలి
మంచు కురిసేటప్పుడు వచ్చి
వెన్నెల వచ్చి పోయేదాకా నీ జాసే కదా నీలి
నీవు నిలబడ్డతలానా నీల్లార పోస్తే...
పూర్వం పూనకంలా వచ్చింది
తావు తావుకు పానమొంచిన నీడలే
గాలి చెవులకు దూరి ఏదో చెబుతుంది
ఆకాశం మెల్లగా కిందికి దిగుతున్నట్టు అనిపించింది
దరి మీద దాగుడుమూతలు
అడుగు తీసి అడుగెయ్యకుండానే ఆత్మ అల్లుకుపోతుంటే
కయాలు తప్పినట్టుందే నీ కాంతికి ఆకలి దూపలు కాని తలమిది
పొరబోతున్న రాగం
దమ్మన గొయ్యలో దాగున్న ఊపిరి
దేవి గాడు దేవునోలే ఉన్నాడు
ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలో మార్మిక రాగం ఒకటి
లయగా పాడుతుంది ఇది వీణలు మీటే విడిది
పొదలల్ల నుంచి పొరబోయేది ఉరుకుతుంది
ఎండకు వానకు చెట్లు గొడుగులై రమ్మంటున్నాయి
నా అంతరం ఆకుపచ్చగా ఇగిరేస్తుంది
ఎద కరిగిన ఉచ్చారణే దివ్య భాష
నీటి చెంపల మీద తెడ కన్న కల కన్నీటి ధార
ఏరు కట్టుకున్న వెన్నెల చీరకు ఒడ్డు వడ్డాణమైందే నీలి
లోన పున్నమి పులుముతుంటే కళ్ళల్లో కాంతి ఈనుతుంది
పడె చుట్టూ పిట్టల బంతి
ఆ పక్కన పిడిప్పని వల బుద్దునోలే ఉంది
ఏటి మధ్య నుంచి దీపం ఒకటి ఒడ్డుకొస్తుంది
తుమ్మెదలు వాలి పువ్వులు, పక్షులు వాలి చెట్లు దివ్యమైనాయి కదా
వెయ్యిన్నొక్క మిణుగురుల మధ్య మేమందరము నత్యంలో ఉన్నాం
ఈ వేడుకలో ఏ చాప నన్ను చూసి భయపడలే
విశ్వమంతా పూల తోటలు కావాలని
ఇక్కడే తుమ్మెదలు తపస్సు చేస్తున్నాయి
జాసను పెన వేసుకుని వెన్నెల ఎన్ని రూపులు కట్టిందో
నిందలు ఎన్నైనా రాని పొగ గొట్టాల మధ్య నేను వికసించలేను
ఇన్ని వెలుగులను వదిలి నేనెక్కడికి పోనే నీలి!

- మునాసు వెంకట్, 9948158163

డైనమిక్ లిటరరీ కమ్యూనిటీలు నేటి అవసరం


'ఆధిపత్యం (Dominance)' మీద 'గెలుపు (Victory)' అనుకున్నంత సులువేం కాదు. ఎందుకంటే ఆధిపత్యానికి అండగా రాజ్యాలు ఉంటాయి. పెట్టుబడి, పలుకుబడి దానికి తోబుట్టువులు, అవినీతి అక్రమార్జన బంధువులు. ఆధిపత్యం ఎన్ని విధాలుగా మానవాళిని ఏలుతూ వచ్చిందో, వంచిస్తూ ఉందో తెలియాలంటే గతంలోకి వెళ్లాలి. గతం అంటే ఇవాళ్టి నుండి వెనక్కి దశాబ్దాలు, శతాబ్దాలు వెళ్లాలి.



- డా.బెల్లి యాదయ్య, 98483 92690

వర్ణాధిపత్యం ఎప్పటినుంచో కొనసాగుతూనే ఉంది. వర్ణ వ్యతిరేక ఉద్యమాలు రాజుకోగానే ఆధిపత్యశక్తులు ఆయుధాలతో ముందుకొచ్చాయి. బుద్ధుణ్ణి ధ్యానిస్తూ, గాంధీజీని అనుసరిస్తూ ప్రపంచ ప్రజలు శాంతి, అహింసలతో చుట్టుముట్టగానే ఆధిపత్యశక్తులు తమ రూపాన్ని అత్యంత చాకచక్యంగా మార్చుకొని ఆర్థిక రంగాన్ని చెప్పుచేతుల్లోకి తీసుకున్నాయి. ఆర్థికాధిపత్యం ఇప్పుడు శ్రుతిమించి వికృతంగా కోర విచ్చింది. అయితే, ప్రపంచీకరణ ఎంత దుర్మార్గమైందైనా దానికో సుగుణం ఉంది. నాలెడ్జిని, నైపుణ్యాలను వ్యాపారార్థమే కావొచ్చు ఎంచక్కా తలకెత్తుకుంటుంది. కులం, మతం, ప్రాంతం వీటన్నిటికీ అతీతంగా సరుకుగల మెదళ్లను సంతలో ఎంత మొత్తానికైనా కొనుగోలు చేస్తుంది. అట్లా ఆర్థికంగా బలహీన దేశాలు తమ మేధాశక్తితో నిలదొక్కుకుంటున్నాయని అనుకుంటుండగానే సాంస్కృతిక ఆధిపత్యంతో ఆధిపత్య శక్తులు మోహరించాయి. అధికార, ఆర్థిక, ఆయుధ స్వామ్యాల ముప్పేట దాడికి ఎదురు నిలవడానికి చేష్టలుడిగి బలహీన దేశాల సాంస్కృతిక వారసత్వం ప్రమాదంలో పడింది. అందుకనే వర్తమానాన్ని సామాజిక వేత్తలు 'సాంస్కృతిక వారసత్వం ప్రమాదంలో పడిన యుగం' గా అభివర్ణించారు. సూటిగా చెప్పాలంటే మనం సాంస్కృతిక వారసత్వం ప్రమాదంలో పడిన యుగంలో జీవిస్తున్నాం. మరిప్పుడు దారీతెన్నూ ఏదీ లేదా అంటే, ఎందుకు లేదు? ఉంది. ఒక చేవగలిగిన మార్గం ఉంది, ఒక సారభూతమైన ఉపకరణం ఉంది. ఏమిటా చేవగలిగిన మార్గం, సారభూతమైన ఉపకరణం అంటే... మన సాహిత్య సంస్థలు, సాంస్కృతిక సంస్థలు ప్రోదిచేసే చైతన్యం, చాటే పరిమళాలు.

ఇటీవల ఒరిస్సానుండి 'The Big Book of Odia Literature' అనే ఆంగ్ల గ్రంథం వచ్చింది. దీని సంపాదకుడు మనూదాస్. ఈ పుస్తకంపై అశుతోష్ కుమార్ ఠాకూర్ The Wire మ్యాగజైన్ లో రివ్యూ చేస్తూ "Any languages continue to thrive, with a dynamic literary community that includes poets, novelists, and scholars who carry forward their legacy of their predecessors" (The Wire- Preserving the past, Inspiring the future- Odisha Literary Treasure-31 August 2024)" అంటాడు. ఈ వ్యాఖ్యలో మనకు డైనమిక్ లిటరరీ కమ్యూనిటీ అనే మాట స్పష్టంగా కనిపిస్తుంది. అంటే సృజనశీల, సమరశీల సాహిత్య సమాజాల అవసరం దేశానికి, ప్రపంచానికి ఉందని, సృజనశీల సమరశీల సాహిత్య సమాజాలు మాత్రమే ప్రమాదం అంచున ఉన్న సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించగలవని అశుతోష్ కుమార్ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. నిజమే, సరిహద్దులు ప్రమాదంలో పడితే సైన్యం యుద్ధం చేస్తుంది. మరి సమాజం ప్రమాదంలో పడితే కవిసైన్యం పోరాడుతుందనేది అశుతోష్ కుమార్ వ్యాఖ్యలోని అంతరార్థం. జీవిక కోసం పాటుపడే వృత్తి ఏదైనా సాంద్రతర హృదయాలు, సాహిత్య గంధం అంటిన వాళ్లు తమ భావజాల సన్నిహితులను కలుపుకొని సాహిత్య సంస్థలను ఏర్పాటు చేస్తుంటారు. అవి చిన్న చిన్న పట్టణాలు మొదలుకొని పెద్ద నగరాల దాకా ఆయా పేర్లతో నిరాడంబరంగా ఉనికిలో ఉండటం మనం చూస్తున్నదే. ఇవి తమకు తోచిన రీతిన నెల నెలానో, త్రైమాసికంగానో, అర్ధవార్షికంగానో లేదా వార్షికంగానో సభలు సమావేశాలు జరుపుతున్నదానికీ మనం సాక్షులం. ఇదిగో ఈ సాహిత్య సమాజాలు చేపట్టే కార్యక్రమాలే కొత్తతరాన్ని సృజన రంగంలోకి తీసుకురాగలుగుతాయి. విరళంగానైనా ఆ పట్టణాలు, నగరాలు వేదికగా కవిత్వం, కథ, నవల, నాటకం ఇత్యాది ప్రక్రియలు ప్రజలతో సంభాషిస్తుంటాయి.



సంస్కృతిని ప్రజల తాలూకు ఆచార వ్యవహారాలు, పద్ధతులు, చిహ్నాలు, నిబంధనలు, వేడుకలు, నమ్మకాలు పాటించే విశ్వాసాలుగానే పరిగణిస్తాం. ఇది సాధారణ అవగాహన. సంస్కృతికి సంబంధించిన ప్రత్యేక అవగాహన కూడా మనకు ఉండాలి. అదేంటంటే, సంస్కృతి ఎక్కడికక్కడ ఆయా ప్రజాశ్రేణుల గుర్తింపుకు, గౌరవానికి సంబంధించిన ఆలోచనలు ప్రవర్తన నమూనా. సంస్కృతి ప్రజల జీవనాడి, గుండెకాయ. సంస్కృతికి ప్రధానంగా ఆ జాతి ప్రజలు పాటించే విలువలే పునాది. అందుకనే టాగోర్ మహాశయుడు "నేను భారతదేశాన్ని ప్రేమిస్తున్నాను ఎందుకంటే నేను భూభాగ విగ్రహారాధనను పెంపొందించుకోవడం వల్ల కాదు, నాకు ఈ మట్టిలో పుట్టే అవకాశం లభించినందున కాదు, కానీ ఈ దేశం తన గొప్ప కుమారుల ప్రకాశవంతమైన స్ఫూర్తి నుండి వెలువడిన సజీవ పదాలైన సత్యం, జ్ఞానం, అనంతమయం తమ ప్రభచేత చారిత్రక గందరగోళ యుగాలలో మానవాళిని రక్షించినందున" (The cultural Heritage of India, Vol.1, Ramakrishna Mission, Calcutta, page xxi, 1937) అంటారు. మహనీయులు ఉద్భవించి మానవాళికి ప్రవచించిన జ్ఞాన మార్గం తను భారతీయుడను అనే తాదాత్మ్యానికి, పరవశానికి హేతువు అని రవీంద్రుడు ఎరుక పరిచాడు. ఇంతటి ఘనమైన సాంస్కృతిక వారసత్వం ఇవాళ ప్రమాదం పడిన దరిమిలా పునఃదీప్తి (Recalescence) కోసం నిలబడాల్సినవి, కలబడాల్సినవి సాహిత్య సమాజాలే. అయితే, ఇక్కడో చిన్న మాట చెప్పాలి. సాహిత్య సమాజాలు అంటే దేశంలోని ప్రధాన భాషల్లోని పేరెన్నికగల సంస్థలే కాదు, చిన్న చిన్న భాషల్లోని మరీ ముఖ్యంగా ఆదివాసీసాహితీ బృందాలు కూడా. ఇందుకు The Big Book of Odia Literature గ్రంథమే మంచి ఉదాహరణ. ఇందులో ఒరియాతో పాటు అక్కడి మారుమూల ప్రాంతాల నాలుగైదు గిరిజనభాషలు, వాటి సృజనపుష్టి తొణికిసలాడుతుంది.

ఇప్పుడు మనల్ని ముంచెత్తుతున్న సాంస్కృతిక ఆధిపత్యం విషపుదాడిపై తిరగబడుతున్న మూలవాసీ, ఆదివాసీ గొంతుక ప్రతినిధి. చివరగా ఒకమాట... స్థాపించిన సాహితీ సంస్థనో, కూడిన రచయితల బృందమో, ఏదైనా ఎవరైనా వెనకటివి రాస్తూ కాలాన్ని వెనుకకు నడిపించేదిగా ఉండకూడదు. రచయితలుగా తరచూ కలుస్తూ, తమ రచనలను వినిపించుకుంటూ, స్పందనలను అనుసరించి సరిచేసుకుంటూ, సద్యస్ఫురణతో కార్యశాలల్లో నిమగ్నమవుతూ ఉండే క్రియాశీల భాగస్వామ్యం సమరశీల సాహిత్య సమాజానికి ఉండాల్సిన ప్రథమ లక్షణం.

భాష అత్యుత్తమ రూపమైన సాహిత్యం సమాజానికి తనదైన బ్లూప్రింట్‌ను ఎప్పుడూ అందిస్తూనే వుంటుంది. ప్రాచీన నాగరికతల విశేషాలు మొదలుకొని ఆధునికమైన కాల్పనికత వరకు సమాజ వికాసాన్ని తాత్వికంగానూ, వైజ్ఞానికంగానూ ఆవహించి నలుదిక్కులకు సంచరిస్తుంది. మరీముఖ్యంగా సాహిత్యం ప్రపంచానికి అంతర్‌దృష్టిని ప్రసాదిస్తుంది. మిగతా కళాఖండాల కంటే, అందుబాటులో ఉన్న చరిత్ర కంటే ఉన్నతమైనది. సాహిత్యాన్ని మించి ప్రాపంచిక అనుభవాన్ని రికార్డు చేసే ప్రక్రియ మరొకటి లేదు. ఈ కింద పేర్కొన్న కవితను చూడండి. ఇది ఒడిస్సాలోని గిరిజన భాషల్లో ఒకటైన 'ఖరియా' కవిత. తండ్రీ కొడుకుల మధ్య నెలకొన్న దుఃఖపూరిత సందర్భాన్ని వివరించే ఖరియా కవి ఏం చెబుతున్నాడో చూడండి-

"నది అవతలి ఒడ్డు నుండి/ నాన్న నన్ను పిలుస్తున్నాడు/ నేను ఎలా దాటుతానో దేవునికి తెలుసు-/ నా ప్రియమైన తండ్రిని వినడానికి అడ్డుగా/ కోయెల్ అంచుల వరకు నిండి/ సంఖు నది పొంగి ప్రవహిస్తున్నది-/ వెన్నగర్ర విరిగిపోయింది/ నా పడవ మునిగిపోయింది-/ నేను నదిని ఎట్లా దాటగలను?/ నేను నా తండ్రి దగ్గరికి ఎలా వెళ్ళాలి?/ బతుకు కుదురును గురించిన/ నా తండ్రి మాటలు నేను ఎలా వినాలి?/ జాలరి అబ్బాయీ!/ నువ్వే నాకున్న ఒక్కాగానొక ఆశ-/ నన్ను నది దాటిస్తావో/ ప్రవాహం మధ్యలోనే ముంచేస్తావో!/ అంతా నీ దయ"

ఈ పంక్తులు 'The Big Book of Odia Literature' సంకలనంలోని కవిత్వం లోతుకు, భావోద్వేగ తీవ్రతకు ప్రతిధ్వని. అంతేకాదు, ఇప్పుడు మనల్ని ముంచెత్తుతున్న సాంస్కృతిక ఆధిపత్యం విషపుదాడిపై తిరగబడుతున్న మూలవాసీ, ఆదివాసీ గొంతుక ప్రతినిధి. చివరగా ఒకమాట... స్థాపించిన సాహితీ సంస్థనో, కూడిన రచయితల బృందమో, ఏదైనా ఎవరైనా వెనకటివి రాస్తూ కాలాన్ని వెనుకకు నడిపించేదిగా ఉండకూడదు. రచయితలుగా తరచూ కలుస్తూ, తమ రచనలను వినిపించుకుంటూ, స్పందనలను అనుసరించి సరిచేసుకుంటూ, సద్యస్ఫురణతో కార్యశాలల్లో నిమగ్నమవుతూ ఉండే క్రియాశీల భాగస్వామ్యం (Active participation) సమరశీల సాహిత్య సమాజానికి ఉండాల్సిన ప్రథమ లక్షణం. భిన్న సామాజిక నేపథ్యం కలిగిన సభ్యులు, వివిధ ప్రక్రియల్లో రాయగల సామర్థ్యం, సారవంతమైన దృష్టికోణం, సమస్యను చిత్రిక పట్టగలిగిన నైపుణి, వైవిధ్య స్వరాల (Diversity of voices) రాణింపు రెండో లక్షణం. నూతన వాదాల ఆకళింపు, శైలీ నవ్యత, కొత్త గొంతుల చేరిక, స్థానీయ సంస్కృతికి అండగా ప్రచారం, సరికొత్త ఆలోచనలకు సారథ్యం (Open to new ideas) మూడో లక్షణం. అన్యోన్యంగా ఒకరికొకరు ప్రోత్సాహం కల్పించుకుంటూ పరస్పరం రచయితలుగా, కవులుగా ఎదుగుతూ ఉండే సహృదయత, సహకార స్ఫూర్తి (Collaborative spirit) నాల్గోగుణం. సృజనాత్మక కార్యక్రమాలు, ప్రజలతో శ్రేణులవారీ అనుబంధం, ప్రతి సంఘర్షణలోనూ సమాజానికి సాహిత్యం దాపుంటుందన్న భరోసా (Community building initiatives) ఐదో లక్షణం. ఈ ఐదు లక్షణాలున్న సాహిత్య సంస్థలు మాత్రమే సమరశీల సాహిత్యాన్ని అందించగలవు. అశుతోష్ కుమార్ అన్నట్టు సమరశీల సాహిత్యమే ఇవాళ్టి సాంస్కృతిక ఆధిపత్యాన్ని అడ్డుకోగలదు, నిలువరించగలదు. జోకుడు సంస్థలు, జోలపాడే కవిత్వం నిష్ప్రయోజకులు.

'లోపలి వాన' ఒక అనుభూతి కవిత

తెలుగు సాహిత్యం తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం నిశ్చలంగా ప్రవహిస్తున్నది. విప్లవాల కాక కొంత తగ్గిపోయింది. ఆవేశం స్థానంలో ఆలోచన ప్రవేశించింది. అస్తిత్వ వాదాలు తమ పని తాము చేసుకుపోతున్నాయి. ఇటీవల తెలంగాణ వాదం, లేక అస్తిత్వాన్ని గురించిన ఆలోచన మళ్లీ సాహిత్య రంగంలో పొటమరించడం గమనించవచ్చు. ఈ వాతావరణంలో అత్యంత ఆరోగ్యకరమైన కొన్ని యువకలాల్లో ఒకటిగా వికసించినది కుడికాల వంశీధర్ 'లోపలి వాన' కవితా సంపుటి. తెరచీ తెరవగానే ఇది 'గొడుగు అక్కర్లేని వాన తడిసిపోదాం', 'గొడవ అక్కర్లేని వాన చదువుకుందాం' అనే వాక్యాలు కనిపిస్తాయి. తడి గల ప్రతి హృదయానికి అంకితం అని తన తడి చాటుకున్నాడు కవి. లోపలి పేజీలకు వెళితే ఇది నిజంగానే గొడుగు అక్కర్లేని వాన అని తెలుస్తుంది. ఇందులో తడవడం ఒక ఆహ్లాదకరమైన అనుభూతి. ఈ కవి సాధారణమైన మాటలతోనే కవిత మొదలెట్టి మెల్లిమెల్లిగా తన ఆవరణ లోపలికి మనల్ని తీసికెళ్తాడు. సముద్రం ఒక మహాకావ్యం అంటాడు. తొలి పొద్దులో ఆ నీటి పైన కిరణాలు మిఠాయిపై ఉన్న వెండి పొరలాగా మెరుస్తుంటాయి. మధ్యాహ్నం ఆ నీళ్ల పరుగెడుతున్న సూర్యుని చెమట చుక్కలతో తక్కుమంటాయి. నా కళ్ళకి ఎపవిడు అలల కాగితాలు కుప్పబోసినట్లుగా ఉంటుంది. తొలి పొద్దులో నీటి కిరణాలపై మెరయడం, కవిత్వలోకంలో ఒక సాధారణ అంశం. ఈ దృష్టి చాలామంది కవులకు ఉంటుంది. కానీ కిరణాలు మిఠాయి పైనున్న వెండి పొరలు లాగా మెరుస్తాయని చెప్పడమే కవి లోకజ్ఞత. భావుకతను నిత్య జీవన సంబంధమైన లోకజ్ఞతతో అనుసంధించడం ఈ కవి సాధిస్తున్న ప్రత్యేకత. సూర్యుడిలో చెమట చుక్కలు చూడడం, వానితో కలిసి నీరు తళుక్కున మెరయడం కవి Aesthetic sensibility చెప్పకనే చెప్తుంది. కుడికాల వంశీధర్‌లో ప్రధానంగా మనకు కనిపించేది అనుభూతి వాదం. అనుభూతిని వాదం అనవచ్చునో కాదో తెలియదు కానీ (అనేవాళ్ళు అంటూనే ఉన్నారు) అనుభూతి సాంద్రమైన కవితా వాక్యాలు ఆయనకు అప్రయత్నంగా సొంతమవుతాయి. కవి రాత్రి బాల్కనీలో నిలుచున్నాడు. వాడి మొనతో గగనాన్ని తీర్చలేని నులి వెచ్చని దైన్యం ఆ గమనంలో రేఖామాత్రంగా చిత్రిస్తోందట. పులక రాలిపోయాక కూడా కవి చూపు ఆకాశం చూరుని గీరుతూనే ఉందట. ఈ పాదాల్లో ఒక మూర్త భావచిత్రం, దాని స్మృతి పొరల వెనుక ఉన్న ఏదో అవ్యక్తమైన అనుభూతితో మనల్ని చుట్టుకుంటుంది. ఎడ్గర్ ఎలన్ పో ఈరాత్రి అనుభూతితో చేసే పలవరింత యాదికి వస్తుంది. "Deep into that darkness peering long I stood there, wondering fearing doubting dreaming dreams no mortal ever dared to dream before".



డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు, 9676096614



కవికి కృత్యాద్యవస్థ ఎలా ఉంటుందో కుడికాలకు బాగా తెలుసు. ఈ అవస్థనే 'ప్రాణావసాన వేళా జనితం' అని వర్ణిస్తాడు శ్రీశ్రీ. ఈ కవి కూడా పద్యం రాసేముందు పొందే అవస్థను చక్కగా చిత్రించాడు 'అలజడిలో మనసు' అనే కవితలో. కవిత్వం చూస్తే వ్యక్తిగతం అనిపిస్తుంది కానీ అదో సార్వజనీనక భావన. కాలం విచిత్రమైనది. ఒక్కోసారి భయంకరమైనది కూడా. మనిషి తన జీవన వ్యాపారం కోసం కాలాన్ని సమయాలుగా విభజించాడు. అనంతమైన కవిత్వాన్ని అక్షరంగా కుదించినట్టు కుడికాల కూడా అగణితం అనే కవితలో ఆశ్చర్యం ప్రకటిస్తాడు, "కొనసాగడమే తెలిసిన కాలాన్ని పెండ్యులం అడుగులతో కొలవడం వింత కదా" అంటాడు.

ఎంత కాదనుకున్నా అత్యాధునిక కాలంలో పుస్తక ప్రాధాన్యం తగ్గిపోతుంది. దీనికనేక కారణాలు ఉన్నాయి కానీ, పుస్తక ప్రేమికులైన కవులు మాత్రం పుస్తకాన్ని చదవడంలో ఉన్న ఆనందాన్ని పుస్తక ప్రాధాన్యాన్ని పదేపదే గుర్తుకు తెచ్చుకుంటున్నరు. చదవాలి అనుకోవడం వరకే మనం చేయగలిగేది. చదవడం మొదలెట్టాక ఒకసారి చెక్కిలి గిలి పెట్టొచ్చు. ఇంకొకసారి కన్నుల్లో జిగురు చీరలు ఎగర వేయవచ్చు. మరొకసారి మన కన్నీటి నిధుల్ని దోచేసుకోనూ వచ్చు. ఇట్లా పుస్తకం వల్ల కలిగగే రసానుభూతి మనల్ని ఎలాగైనా కదలించవచ్చు.

"Books and doors are the same thing. You open them and you go through into another world". పుస్తకాలు దర్వాజా లాగానే మనల్ని మరో ప్రపంచం లోపలికి తీసుకెళతాయని చెప్పిన winterson గుర్తుకు వస్తాడు ఈ పద్యం చదివితే.

అలతి అలతి మాటలలో అనంతాన్ని పొదగడం నిజమైన కవిత్వ లక్షణం. స్త్రీ గురించి, స్త్రీవాదం గురించి వివిధ రకాలైన అభిప్రాయాలు ఉన్నా, స్త్రీ అనంతమైన దుఃఖ అనుభూతి 'మౌలికో' అనే కవితలో రెండు వాక్యాల్లో చెబుతాడు. "అవనిపై ఉన్న మూడు వంతుల నీరు ఆమె కనుదోయి నుంచే వచ్చిందేమో". తరతరాలుగా సమాజం స్త్రీకి ఇస్తున్న విలువ, ఆవేదన ఈ రెండు మాటల్లో కూర్చాడు.

"వెలుతురును వెతుక్కుంటూ వెళుతున్న నాకు వెనుక నుండి ఒక వింత శబ్దం వినబడింది. తట్టుకున్న ఆగి చూశా, గాలికి రాపాడుతున్న పండుటాకులు కనిపించాయి" అంటూ మొదలైన ఈ కవిత మార్మికత నుంచి మెల్లిమెల్లిగా వాస్తవికతలోకి అడుగుపెడుతుంది. చివరికి "ఓ మనిషీ నీ వంచనకు నేను తెల్లబోయాను అని మళ్ళీ నా నీడ నవ్వింది" ఇలాగా ఒక ప్రత్యేక పంథాతో కొనసాగే కవితలు ఈ పుస్తకం అంతా నిండుకున్నాయి

పర్వతాలు, సముద్రాలు అనే కవిత పర్వతాల గురించి సముద్రాల గురించి చెప్పినట్టే ఉంటుంది. "ద్రవీభవించిన పర్వతాల నిశ్శబ్ద సారం సముద్రాలు, ఘనీభవించిన సముద్రాల శబ్ద విస్తారం పర్వతాలు". ఈ రెండు మాటల్లో ప్రకృతిలో, అలాగే మానవునిలో కూడా ఉండే విరుద్ధ శక్తుల పరస్పర ఆకర్షణ అవిభాజ్యమైన అంత: సంబంధం మనకు కనిపిస్తుంది.


ఈ కవి 'కర్ఫ్యూ' అనే కవితలో anology ఎంత బాగా వాడుకున్నాడో చూడవచ్చు. సాధారణమైన అలంకారాలకు భిన్నమైంది anology. సాధారణంగా anologyలో ఉపమాలంకారం లాగా రెండు విషయాలకు సామ్యత చెప్పబడుతుంది. ఇంతవరకు ఆగిపోకుండా ఈ సామెత నుండి మౌలిక విషయానికి కూడా సామ్యత ఉండి, మౌలిక విషయాన్ని మరింత ఉద్దీపనం చేయడం లక్ష్యంగా ఉంటుంది. ఆయన కవితలో "నిన్నటి పాదముద్రలు చెరిగిపోయాయి, రాకాసి అలల రాకపోకలతో తీరమంతా కర్ఫ్యూ". ఇందులో రాకాసి అలలు రావడం వల్ల తీరమంతా కర్ఫ్యూ అని దానివల్ల పాదముద్రలు చెదిరిపోయాయని చెబుతూ, అలాగే కర్ఫ్యూ సందర్భంగా ప్రభుత్వం లేక పోలీసులు రావడం, జనాలు లేక బాధితులు చెదిరిపోవడం అనే మౌలికాంశంతో పోలికను రాబట్టాడు. "అహానికి అంతులేని దాహం పట్టు విడుపులు లేకుండా పయనిస్తే మది గదిలో కర్ఫ్యూ" ఈ పాదంలో కూడా అహానికి మదిగదిలో జరిగే పరిణామానికి మౌలికమైన కర్ఫ్యూతో పోలిక తేవడం గమనించవచ్చు. ఈ విధంగా అన్ని పాదాలలో ఇది సాధించి చూపించాడు కుడికాల ఈ కవితలో.

కుడికాలలో అక్కడక్కడా రూపంతో రాజీ పడడం కూడా ఉంటుంది. ఒక జ్ఞాపకం, ఒక వ్యాపకం- సవ్వడి, రువ్వడి లాంటి అంత్యప్రాసలు సీరియస్ నెస్‌ని తగ్గిస్తాయి. ఆక్రోశ్ లాంటి హలంత ప్రయోగాలు ప్రత్యేక ప్రయోజనం లేకుండా చేయడం పెద్ద అవసరం ఏం కాదు.

ఇట్లాంటి సవరించుకోదగిన చిన్న లోపాలు మినహాయిస్తే ఆధునిక కవితా రంగంలో తన స్థానాన్ని పదిలం చేసుకునే శక్తి వంశీధర్‌కు పుష్కలంగా ఉంది.

నేను అమరుడిని...

అన్ని దిక్కులా దండయాత్ర చేస్తూనే వుంటుంది
నిరంతరం దొంగదెబ్బ తీస్తూనే వుంటుంది
కనపడని మిస్సైల్స్ ప్రయోగిస్తూనే వుంటుంది
కరచాలనాల పూలబొకే మాటున
చిట్లిన చిరునవ్వుల బాంబులు
విసురుతూనే వుంటుంది
డ్రోన్లతో ధోకా చేస్తూనే వుంటుంది
గడ్డివాముల కింద పొంచివున్న కట్లపాము



రెండు నాల్కల కాలం సహాయం చేసిన చేతినే
అవకాశవాదం కత్తులు తెగనరుకుతూంటే
శత్రువులెవరో మిత్రులెవరో
తెలియని సందిగ్ధ సమరంలో...
బొంబాయి బాంబు దాడిలా
ఎప్పుడు ఎక్కడ వెన్నుపోటుల
సూసైడ్ బాంబులు పేలుతాయో
అంతుచిక్కని విధ్వంసం...
కన్ను మూసి తెరిచేలోపు
కలలసౌధాలు నేలమట్టమౌతాయ్
చితిమంటలతోనే చలి కాచుకుంటుంది లోకం!
శకలాలు శకలాలుగా
బతుకే ఒక గాజా దగ్ధగీతం యైనపుడు
ఏవైపు నుండి ఏ అపవాదుల
అసత్యాల బాంబులు మీద పడుతాయో
నిరంతరం అభద్రతా భావం
ఇనుప కౌగిలిలో ఉక్కిరి బిక్కిరౌతూ...
బతుకే ఒక అధర్మ యుద్ధభూమి యైనపుడు
హృదయమెప్పుడూ నెర్రెలిచ్చిన గాజుబొమ్మే
నిరంతరం తప్పదు హేండిల్ విత్ కేర్
నిద్రలోనూ ఒక మెలకువ కావాలి
నేను నిరాయుధుడిలా అగుపించొచ్చు
న్యాయం మాత్రమే నా చేతి ఆయుధమై
ఒంటరి పోరు సలుపుతూనే వుంటుంది!
పోరాటం అనివార్యమైనపుడు
మడమతిప్పావో... ఇక నడిచే శవానివే
వెన్నుచూపడమంటే
మరణాన్ని మించిన ఓటమి కదా...
నడిచే గాయానైనప్పుడు
కాలం అగ్నిపర్వతం పై వాలిన పావురాన్నై
తిరుబాటు చేస్తూనే వుంటా
నిజాల నిప్పుల కొలిమినై ...
శాంతి ఆయుధాల నందిస్తూనే వుంటా..
నిత్యం కడగండ్ల పై తలవంచని నెత్తుటి జెండానై
ఎగురుతూనే వుంటా లోకమంత చీకటి మీద పడ్డా
సంహరించే దీపఖడ్గానై విజయమో వీరస్వర్గమో
పోరాటమే నా తొలి విజయం!
అమరత్వం నా ఊపిరిలోనే వుంది
దానిపేరే అక్షరం

- సరికొండ నరసింహరాజు

నిర్వాణ' నవలపై వ్యాస రచనా పోటీ

సద్ధమ్మ సాహితి ఆధ్వర్యంలో డాక్టర్ బండి సత్యనారాయణ గారి బౌద్ధ చారిత్రక నవల (లతా రాజా ఫౌండేషన్ వారి ప్రచురణ) 'నిర్వాణ'పై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నాం. ప్రథమ, ద్వితీయ, తృతీయ, మరియు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. వ్యాసాలు nirvaana2024@gmail.com మెయిల్‌కి పిడిఎఫ్ & పిఎండి (అను 7, ప్రియాంక ఫాంట్, సైజ్ 16) లో ఫైల్స్‌ని 15, డిసెంబర్ 2024 లోపు పంపాలి.

- సద్ధమ్మ సాహితి, 9618598847

మలిదశ తెలంగాణ ఉద్యమ కథలకు ఆహ్వానం

తెలంగాణ ఏర్పాటై పది సంవత్సరాలు నిండిన సందర్భాన మలిదశ ఉద్యమంలో పెల్లుబికిన సృజనను ఈ తరం యువరచయితలకు, కవులకు అందుబాటులోకి తేవాలని తెలుగు పరిశోధక మండలి' సంకల్పించినది. మలిదశ తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో (1989- నుండి 2014 వరకు) వచ్చిన కథలను సంకలనంగా తీసుకురావడానికి మీ పరిశీలనలో ఉన్న కథలను, మీరు స్వతహాగా రాసిన ఉద్యమకాలంలోని కథలను telanganatpm@gmail.com మెయిల్ కి పంపగలరని మనవి. ఆఖరు తేదీ: 31, డిసెంబర్, 2024

- డా. నల్రా ప్రవీణ్ రెడ్డి, 8179179183

నవతెలంగాణ
ఖమ్మం
సోమవారం | నవంబర్ 25, 2024 | www.navatelangana.com

డేటా ఎంట్రీని 30లోగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-కల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే కార్యక్రమం డేటా ఎంట్రీ సక్రమంగా తప్పులు లేకుండా నమోదు చేసే విధంగా చూడాలని తహశీల్దార్ పులి సాంబశివుడు, ఎండిఓ డి.చంద్రశేఖర్ కోరారు. ఆదివారం ఎండిఓ కార్యాలయంలో డేటా ఎంట్రీ సూపర్వైజర్, ఎస్ఓలు, ఆర్ఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో 23 వేల 366 కుటుంబాలను సర్వే చేయడం పూర్తయిందని, వాటిని ఆన్లైన్లో డేటా ఎంట్రీని చేపట్టారు. ఎన్యుమనేటర్లు దగ్గరుండి ఎలాంటి తప్పులు లేకుండా డేటా ఆపరేటర్లతో నమోదు చేయించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచనలిస్తూ పని వేగవంతంగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు ఎస్ఓలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

పాములేరులో 'మిరాకిల్' విద్యార్థులు విహారం



నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి పట్టణం సిద్దారం రోడ్డులోని మిరాకిల్ పాఠశాల విద్యార్థులు భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ సమీపంలోని పాములేరు విహారయాత్రకు వెళ్లారు. పాములేరు వాగు నీటి వరవళ్లలో విద్యార్థులు విహరిస్తూ కేరింతలు కొడుతూ సందడి చేశారు. వాగులో ఎక్కడి చూసినా అడుగుకు మించి లోతు లేకపోవడంతో విద్యార్థులు రెక్కలు తొడిగిన గాలిపటాల్లా వాగంతా విహరించారు. వాగుకు ఇరువైపులా పచ్చనిచెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం సంతరించుకొని ఉండటంతో విద్యార్థులు అలుపుసొలుపు లేకుండా సాయంత్రం వరకు విహరించారు. పాఠశాల ఛైర్మన్ డెన్నీ ఇజ్రాయెల్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో పిల్లలు పుస్తకాలతో కుస్తీపడుతున్నారని, యేడాదిలో ఓసారైనా విహారయాత్రకు తీసుకెళ్లడం ద్వారా ఆ ఒక్కరోజు ఆనందం యేడాదంతా వారిలో ఉత్సాహాన్ని నింపినట్లవుతుందన్నారు. పూర్తిగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం పర్యవేక్షణలో జరిగిన ఈ విహారయాత్ర ఆద్యంతం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సంతోషమయంగా సాగింది. ఈ విహారయాత్రలో పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఎం.రత్నాకర్, ఉపాధ్యాయులు వాణి, ఆశ, పద్మ, మౌనిక, మురళీ పాల్గొన్నారు.

సర్వే డేటా ఎంట్రీ కీలకం

- డోర్ లాక్, వలస వెళ్ళిన వారి వివరాలు ఫోన్ కాల్ ద్వారా సేకరించాలి
- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ-ఖమ్మం

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకున్నదని, సర్వే డేటా ఎంట్రీ చాలా కీలకమైందని, ఎలాంటి పొరపాట్లకూ ఆస్కారం ఇవ్వవద్దని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జార్ఖండ్ రాజధాని రాంచి నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ క్యాంప్ కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ సర్వే డేటా ఎంట్రీలో నాణ్యత చాలా ముఖ్యమైందని, ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. సర్వే దశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి కొన్ని సమస్యలు తలెత్తాయి... వారికి ఫోన్ చేసి అందుబాటులో ఉండమని కోరి, సర్వే గురించి తెలియజేయడం ద్వారా ఆ వివరాలను నమోదు చేసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని తెలిపారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయని, పాఠశాలలో ఆహారం, పరిశుభ్రతపై ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, యావత్ క్యాబినెట్ ప్రత్యేక దృష్టి సారించినట్లు, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలు తలెత్తకూడదనే మెస్, కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఫుడ్ పాయిజన్, అపరిశుభ్రత వంటి అంశాలకు తావు లేకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 5 లక్షల 68 వేల 493 ఇండ్లను సర్వే కోసం గుర్తించామని, ఈనెల 23 నాటికి మొత్తం 4 లక్షల 78 వేల 868 ఇండ్ల సర్వే పూర్తయిందని అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఖమ్మంలో 59.50 శాతం, పాలేరులో 93.64 శాతం, మధిరలో 94.41 శాతం, వైరాలో 96.98 శాతం, సత్తుపల్లిలో 98.09 శాతం, జిల్లా వ్యాప్తంగా 84.23 శాతం సర్వే పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. డేటా ఎంట్రీ చేసేందుకు అవసరమైన ఆపరేటర్లను గుర్తించామని, పక్కాగా డేటా ఎంట్రీ నమోదు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటిస్తున్నామని అన్నారు.

నిబద్ధత కలిగిన ఆదర్శ కమ్యూనిస్టు కొమ్మన చిన్న బాబు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-వైరాటౌన్



సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కొమ్మన చిన్న బాబుగా ప్రసిద్ధి గాంచిన కొమ్మన వెంకట దుర్గా ప్రసాద్ (81) ప్రమాదవశాత్తు కిందపడి చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మరణించారు. చిన్న బాబు మృతితో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుము కున్నాయి. శనివారం రాత్రి సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాచర్ల భారతిలు చిన్న బాబు ఇంటికి వచ్చి భార్య కొమ్మన అరుణ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కొమ్మన చిన్న బాబు ధనిక కుటుంబంలో పుట్టినప్పటికీ వైరా ప్రాంతంలో ఉన్న బలమైన కమ్యూనిస్టు ఉద్యమానికి ఆకర్షితులై మరణించే వరకు నిబద్ధత కలిగిన ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించారు. పార్టీకి విధేయుడిగా ఉంటూ, రాజకీయాలలో స్వచ్ఛత మిగిలే ఉందన్న విశ్వాసాన్ని కల్పిస్తూ కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లడానికి అంకితభావంతో జీవితాంతం కొమ్మన చిన్న బాబు కృషి చేశాడు. మధిర మాజీ శాసన సభ్యులు అమరజీవి బోడేపూడి వెంకటేశ్వరరావు, కట్టా వెంకట నర్సయ్య నాయకత్వంలో నిర్వహించిన ప్రజా పోరాటాలలో చురుకుగా పాల్గొన్నారు. ముఖ్యంగా రైతు సంఘం నాయకునిగా రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. పార్టీకి, ప్రజా సంఘాలకు, ఆర్థికంగా సహకరించడం తోపాటు పార్టీ కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా ఆదరించేవారు. కొమ్మన చిన్న బాబు సతీమణి కొమ్మన అరుణ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా నాయకురాలిగా చాలా కాలం పనిచేసారు. జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యురాలిగా, సోమవరం(వైరా) మేజర్ గ్రామ పంచాయతీ సభ్యురాలిగా బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించారు. భార్యాభర్తలు ఇద్దరికీ సిపిఐ(ఎం) పార్టీ నాయకులందరితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ దంపతులు తమ ఇద్దరు కుమార్తెలు లక్ష్మీ నర్మద, మమతలను కూడా అభ్యుదయ భావాలతో పెంచడంతోపాటు అభ్యుదయ భావాలు కలిగిన కుటుంబాల్లోని వ్యక్తులకు ఇచ్చి వివాహాలు చేశారు. కొమ్మన చిన్న బాబు కుటుంబ సభ్యులందరూ కమ్యూనిస్టు భావాలను కలిగి ఉన్నారు. ప్రజలకు కమ్యూనిస్టుల అవసరం పెరుగుతున్న నేపథ్యంలో నిబద్ధత, నిజాయితీ, నిరాడంబరత, కమ్యూనిస్టు విలువలకు నిలువెత్తు ఆదర్శంగా నిలిచిన కామ్రేడ్ కొమ్మన చిన్న బాబు మరణం ప్రజా ఉద్యమాలకు నష్టమని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం నిర్వహించిన కొమ్మన చిన్న బాబు అంత్యక్రియల్లో సిపిఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, వైరా పట్టణం, రూరల్ మండల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సోదరులకు కేజీకేఎస్ ఆధ్వర్యంలో సన్మానం

- గీత కార్మికుల పిల్లలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి
- కేజీకేఎస్ సొసైటీ అధ్యక్షుడు కొండం కరుణాకర్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండలంలోని గోళ్ళపాడు గ్రామానికి చెందిన గీత కార్మికుడు గడ్డమీది వెంకటేశ్వర్లు కుమారులు లెనిన్ కుమార్, మనోజ్ కుమార్‌లు ఇటీవల ప్రకటించిన గ్రూప్-4 ఫలితాల్లో ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం(కేజీకేయస్) ఆధ్వర్యంలో సంఘం గ్రామ అధ్యక్షులు కొండం కరుణాకర్ ఆధ్వర్యంలో వారికి ఆదివారం సన్మానం చేశారు. గోళ్లపాడులోని కల్లుగీత కార్మిక సంఘం కార్యాలయంలో లెనిన్, మనోజ్‌లను శాలువతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కొండం కరుణాకర్ మాట్లాడారు. లెనిన్, మనోజ్‌లు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. లెనిన్, మనోజ్‌లను ఆదర్శంగా తీసుకొని గీత కార్మికుల పిల్లలు, గ్రామంలోని విద్యార్థులు అనేక విజయాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బోనపల్లి సంగయ్య, మంగూరు ముత్తయ్య, గోడ వెంకన్న, తొండల రవి, గుండు రమేష్, పరికిపల్లి సుదర్శన్, కొండ అజయ్ కుమార్, చామకూరి రత్నం, మొక్క వెంకన్న, సంపేట సందీప్, యాదగిరి, తాళ్లపల్లి ఉపేందర్, వెంకటేశ్వర్లు, సంపేట సైదులు, శ్రీను, బురుగడ్డ బిక్షపతి, గోడ మల్లయ్య, మొక్క వీరబాబు, కొండం రామారావు, మధు, గుండు, వెంకన్న, ఆంజనేయులు, సైదలు, శ్వేత, నాగు, జోగయ్య నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల పాదయాత్రను జయప్రదం చేయాలి

- ఉద్యమకారుల జిల్లా అధ్యక్షులు పసుపులేటి నాసరయ్య

నవతెలంగాణ-ముదిగొండ



ఈనెల 27, 28న కరీంనగర్ నుండి వేములవాడ వరకు జరుగు ఉద్యమకారుల మహాపాదయాత్రను విజయవంతం చేయాలని ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షులు పసుపులేటి నాసరయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను 250 గజాలస్థలాన్ని, ఇంటి నిర్మాణానికి 10 లక్షలు, పెన్షన్ ఆరోగ్యకార్డు, బస్సు పాసు, ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ ముఖ్య సలహాదారులు ఓరుగంటి ఆనంద్ పాదయాత్ర చేసి ప్రభుత్వానికి కనివింపు కలిగించేందుకు. కరీంనగర్ నుండి వేములవాడకు మహాపాదయాత్ర నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. పాదయాత్రను విజయవంతం చేయుటకు డాక్టర్ కెవి కృష్ణారావు,(రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్) ఉద్యమకారుల జిల్లా అధ్యక్షులు పసుపులేటి నాసరయ్య ఆధ్వర్యంలో ఈనెల 27న ఉదయం మయూరి సెంటర్ అమరవీరుల స్థూపం వద్ద నుండి పాదయాత్ర ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ఉద్యమకారులందరూ అధిక సంఖ్యలో యాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని పసుపులేటి నాసరయ్య కోరారు.

అనారోగ్యంతో మెకానిక్ చిన్నా మృతి

- అంత్యక్రియలకు కాంగ్రెస్ నాయకుడు సురేష్‌నాయక్ ఆర్థికసాయం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఏదులాపురం పంచాయతీ వరంగల్ క్రాస్ రోడ్‌కు చెందిన హైడ్రాలిక్ మెకానిక్ బండి చిన్నా (55) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందాడు. చిన్నా కుటుంబానిది పేదరికం కావడంతో అంత్యక్రియలకు సైతం ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న పాలేరు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భూక్యా సురేష్‌నాయక్ స్పందించారు. మృతదేహాన్ని సందర్శించి నివాళ్లర్పించారు. అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయంగా రూ.5వేలు కుటుంబ సభ్యులకు అందజేశాడు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. చిన్నాకి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతదేహాన్ని సందర్శించిన వారిలో నాయకులు కళ్లెం శేషిరెడ్డి, కొక్కు రాజు, ముస్తఫా, రమేష్ తదితరులున్నారు.

బేతుపల్లి వరద కాలువపై వంతెన నిర్మించాలి

- సిద్దారంలో ఆగిన కమ్యూనిటీహాళ్లను పూర్తిచేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్



నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం గౌరిగూడెం-సిద్దారం గ్రామాల ప్రజల సౌకర్యార్థం బేతుపల్లి వరద కాలువపై వంతెన నిర్మించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయా గ్రామాల పార్టీ నాయకులతో కలిసి వరద కాలువ కాలువ, నిర్మాణాలు ఆగిన కమ్యూనిటీ హాళ్లను శ్రీనివాస్ పరిశీలించారు. సిద్దారం, గౌరిగూడెం గ్రామాలకు చెందిన రైతులకు బేతుపల్లి వరద కాలువ అవతలి పక్క పంట పొలాలు ఉన్నాయని, రైతులు అటుఇటూ ట్రాక్టర్లు, ఎండ్లబండ్లు, ఇతరత్రా వాహనాలతో అవతలి పక్కకు వెళ్లేందుకు గతంలో వంతెన ఉండటంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావని శ్రీనివాస్ అన్నారు. బేతుపల్లి వరద కాలువ నిర్మాణ సమయంలో పాత వంతెనను కూలగొట్టారన్నారు. కూలగొట్టిన వంతెన స్థానే కొత్తగా వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉండగా అదింత వరకు జరగలేదన్నారు. దశాబ్ద కాలానికి పైగా వంతెన లేకపోవడం వల్ల గౌరిగూడెం, సిద్దారం గ్రామాల రైతులు, కూలిపనులకు వెళ్లేవారు నానా అవస్థలు పడుతున్నారన్నారు. వాళ్ల పంటచేలకు ట్రాక్టర్లను గాని, ఎండ్లబండ్లను గాని తీసుకొని వెళ్లాలంటే సుమారుగా 2, 3 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, కూలీల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తక్షణమే వరద కాలువపై వంతెన నిర్మాణం చేపట్టాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అలాగే సిద్దారం గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నిర్మాణాలు చేపట్టి సగం మధ్యలో ఆగిపోయిన కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌తో పాటు పార్టీ మండల కమిటీ సభ్యులు ఎలగం కృష్ణ, ఎలగం రాములు, రాంబాబు, హుస్సేన్, నారాయణ, వెంకటేష్, ఆదినారాయణ, వెంక్రటావు పాల్గొన్నారు.

డబల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఆవేదన

నవతెలంగాణ - బోనకల్



సీపీఐ(ఎం) బృందంతో డబల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. తాము ఈ ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని ప్రతిరోజు నరకయాతన అనుభవిస్తున్నామని బృందానికి వారు తమ ఆవేదన, ఆక్రందనను వ్యక్తం చేశారు. మండల పరిధిలోని రావినూతల డబల్ బెడ్ రూమ్ ఇళ్లను సిపిఎం రావినూతల గ్రామ శాఖ బృందం ఆదివారం పరిశీలించింది. డబల్ బెడ్ రూమ్ ఇళ్ల స్లాబ్ పెచ్చులు ఊడిపోవడం, మెట్లు కూలిపోవడం, గోడలన్నీ పగుళు ఇచ్చి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల ఓ ఇంట్లో స్లాబ్ పెచ్చులు ఊడి మహిళపై పడటంతో ఆమె స్వల్ప గాయాలు పాలైంది. ప్రతి ఇల్లు ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఈ క్రమంలో రావినూతల సిపిఎం బృందం డబల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించింది. దీంతో డబల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు తమ ఆవేదనను వారు ముందు వ్యక్తం చేశారు. ప్రస్తుతం 20 డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఉన్నాయని అందరం కూడా అతి నిరుపేద కుటుంబానికి చెందిన వారిమేనని, ఎంతో కొంత అప్పు చేసి ఆనాడే ఇళ్లను బాగు చేసుకున్నామని, అయినా వర్షాలు వచ్చిన సమయంలో ఇంట్లో ఉండలేకపోతున్నామని వారు ముందు ఆవేదన వ్యక్తం చేశారు. డబల్ బెడ్ రూమ్ ఇల్లు గోడలన్నీ పగుళ్లు ఇచ్చాయని ఎప్పుడూ ఏమి జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొని ఉందని, ఎవరికి చెప్పినా పట్టించుకోవడంలేదని సిపిఎం బృందం ముందు వారి ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని, నిత్యం నరకయాతన అనుభవిస్తున్నామని తెలిపారు. అనంతరం సిపిఎం బృందం సభ్యులు దొండపాటి సత్యనారాయణ, జోనిబోయిన గురవయ్య, కొంగర భూషయ్య మాట్లాడుతూ ఆనాడు ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇళ్లను నాణ్యంగా నిర్మించకపోవడం వల్లనే ప్రస్తుతం ఈ పరిస్థితి నెలకొని ఉందన్నారు. నిర్మాణాలన్నీ ఎంతో నాసిరకంగా జరుగుతున్నాయని ఆనాడు సిపిఎం బృందం ఎంత మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఆనాడు అధికార పార్టీ నాయకులు అహంకారపూరితంగా వ్యవహరించారని విమర్శించారు. ఒక్కొక్క ఇంటిని చూస్తే ఈ ఇంట్లో కుటుంబాలు నివాసం ఎలా ఉంటున్నారో అర్థం కావటం లేదన్నారు. ఏ ఇల్లు చూసినా ప్రమాదకరంగానే ఉందన్నారు. పేరుకి డబల్ బెడ్ రూమ్ ఇల్లు మాత్రమేనని ఆ ఇల్లు నివాసయోగంగా లేవన్నారు. ప్రభుత్వం స్పందించి ఆ ఇళ్లను పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లావూరి వెంకటేశ్వర్లు, వట్టికొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊకే అబ్బయ్య మృతికి సంతాపం

నవతెలంగాణ- ఖమ్మం

ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య మృతి పట్ల బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉపనేత, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బూర్గంపహాడ్, ఇల్లెందు నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహించిన అబ్బయ్య అతి పిన్న వయసులోనే అసెంబ్లీలో అడుగుపెట్టిన ఘనత సొంతం చేసుకున్నారని ఆయన కొనియాడారు. శాసనసభలో గిరిజన, అణగారిన వర్గాల గొంతుకగా నిలిచిన అబ్బయ్య మరణం ఆ వర్గాల ప్రజలకు తీరని లోటని అన్నారు. నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ.. వారి సమస్యల పరిష్కారానికి ఆయన ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. అబ్బయ్య కుటుంబ సభ్యులకు ఎంపీ రవిచంద్ర ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

మాజీ ఎంపీ నామ సంతాపం

ఇల్లందు మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య మృతి పట్ల బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు విచారం వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పాటుపడిన అబ్బయ్య సేవలు మరువలేనివి అన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఇల్లెందు నియోజకవర్గ అభివద్ధిలో తన ముద్ర వేశారని అలానే ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి ఆయన అహర్నిషలు కృషి చేశారన్నారు. 2009లో తాను ఖమ్మం నుంచి ఎంపీగా గెలిచిన సమయంలో అబ్బయ్యకు ఇల్లందు నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున టికెట్ ఇప్పించి ఎమ్మెల్యేగా గెలిపించుకున్న విషయాన్ని ఈ సందర్భంగా మాజీ ఎంపీ నామ గుర్తు చేసుకున్నారు. అబ్బయ్య మతి పట్ల వారి కుటుంబ సభ్యులకు నామ తన ప్రగాఢ సంతాపం తెలుపుతూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

నేడు ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమం : కలెక్టర్

నవతెలంగాణ-ఖమ్మం

మధిర పట్టణంలో సోమవారం ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా సోమవారం మధిర పట్టణం మునిసిపల్ రోడ్‌లోని వర్తక సంఘ భవనంలో జయ జయహే ప్రజా పాలన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సంగీత, నాటక అకాడమీ చైర్ పర్సన్ ప్రొఫెసర్ ఆలేఖ్య పుంజాలా చే సాంస్కృతిక కార్యక్రమాలు సాయంత్రం 6 గంటల నుండి నిర్వహించనున్నట్లు, ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి లాంగ్ జంప్ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ- ఖమ్మం



ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-10 విభాగంలో లాంగ్ జంప్‌లో పూనాటి అలోక్ ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. రాష్ట్ర స్థాయి పోటీలకి ఎంపికయ్యాడు. డిసెంబర్ 1న మంచిర్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వాహకులు షఫీ తెలిపారు.

నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రారంభమైన ఆన్లైన్ ప్రక్రియ

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

నగరపాలక సంస్థ పరిధిలో 60% పైగా కుటుంబ సర్వే పూర్తయిన నేపథ్యంలో డివిజన్ల వారీగా ఆన్లైన్ నమోదు చేసే ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. డేటా ఎంట్రీ ఆపరేటర్లను పర్యవేక్షించడానికి ఇంచార్జ్ ఆఫీసర్లను నియమించి వారి ఆధ్వర్యంలో తప్పులు లేకుండా ఆన్లైన్లో నమోదు చేసే విధంగా పకడ్బందీగా ప్రణాళిక ప్రకారం ఒక డివిజన్ సంబంధించిన పత్రాలను ఒక సూపర్వైజర్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఆన్లైన్లో నమోదు చేసే విధంగా ఏర్పాట్లు చేశారు

పిచికారి చేసేదెప్పుడో...?

- దోమల మందు ఇప్పుడెందుకు...
- అరకొర నిధులతో సతమతమవుతున్న పంచాయతీలకు అదనపు భారం
- కమిషన్ల కోసమే అంటున్న ప్రజలు
- ఆ అధికారే సూత్రధారి

నవతెలంగాణ-వేంసూరు

అరకొర నిధులతో సతమతమవుతున్న గ్రామ పంచాయతీలకు ఈ సమయంలో అవసరం లేని దోమల మందును కమీషన్ల కోసం స్వయంగా అధికారి తెప్పించి అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దోమల ముందు పేరుతో మేజర్ పంచాయితీలో రూ.40 వేల వరకు నిధులు డ్రా చేసినట్లు సమాచారం. మండలంలో 26 గ్రామపంచాయతీలు ఉండగా ఏయే ఏ గ్రామ పంచాయతీలకు నిధులు ఉన్నాయో ఆ పంచాయతీకి అంటగట్టడం జరుగుతుంది. గత కొన్ని రోజుల క్రితం గ్రామపంచాయతీలో మల్టీ పర్పస్ వర్కర్ల జీతాలు నిమిత్తం నిధులు డ్రా చేసే క్రమంలో దోమల మందుకు సంబంధించిన రూ.40 వేలు వీటితోపాటు స్టేషనరీ అదనపు ఖర్చులు పంచాయతీ ప్రత్యేక అధికారికి సమాచారం లేకుండా నోట్ ఫైల్ పెట్టకుండా ప్రత్యేక అధికారిని ఓటిపి చెప్పమని పదేపదే వేధించి తప్పుదోవ పట్టించి నిధులు డ్రా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శి చేయవలసిన పనులను అధికారి చేయటం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీలపై అవగాహన లేని అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించటంతో సంబంధిత అధికారి అవినీతికి అడ్డు లేకుండా పోయిందని ఆరోపణలు ఉన్నాయి. ఓ ప్రత్యేక అధికారి ఇప్పటికే ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లారు. నాసిరకం దోమల మందును గ్రామపంచాయతీలకు అంటగట్టి లీటరు బహిరంగ మార్కెట్లో రూ.700కు దొరుకుతుండగా 1500 పెట్టి అధిక రేటుకు అధికారి ప్రమేయంతో గ్రామ పంచాయతీలకు విక్రయించారు, కొంతమంది గ్రామపంచాయతీ కార్యదర్శులను అడగగా ఎంపీఓ ఇచ్చారు మేము తీసుకువెళ్లాం అని చెబుతున్నారు. నాసిరకం దోమల మందును కమీషన్ల కోసం సప్లై చేసి గ్రామపంచాయతీ నిధులను దుర్వినియోగం చేసిన వారిపై జిల్లా అధికారులు సమగ్రంగా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. అత్యావసరాలకు ఉపయోగించవలసిన నిధులను పక్కదారి పట్టించటం... గత కొన్ని సంవత్సరాలుగా ఆ అధికారి గుట్టుసప్పుడు కాకుండా పంచాయతీ నిధులను స్వాహా చేయటం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.

కమీషన్ల కోసమే దోమలు మందు తెప్పించారు
తక్కెళ్ళపాటి గోపాలకృష్ణ, వేంసూరు

వర్షాకాలంలో వాడవలసిన దోమల మందు పిచికారి ఆ సమయంలో చేయకుండా ఇప్పుడు ఎందుకు గ్రామపంచాయతీలకు తెచ్చారు. నిధులు రాక ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే అవసరాలకు ఉపయోగించుకోవలసిన నిధులను కమీషన్ల కోసం అవసరం లేని మందులను తెప్పించిన వారిపై చర్యలు తీసుకోవాలి. ఆ మందు మరో ఏడు నెలల తరువాత ఉపయోగపడుతుంది. అప్పటికే మందు కాల వ్యవధి ముగుస్తుంది. ఆ నష్టం ఎవరు భరాయిస్తారు. ప్రోత్సహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి. గత మూడు నెలల క్రితం మండల సర్వసభ్య సమావేశంలో 26 గ్రామపంచాయతీలలో ఎన్ని ఫాగింగ్ మిషన్లు పనిచేస్తున్నాయని వివరాలు అడగగా నేటి వరకు ఆ అధికారి వివరాలు చెప్పకపోవడం ఆ శాఖ అధికారి పనితనానికి నిదర్శనం.



అంబటికి మంత్రి పొంగులేటి పరామర్శ

నవతెలంగాణ-చింతకాని



మండల పరిధిలో నాగలవంచ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబటి వీరయ్య ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. వీరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గ్రామంలో బలోపేతం చేసేందుకు ఎంతగానో కృషి చేశారని, పార్టీకి విధేయుడుగా నిబద్ధత ఉన్న వ్యక్తిగా ఆయన మరణం వరకు కాంగ్రెస్ పార్టీని వీడలేదని, ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఆయన మనకు దూరం అవడం ఎంతో బాధాకరమైన విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో తుంబూరు దయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబట వెంకటేశ్వర్లు, కిలారి మనోహర్, కూరపాటి కిషోర్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయండి

- కేంద్రాలను పరిశీలించిన డీఆర్డీఏ సన్యాసిరావు

నవతెలంగాణ-కల్లూరు



ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు వేగావంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బంది కలక్కుండా చూడాలని డిఆర్డిఏ సన్యాసిరావు ఆదేశించారు. ఆదివారం పుల్లయ్య బంజర సమీపంలోని శివాలయం కొనుగోలు కేంద్రాన్ని, లక్ష్మీపురంలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు నిర్వాహణదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు గన్ని సంచులు కొరతపై అధికార దృష్టికి తీసుకువచ్చారు. గన్ని సంచుల కొరత వల్ల కొనుగోలు వేగవంతంగా జరగట్లేదని సరిపడా గన్ని సంచులు పంపించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం వెంకట్రామారావు, ఐకెపి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాల మహానాడు

మండల ప్రధాన కార్యదర్శిగా కటికల శ్యాంబాబు

నవతెలంగాణ-బోనకల్



మాల మహానాడు మండల ప్రధాన కార్యదర్శిగా కలకోట గ్రామానికి చెందిన కటికల శ్యాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. మాల మహానాడు మండల స్థాయి విస్తృత సమావేశం ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు. ఉపాధ్యక్షులుగా నిమ్మ తోట రవికుమార్, కొట్టే సునీల్ కుమార్, గుజ్జర్లపూడి వినయ్‌లను ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ సత్తుపల్లి పట్టణ అధ్యక్షుడిగా 'గాదె'

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గాదె చెన్నకేశవరావును ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ నియమించారు. ఈ మేరకు పార్టీ జిల్లా కేంద్రం నుంచి విడుదలైన నియామకపు పత్రాన్ని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ దంపతులు చేతుల మీదుగా చెన్నకేశవరావు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడి పనిచేసే వారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయన్నారు. ఇందుకు ఉదాహరణ చెన్నకేశవరావేనన్నారు. గత మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీని పట్టణంతో పాటు నియోజకవర్గంలో బలోపేతం చేయడంలో చెన్నకేశవరావు కీలకపాత్ర పోషించారని కొనియాడారు. పట్టణ అధ్యక్షుడిగా అవకాశం కల్పించి నియమించడంపై ఈ సందర్భంగా చెన్నా ఎమ్మెల్యే దంపతులకు, జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం చెన్నాకేశవరావు సత్తుపల్లి పీఏసీఎస్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. చెన్నకేశవరావు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా నియమించడంపై పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

సందేహమొస్తే సంప్రదించండి

- ఫేక్ కాల్స్ వస్తే బ్యాంకు అధికారులకు తెలియజేయండి
- ఎస్బీఐ రీజినల్ మేనేజర్ లింగస్వామి


నవతెలంగాణ-ఖమ్మం



ఫేక్ కాల్స్ అని సందేహమొస్తే కాల్స్ అటెంప్ట్ చేయకుండా స్థానిక బ్యాంకు అధికారులను సంప్రదించాలని ఖమ్మం ఎస్బీఐ రీజినల్ మేనేజర్ లింగస్వామి సూచించారు. ఆదివారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో భారతీయ స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో సైబర్ మోసాల నివారణ అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు, అవగాహన కోసం ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తూ..ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్స్ షేక్ ఇబ్రహీం, మధుబాబు, విద్యాసాగర్ వెంకటేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాఘవరావు కుటుంబానికి మంత్రి పరామర్శ

నవతెలంగాణ-ఖమ్మం



తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) కొమరగిరి రాఘవరావు తండ్రి కొమరగిరి రంగారావు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆదివారం ఖమ్మంలోని రోటరీ నగర్‌లో స్వగృహానికి వెళ్లి వారి కుటుంబాన్ని మంత్రి పొంగులేటి పరామర్శించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆత్మకు శాంతి కలగాలని దేవున్ని ప్రార్థించారు.

ప్రార్థన మందిరాల నిర్మాణానికి మంత్రి పొంగులేటి వితరణ

తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలంలోని పలు ప్రార్థన మందిరాల నిర్మాణానికి విరాళాలు అందజేశారు. ఆదివారం మంత్రి పొంగులేటి తన క్యాంపు కార్యాలయంలో ఆయా ప్రార్థన మందిరాల కమిటీ బాధ్యులకు, నాయకులకు ఇచ్చారు. భైరవునిపల్లి గ్రామంలో కాటమయ్య దేవాలయానికి రూ.రెండు లక్షలు, బంగారు మైసమ్మ దేవాలయానికి రూ.50వేలు, గువ్వలగూడెం గ్రామంలోని గంగమ్మ తల్లి దేవాలయానికి రూ. 50వేలు, మసీదు నిర్మాణానికి రూ. 50వేలను అందించారు. అదేవిధంగా నేలకొండపల్లి గ్రామంలోని కాటమయ్య ఆలయానికి రూ. లక్ష, మంగాపురం తండా సేవాలాల్ గుడికి రూ.లక్షను అందజేశారు.

రాజధానిలో ఒక దగ్గరికి చేరిన కేశ్వాపురం గ్రామస్తులు

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని కేశవపురం గ్రామానికి చెందిన గ్రామస్తులంతా ఒక దగ్గరికి చేరి తమ కుటుంబం, తమ గ్రామానికి సంబంధించిన అనేక అనుభవాలను ఆదివారం పంచుకున్నారు. కేశ్వాపురం గ్రామంలో పుట్టినప్పటికీ హైదరాబాద్‌లో నివస్తున్న సుమారు 75 కుటుంబాలు ఒక చోటికి చేరటం విశేషం. హైదరాబాద్‌లో వివిధ రంగాలలో ఉన్నతులుగా వారు అందరూ హైదరాబాద్‌లోని ఆదిబట్ల సమీపంలో ఒక చోట చేరి భవిష్యత్తులో సమాజానికి, తమ గ్రామ అభివృద్ధికి ఏమి చేయాలి అనే దానిపై చర్చించారు. భవిష్యత్‌లో కూడా ఇలాగే అందరం కలిసి వుండాలని నిర్ణయించుకున్నారు.

మధిరలో మంత్రి, ఎంపీ పొంగులేటి పర్యటన

నవతెలంగాణ-మధిర



మధిరలోని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ఆదివారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ముందుగా ఆత్కూరులోని తునికిపాడురోడ్‌లో జరుగుతున్న రెడ్డి వనసమారాధనకు హాజరయ్యారు. అనంతరం ఆత్కూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అంకె వేలాద్రి అనారోగ్యంతో ఉండగా వారిని పరామర్శించి వారి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకొని ఆర్థిక సహాయం అందించారు. అనంతరం మధిరలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కోట రాంబాబు గృహంలో తేనీటి విందుకు హాజరై కార్యకర్తలతో నాయకులతో గడిపి ముచ్చటించారు. ఈ కార్యక్రమాల్లో మధిర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో వివిధ హెూదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం



ఉగాది నాటికి వెలుగుమట్ల అర్బన్ పార్క్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మంత్రి ఖమ్మం నగరపాలక సంస్థ 15 డివిజన్‌లో పర్యటించి టీయూఎఫ్ఐడీసీ నిధులు 2 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన వెలుగుమట్ల అర్బన్ పార్కు రోడ్డు నిర్మాణ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వెలుగుమట్ల అర్బన్ పార్కుకు డబుల్ లైన్ రోడ్డు నిర్మాణం నాణ్యతతో ఉగాది నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, ఏజెన్సీలకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు అధిక సంఖ్యలో వెలుగుమట్ల అర్బన్ పార్కుకు వచ్చి కొంత సమయం ప్రశాంతంగా గడిపే విధంగా దీనిని అభివృద్ధి చేయాలని, వెలుగుమట్ల అర్బన్ పార్క్ స్థలం ఎక్కడి వరకు ఉందో సర్వే చేసి ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలని మంత్రి రెవెన్యూ అధికారులకు సూచించారు. ఖమ్మం నగర సమీప స్థలంలో మనకు అద్భుతమైన వెలుగుమట్ల అర్బన్ పార్క్ ఉండటం మన అదృష్టమని, ఖాళీ స్థలంలో అర్బన్ పార్క్ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ప్రతిపాదనలు తయారుచేసి అందించాలని మంత్రి ఆదేశించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిష్కరించి వారి నుంచి ఫీజులు వసూలు చేయాలని, మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చాలని మంత్రి తెలిపారు. నగరంలో పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా అమలు చేయాలని అన్నారు. హెూర్డింగులు ద్వారా మరింత ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వర్‌రావు, డిసిసిబి చైర్మెన్ దొండపాటి వెంకటేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, 15వ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రబీ వరి సాగుకు రైతన్నల సమాయత్వం

- సాగునీరు ప్రణాళిక ఖరారు కోసం ఎదురుచూపులు

నవతెలంగాణ-కల్లూరు



రబీలో వరి సాగు చేయడానికి రైతన్నలు సమయుక్తమై నార్లు పోయటానికి శ్రీకారం చుట్టారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉండటంతో రబీ పంటకు ప్రభుత్వం సాగునీరు సరఫరా చేస్తుందని నమ్మకంతో పంట సాగుకు దిగారు. మండలంలో సుమారు 25 వేల ఎకరాల్లో రబీ సీజన్లో వరి సాగు చేసే అవకాశం ఉంది. అన్ని గ్రామాల్లో ముమ్మరంగా వరి కోతలు జరుగుతుండగా మండలంలో ముందస్తుగా వరి కోతల కోసిన గ్రామాల్లో నార్లు పోస్తున్నారు. ఎర్రబోయినపల్లి, లింగాల, బత్తులపల్లి, కప్పల బంధం తదితర గ్రామాల్లో నార్లు పోస్తున్నారు. ఎర్రబోయినపల్లి గ్రామంలో దమ్ము చేసి విత్తనాలు చదువుతున్నారు. ఈ విధంగా రైతులు రబీ పంటకు సిద్ధమయ్యారు. కానీ ప్రభుత్వం సాగునీటి సరఫరా విషయంలో ఇంకా రబీ ప్రణాళిక సిద్ధం కాలేదు అధికారులు రబీ పంటకు ఎంత సాగునీరు సరఫరా చేయాల్సి ఉంటుంది అనేది అధికారులు ప్రణాళిక ఖరారు చేయాల్సి ఉంది. ప్రభుత్వం వెంటనే సాగునీటి సరఫరా ప్రణాళిక సిద్ధం చేసి ప్రకటించాలని రైతుల కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోని ఆళ్లపాడు గ్రామంలో పలువురకు సీఎంఆర్ చెక్కులను ఆదివారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డి సిఫార్సులతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆళ్లపాడు గ్రామానికి చెందిన పలువురికి నిధులు మంజూరు అయ్యాయి. అన్నబోతు వీరబాబుకు రూ. 33వేలు, మందా రుక్మిణికి రూ.21వేలు, బెజవాడ నాగమణికి రూ. 19,500, బుంగ నాగమణికి 12,000 చొప్పున మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను వారికి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బుంగ రాములు అందజేశాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కందుల పాపారావు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తోటకూర వెంకటేశ్వరరావు, గీత కార్మిక సంఘం ప్రెసిడెంట్ కందుల సత్యం, మైనారిటీ నాయకుడు షేక్ నాగుల్ మీరా, వేల్పుల రమేష్, మరీదు రోశయ్య, కందుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంక గాంధీ విజయం పట్ల హర్షం వ్యక్తం

నవతెలంగాణ-వేంసూరు



కేరళ రాష్ట్రంలో వాయనాడు పార్లమెంట్ ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన ప్రియాంక గాంధీ గెలుపు పట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సోమిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడుతూ మొదటిసారి ప్రత్యక్ష రాజకీయాల్లో వచ్చి అత్యధిక ఓట్ల మెజార్టీతో విజయం సాధించడం గాంధీ కుటుంబం వారసత్వం పట్ల ప్రజలకు విధేయత చూపారని అన్నారు. పార్లమెంటులో అధికార పక్షం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ముందుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

డిసెంబర్ 1న మాలల సింహంగర్జన

నవతెలంగాణ-బోనకల్



డిసెంబర్ 1వ తేదిన సికింద్రాబాద్ పెరెడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాలల సింహ గర్జన యధావిధిగా జరుగుతుందని మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల రవికుమార్, మండల కన్వీనర్ బందెల ముత్తయ్య తెలిపారు. డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జన పోస్టర్‌ను మండల కేంద్రంలో ఆదివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని కార్యక్రమం యధావిధిగా జరుగుతుందని స్పష్టం చేశారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా మాలాల సింహగర్జనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆ ప్రచారాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యకమంలో మాలలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యకమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు పాల్గొన్నారు.

సంస్కృతి, మన ఇతిహాసాలపై దృష్టి సారించాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం



నెల- నెలా వెన్నెల లాంటి కార్యక్రమాల్లో యువతరాన్ని భాగస్వామ్యం చేసి సంస్కృతి, మన ఇతిహాసాలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నెల నెలా-వెన్నెల అభ్యుదయ సాంస్కృతిక కదంబ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొబైల్, టీవీలు వచ్చిన తర్వాత మన సంస్కృతి, మన ఇతిహాసాల పై దృష్టి తగ్గిపోతుందని గమనిస్తున్నామని, ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరింత మందిని భాగస్వామ్యం చేస్తూ నిర్వహించాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఇతిహాసం తెలిసిన జనాభా అధికంగా ఉందని, దేశ ఇతిహాసాన్ని సంరక్షించే బాధ్యత కూడా మన పైన ఉంటుందని అన్నారు. నెల-నెలా వెన్నెల వంటి కార్యక్రమాలకు మనతో పాటు మన ఇంటిలోని యువతరాన్ని కూడా తీసుకొని రావాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కీర్తిశేషులు నాగబత్తిని మాలతి తృతీయ వర్ధంతి సందర్భంగా పేద మహిళలకు చీరలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. నాగబత్తిని మాలతి జీవిత సాఫల్య పురస్కారాన్ని డాక్టర్ వనం కృష్ణవేణికి జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగబత్తిని రవి, నాగబత్తిని రాజాచైతన్య, మోటమర్రి జగన్మోహన్‌రావు, అన్నా బత్తుల సుబ్రహ్మణ్య కుమార్, వేల్పుల విజేత, డా. వనం సమ్మయ్య, కోన జనార్దన్ రావు, మోత్కూరి గోపాలరావు, నాగబత్తిని భాస్కరరావు, కట్టా కృష్ణార్జునరావు, ఈశ్వరప్రగడ రంగనాథ్, కళాభిమానులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని నివారించాలి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు జీవీ.నాగమల్లేశ్వరరావు

నవతెలంగాణ-బోనకల్



ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో జరుగుతున్న జాప్యాన్ని వెంటనే నివారించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు గోదా వెంకట నాగమల్లేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్ యుటీఎఫ్ బోనకల్ మండల కమిటీ సమావేశం మండల కేంద్రంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు భూపతి ప్రేతమ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న వివిధ బిల్లులకు సంబంధించిన నగదును రిలీజ్ చేయాలని, పదో తరగతి స్పాట్ మూల్యాంకను విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ విడుదల చేయాలని, మెడికల్ బిల్లులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డిఏలను ప్రకటించాలని ఆయన కోరారు. గురుకుల పాఠశాల పనివేళల సమయాన్ని మార్చాలని, కేజీబీవీ ఉపాధ్యాయులు మినిమమ్ టైం స్కేల్ మంజూరు చేయాలని, 317 ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రభుత్వ విద్యారంగానికి అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేయటం లేదన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలకు మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో అమలకు నోచుకోని అనేక సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కారం చేస్తుందని ఆశ భావంతో ఉన్నామన్నారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వల్లం కొండ రాంబాబు, జిల్లా కార్యదర్శి షేక్ నాగుర్ వలి, మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, జిల్లా నాయకులు సద్దా బాబు, చిన్న రంగారావు, జల్లా కోటయ్య, పీ.గోపాలరావు, కే.సౌభాగ్యలక్ష్మి, మండల కోశాధికారి కంభం రమేష్, పీ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షను పరిశీలించిన డీఈవో

నవతెలంగాణ-కల్లూరు



ఎన్ఎంఎంఎస్ ప్రతిభ ఉపకార వేతనం పరీక్ష ఆదివారం కల్లూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికలు ఉన్నత పాఠశాలలో ఎంఈఓ పత్తిపాటి వేదత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పరీక్షలను డీఈఓ సోమశేఖర శర్మ పరిశీలించి పరీక్ష నిర్వహణ బాధ్యతలు చేపట్టిన చీఫ్ సూపరింటెంట్ డీఓలను, ఎంఈఓని అభినందించారు.

ఉరి వేసుకుని యువకుడు మృతి

నవతెలంగాణ-వేంసూరు



ఉరి వేసుకుని యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని దుద్దపూడి గ్రామంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం దుద్దపూడికి చెందిన పొరళ్ళ నరసింహారావు (17) డిగ్రీ చదువుతున్నాడు. ఆదివారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మహిళలపై అత్యాచారాలను ఖండించాలి

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మేరుగు రమణ

నవతెలంగాణ-వైరాటౌన్



మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అరాచకాలు, దౌర్జన్యాలు, ఖండించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మేరుగు రమణ అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వైరా పట్టణ కమిటీ సమావేశం మాడపాటి సుజాత అధ్యక్షతన స్థానిక బోడెపూడి భవనంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘం జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ మాట్లాడుతూ భారతదేశంలో, రాష్ట్రంలో నిత్యం మహిళలపై అరాచకాలు, దౌర్జన్యాలు, దాడులు జరుగుతున్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. మహిళల హక్కుల పరిరక్షణ, భద్రత, మహిళాల చట్టాలను కఠినంగా అమలు చేయడం కోసం సంఘం ఆధ్వర్యంలో సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు గుడిమెట్ల రజిత, మాజీ ఎంపీపీ బొంతు సమత, మహిళా సంఘం పట్టణ కార్యదర్శి తోట కృష్ణవేణి, చావా కళావతి, కంసాని మల్లికాంభ, గుమ్మ సాయి లక్ష్మి తాటి కృష్ణ కుమారి, భందేల అమృతమ్మ బత్తుల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల ప్రక్రియను వేగవంతం చేస్తాం

- మంత్రులు పొంగులేటి, తుమ్మల హామీ
- స్తంభాద్రి జర్నలిస్ట్ సొసైటీకి మంత్రుల అభినందనలు

నవతెలంగాణ-ఖమ్మం





ఖమ్మం నియోజకవర్గంలోని అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలను అందించే ప్రక్రియను వేగవంతం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గ్రహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన మూడు జర్నలిస్ట్ యూనియన్లు టియుడబ్ల్యుజె (ఐజెయు), టియుడబ్ల్యుజె (టిజె ఎఫ్), టిడబ్ల్యుజెఎఫ్(ఫెడరేషన్) ఆధ్వర్యంలో స్తంభాద్రి జర్నలిస్ట్ హౌజింగ్ సొసైటి నూతన పాలకవర్గ సభ్యులు ఆదివారం ఇద్దరు మంత్రులను కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ళ స్థలాలను వీలైనంత తొందరగా ఇళ్ళ స్థలాలను అందించాలనే కృతనిశ్చయంతో ఉందన్నారు. ఖమ్మంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ళ స్థలాలను అందించాలనే సానుకూల దృక్పథంతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఉందన్నారు. ఖమ్మంలో సొసైటి ద్వారా అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు దక్కే విధంగా మూడు యూనియన్లు సమిష్టిగా కృషి చేయాలని మంత్రులు సూచించారు. ప్రభుత్వం తరుపున ఏలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకోస్తే వెంటనే పరిష్కరిస్తామని ఇద్దరు మంత్రులు హామి ఇచ్చారు. జర్నలిస్టుల బృందం కలిసిన వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల వెనువెంటనే ఖమ్మం జిల్లాకలెక్టర్‌కు ఫోన్ చేసి జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల పక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మరో మంత్రి పొంగులేటి కూడా సానుకూలంగా స్పందించారు. సొసైటికి అదనంగా కేటాయించాల్సిన 8 ఎకరాల స్థలం సమస్యను కూడా వీలైనంత తొందరగా పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. మరోసారి యూనియన్, సొసైటి ముఖ్యులతో భేటి అవుతానని హామీఇచ్చారు. ఇద్దరు మంత్రులు జర్నలిస్ట్ సొసైటి కొత్త పాలకవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి కె.రాంనారాయణ, జిల్లా శాఖ అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, టియుడబ్ల్యుజె (టిజెఎఫ్)జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కమిటి సభ్యుడు రాము, తోపాటు స్తంభాద్రి హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, కోశాధికారి వెన్నబోయిన సాంబశివరావు, ఉపాధ్యక్షులు మైసపాపారావు, డైరెక్టర్లు పివి.సత్యనారాయణ, బత్తిని వాసు, అలస్యం అప్పారావు, కో అప్షన్ మెంబర్ ప్రశాంత్‌రెడ్డి, సీనియర్ పాత్రికేయులు నల్లజాల వెంకట్రావు(ఆంధ్రజ్యోతి), లింగయ్య(ఈనాడు), పొన్నం శ్రీధర్(ది హిందూ), మామిడాల భూపాల్‌రావు(ఎన్‌టివి) ,మహేందర్(సాక్షిటివి), టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర కమిటి సభ్యులు మాటేటి వేణుగోపాల్ రావు, నాయకులు మైనోద్దిన్, జనార్ధనాచారి, నామ పురుషోత్తం, సత్యనారాయణ, ఏలూరి వేణు, చెరుకుపల్లి శ్రీనివాస్, కళ్యాణ్, మేడిరమేష్, గోపాల్‌రావు, అర్బన్ ప్రసాద్, శ్రీనివాస్, టియుడబ్ల్యుజె(టిజెఎఫ్)జిల్లా కార్యదర్శి చిర్రారావి, నాయకులు వెంకటరమణ, కోటేశ్వర్‌రావు, జగదీశ్, రజీనికాంత్, గుద్దేటి రమేశ్ బాబు, రాఘవ, చక్రి, జానిపాషా, నాగరాజు, టౌన్ రిపోర్టులు రాంబాబు, సాయి, గోపి, ఉమేశ్, రవి, మహిళ జర్నలిస్టులు మధులత, ఈశ్వరీ, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, వీడియో, ఫోటో జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | నవంబర్ 25, 2024 | www.navatelangana.com

ఆసక్తి గలవారు రేవు వేలం పాటలో పాల్గొనండి

- నేడు, రేవు వేలం పాట
- ఎంపీఓ వెంకటేశ్వరరావు



నవతెలంగాణ-పినపాక

టీ కొత్తగూడెం-ఏదిర గోదావరి పడవ రేవు వేలం వేలంపాట నేడు (సోమవారం) నిర్వహిస్తున్నట్లుగా ఎంపీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ... డీఎల్‌పీఓ సుధీర్ కుమార్ ఆదేశాల మేరకు టీ.కొత్తగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం పడవ రేవు వేలం నిర్వహిస్తున్నట్లుగా తెలియజేశారు. ఆసక్తి గలవారు ఈ పాటలో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాట రూ.50 వేలుగా నిర్ణయించినట్లుగా తెలిపారు. ఈ సమావేశంలో టీ.కొత్తగూడెం సెక్రటరీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యూనివర్సిటీ టీంకు బాక్సర్ హరిప్రియ ఎంపిక

నవతెలంగాణ-పాల్వంచ



ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాల్వంచలో బీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పొట్లపువ్వు హరిప్రియ యూనివర్సిటీ టీంకు ఎంపికయ్యారు. వరంగల్‌లోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలోని బాక్సింగ్ హాల్‌లో జరిగిన కాకతీయ విశ్వవిద్యాలయం ఇంటర్ కాలేజియేట్ బాక్సింగ్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో అద్భుత విజయం సాధించి బంగారు పతకమును సాధించి యూనివర్సిటీ బాక్సింగ్ టీమ్‌కు ఎన్నిక కావడంతో పాటు ఆల్ ఇండియా మహిళల బాక్సింగ్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.పద్మ, కళాశాల స్పోర్ట్స్ ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ పొట్లపువ్వు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం మాట్లాడుతూ ఆల్ ఇండియా బాక్సింగ్ టోర్నమెంట్‌లో కూడా విజయం సాధించి కళాశాలకు పేరు ప్రఖ్యాతులను తీసుకుని రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్టాఫ్ డాక్టర్ అనికా వెంకటేశ్వర్లు, డాక్టర్ టి.అరుణకుమారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.మాధవి, బి.రమేష్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వి.కామేశ్వరరావు, టి.విజయ ప్రసాద్, డాక్టర్ బి.కొండలరావు, పారెల్లి శ్రీనివాస్, కోటగిరి రాంబాబు, డాక్టర్ యస్ స్వరూప రాణి, డాక్టర్ ఎస్.శ్రీదేవి, సి.లీలా సౌమ్య, ఎస్.విమల పాల్గొన్నారు.

రేపు సీపీఐ(ఎం) మండల మహాసభ

- మండల కార్యదర్శి నిమ్మల వెంకన్న



నవతెలంగాణ-పినపాక

ఈ నెల 26న జరిగే సీపీఐ(ఎం) మండల 7వ మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి నిమ్మల వెంకన్న పిలుపునిచ్చారు. ఆదివారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాట రూపకల్పన చేసేందుకే ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల సమగ్ర అభివృద్ధి, మండలంలోని గిరిజన గ్రామాల అభివృద్ధికై తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. ఈ మహాసభలకు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా, మండల నాయకులు హాజరవుతారని తెలిపారు. కావునా మండలంలోని ప్రజలు శ్రేయోభిలాషులు కుంజ కృష్ణకుమారి భవన్ (జీవీఆర్ ఫంక్షన్ హాల్) లో అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మడివి రమేష్, దుబ్బ గోవర్ధన్, నట్టి శంకరయ్య, కల్తి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-ఇల్లందు



ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ మండల, పట్టణ అధ్యక్షులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ శీతాకాలం కావడంతో గత వారం రోజుల నుండి పట్టణంలో చలి తీవ్రత పెరగడంతో రోడ్లు సైడ్ జీవనం కొనసాగించే యాచకులు, పేదలు గన్ని బ్యాగులు ప్లాస్టిక్ కవర్లు కప్పుకొని చలికి వనకడం ఇలాంటి వారిని తరచుగా మనం చూస్తూనే ఉన్నామన్నారు. అలాంటి వాళ్ళ పడే బాధలు వర్ణనాతీతం. అందుకే వారి ఇబ్బందిని గుర్తించి ఆర్యవైశ్య సంఘం సభ్యులు అందరం కలిసి వాహనాలపై తిరుగుతూ చలి తీవ్రతకు ఇబ్బంది పడే వారిని గుర్తించి వారికి ఉచితంగా దుప్పట్లను పంపిణీ చేసామని తెలిపారు. ఈ కార్యక్రమానికి దాతలుగా తేలుకుంట్ల రజనీకాంత్, సంకా శ్యామ్, వాసవి క్లబ్ సభ్యులు పుల్లూరు సతీష్ కుమార్, యెలుగూరి మధుబాబు, సైఫా రాజశేఖర్ ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సుమారు వీటి విలువ పదివేల రూపాయలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేష్ కుమార్, కండె రమేష్, యువజన సంఘం అధ్యక్షులు నరేంద్రుల అను, గంధె సురేష్, తాటిపల్లి సుబ్బారావు, అర్వపల్లి గణేష్, రామిడి శంకర్, బోనగిరి రమేష్, గౌరిశెట్టి నగేష్, చందా నాని, జొన్నల ఉపేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్‌లో గెలుపుతో ప్రజల్లోకి నయా 'ఇందిరమ్మ'గా ప్రియాంక గాంధీ

- టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్ కనుబుద్ది దేవా



నవతెలంగాణ-దుమ్ముగూడెం

కేరళ రాష్ట్రంలో వయనాడ్ పార్లమెంటుకు జరిగిన ఉప ఎన్నికల్లో నాలుగు లక్షల పైచిలుకు మెజారిటీతో గెలిచిన జాతీయ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ నయా ఇందిరమ్మగా దేశ ప్రజలకు సేవలు అందించనుందని టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్ కనుబుద్ది దేవా అన్నారు. పార్లమెంటు సభ్యురాలిగా ఘన విజయం సాధించిన సందర్భంగా దేవా ఆధ్వర్యంలో ఆయన స్వగ్రామం కె లక్ష్మీపురం గ్రామంలో కాంగ్రెస్ అభిమానులు గ్రామ ప్రజలు సమక్షంలో కేక్ కట్ చేసి టపాసులు పేల్చి ఆదివారం సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సరియం వీర్రాజు, కనుబుద్ది శ్రీనివాసరావు, ఉబ్బ మల్లేష్, కొంపెల్లి మహేష్, దాసుపెల్లి ఉపేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో కలెక్టర్ దృష్టికి సమస్యలు తీసుకెళ్తా

- ఏఎస్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కామరాజు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను నేడు జరిగే గ్రీవెన్స్‌లో కలెక్టర్, ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకు వెళ్తానని ఏఎస్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు అన్నారు. ఆదివారం సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఈసాల సురేష్, రాష్ట్ర కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లుతో కలిసి మండలంలోని రేగుబల్లి, నడికుడి, నందుల చెలక మొదలగు గిరిజన గ్రామాలలో గ్రామాలలో విస్తృతంగా పర్యటించి దీర్ఘకాలికంగా గ్రామాలలో నెలకొన్న భూ వివాద సమస్యలు, స్థానికంగా ఉన్న ఇసుక సొసైటీ ర్యాంపుల సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. భూ వివాద సమస్యలను, ఇసుక సొసైటీ సమస్యలు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఆదివాసీ సంక్షేమ పరిషత్ మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మణుగూరు మండల అధ్యక్షులు సవలం హరి శంకర్, గొగ్గెల కోటి, కంగల ప్రవీణ్, కారం జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

పేలిన మావోయిస్టుల మందు పాత్ర

- డీఆర్‌జీ జవాన్‌కు తీవ్ర గాయాలు
- వివరాలు వెల్లడించిన సుకుమా ఎస్పీ



నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ సుకుమా జిల్లా రాయగూడ పోలీస్ స్టేషన్ పరిధి దండకారణ్యంలో మావోయిస్టులు పోలీసులే లక్ష్యంగా అమర్చిన మందు పాత్ర పేలి ఒక డీఆర్‌జీ జవాన్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్ చౌహాన్ తెలిపిన వివరాలు ప్రకారం... రోజు లాగానే ఆదివారం కూడా రోడ్డు ఓపెనింగ్ పోలీస్ పార్టీ దండకారణ్యంలో చర్బింగ్ చేస్తున్న క్రమంలో మావోయిస్టులు విచ్చలవిడిగా అమర్చిన మందు పాత్ర పెసరబాంబు తొక్కడంతో జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసు ఉన్నతాధికారులు జవాన్‌కు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రాజధాని రాయపూర్ పంపినట్టు ఎస్పీ వివరించారు.

డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాల డేటా ఎంట్రీలో ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ జితేజ్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సమగ్ర ఇంటింటి సర్వే డేటా ఎంట్రీ పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సీపీఓ సంజీవరావు, డీపీఓ చంద్రమౌళి, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎంసీలతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) వివరాలను అత్యంత జాగ్రత్తగా ఈనెల 29వ తారీకు లోపు ఆన్ లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దారులందరూ తప్పనిసరిగా రేపు సాయంత్రం లోపు ఇంకా పూర్తికాని గృహాల సర్వేను తప్పకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తి చేసిన సర్వే వివరాలను డేటా ఎంట్రీ చేసినందుకు గాను ఒక్కో డేటా ఎంట్రీకి ప్రభుత్వం రూ.7 చొప్పున చెల్లించాలని నిర్ణయించింది. డేటా ఎంట్రీ ప్రక్రియను ఈ 5 పని దినాలలో పూర్తి చేయు విధంగా ప్రణాళికలను సిద్ధం చేయాలని, రెండు షిఫ్టులో డేటా ఎంట్రీ ప్రక్రియ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, రెండవ షిఫ్ట్ 5 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. దానికి అవసరమైన కంప్యూటర్లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట కంప్యూటర్‌లను 5 రోజులకు అద్దెకు తెచ్చి అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. డేటా ఎంట్రీ కోసం తహసీల్దార్లు తమ మండలాల్లో లేదా పక్క మండలలోని కళాశాలలు, ప్రయివేట్ పాఠశాలల ల్యాబ్ లను ఉపయోగించుకోవచ్చు అన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎన్యుమరేటర్ కలిసి సర్వే వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. సర్వే పత్రాలను భద్రంగా భద్ర పరచాలన్నారు. సర్వే పత్రాల భద్రత విషయంలో సూపర్వైజర్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా సర్వేకు సంబంధించిన వివరాలను అత్యంత గోప్యంగా ఉంచాలన్నారు. కుటుంబాల వివరాలు అంశాలవారీగా ప్రత్యేక ఫార్మేట్లో నమోదు చేసేటప్పుడు ఎలాంటి తప్పులు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. అంశాల వారిగా ఒకటికి రెండుసార్లు సరిచూసుకొని ఆన్లైన్లో నమోదు చేయాల్సిన బాధ్యత ఆపరేటర్లపై ఉందన్నారు.

ఒక ఆపరేటర్‌కు నిర్దేశించిన కుటుంబాల సంఖ్య ఆధారంగా ఆన్లైన్లో వారి వివరాలను ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా నమోదు చేయాలన్నారు. వివరాలు ఆన్లైన్ నమోదు ప్రక్రియను సూపర్వైజర్లు ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. డేటా ఎంట్రీలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే పై అధికారులకు తెలియజేయాలన్నారు. డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

కాంగ్రెస్ ప్రభుత్వం గత ఒక సంవత్సరం పాలనలో చేపట్టిన ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో ప్రచారం చేయాలని డీసీఎంఎస్ చైర్మెన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ప్రజాపాలన విజయోత్సవ కళాయాత్ర ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రచారం చేపట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఆదివారం పాల్వంచ మండలం పరిధిలోని జగన్నాధపురంలో తెలంగాణా సాంస్కృతిక సారథి కళాకారుల వాహన ప్రచారాన్ని కొత్వాల ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు, రైతులకు, మహిళలకు అనేక సంక్షేమ పథకాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, నందా నాయక్, కాంగ్రెస్ నాయకులు కోండం పుల్లయ్య, చాడపల్లి వెంకటనారాయణ, బానోత్ బాలాజీ నాయక్, గంధం నర్సింహారావు, సాంస్కృతిక సారథి కళాకారుల టీం లీడర్ కాంపల్లి బాబు, అలవాల కృపానందం, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా సాంబశివరావు

- కార్యదర్శివర్గంలో కార్యదర్శితో పాటు మరో నలుగురికి చోటు
- 15 మందితో నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-మణుగూరు



మండల కార్యదర్శి
సత్రపల్లి సాంబశివరావు

సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా సత్రపల్లి సాంబశివరావును 9వ మండల మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. శనివారం దొడ్డి నెహ్రూ ఇంటి వద్ద కుంజా కృష్ణకుమారి ప్రాంగణంలో మండలం మహాసభ జరిగింది. ఈ మహాసభల్లో మాజీ ఎంపీ, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు డాక్టర్ మీడియం బాబురావు, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ పాల్గొన్నారు. మహాసభలో 15 మందితో నూతన కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. మండల నూతన కార్యదర్శిగా సత్రపల్లి సాంబశివరావు, కార్యదర్శి వర్గ సభ్యులుగా దామల్ల వెంకన్న, మడి నరసింహారావు, బొల్లం రాజు, పిట్టల నాగమణి, మండల కమిటీ సభ్యులుగా ఉప్పతల నరసింహారావు, మాచారపు లక్ష్మణరావు, పసునూరి సంజీవరెడ్డి, ఎస్.సుధాకర్, కుంజా రాజు, గుండు భీమయ్య, కొండ్రు గౌరీ, తోట పద్మ, ములకల ఉత్తం, నాగేశ్వరరావు ఉన్నారు.

తీర్మానాలకు ఆమోదం పలికిన 9వ మహాసభ

రాబోయే మూడు సంవత్సరాల కాలంలో మణుగూరు అభివృద్ధికి తీర్మానాలు చేసింది. మణుగూరు మున్సిపాలిటీ రద్దుచేసి పంచాయతీలుగా విభజించి ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టాలి. ఓసీ 4 సింగరేణి విస్తరణలో భాగంగా భూనిర్వాస్తులకు మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలి. తిర్లాపురం, రామనుజవరం ప్రజలు భయాందోళన గురవుతున్నారు. మూడవసారి నిర్వాసిత గ్రామంగా కొండాపురం గ్రామానికి కూడా మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలి. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ అందించాలని తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. మణుగూరు నుండి బీటీపీఎస్ వరకు రైల్వే నిర్మాణంలో భూమి కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలి. మణుగూరు నుండి బీటీపీఎస్ వరకు రైల్వే ట్రాక్ నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రమాదాలు జరగకుండా రోడ్డు విస్తరింప చేయాలి. అశాస్త్రీయంగా ఉన్న మిషన్ భగీరథ నీటిని ప్రతి ఇంటికి అందజేయాలి. సింగరేణి యాజమాన్యం వర్షాకాలంలో ఓబీ నీళ్ల మణుగూరులోకి రాకుండా నివారించాలి. ప్రపంచ వ్యాప్తంగా నిషేధించిన జీవకోటికి హానికరమైన కోనో కార్పస్ చెట్లను నివారించాలి. మహాసభలో ఆమోదం పలికిన తీర్మానాల అమలు కోసం పార్టీ నూతనంగా ఎన్నికైన మండల కమిటీ ఆధ్వర్యంలో దశలవారి పోరాటాలను నిర్వహించాలని మహాసభకు హాజరైన నాయకత్వం నూతన కమిటీ స్పష్టం చేసింది.

మండల కార్యదర్శి వర్గ సభ్యులు



దామల్ల వెంకన్న



మడి నరసింహారావు



బొల్లం రాజు



పిట్టల నాగమణి

9వ మహాసభలో 26 తీర్మానాలపై ఏకగ్రీవంగా ఆమోదం

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కారం పుల్లయ్య



నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండల కేంద్రమైన దుమ్ముగూడెం గ్రామంలో సీతారాం ఏచూరి నగర్, సవనం వీరస్వామి ప్రాంగణంలో శనివారం నిర్వహించిన సీపీఐ(ఎం) మండల 9వ మహాసభకు సహకరించిన ప్రతి ఒక్కరికీ 9వ మాసభలో నూతనంగా ఎన్నికైన మండల కమిటీ సభ్యులతో పాటు, రెండవసారి మండల కార్యదర్శిగా ఎన్నికైన కారం పుల్లయ్య ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం ములకపాడు గ్రామంలో గల యలమంచి సీతారామయ్య భవనంలో పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూతన కార్యదర్శిగా ఎన్నికైన కారం పుల్లయ్య మాట్లాడుతూ... 26మందితో నూతన కమిటీ, 9 మందితో మండల కార్యదర్శులకు ఎన్నిక ఏకగ్రీవం జరిగిందని అన్నారు. మహాసభలో 26 సమస్యల పైన తీర్మానాలు ఆమోదం తెలుపుకొని భవిష్యత్ రెండు సంవత్సరాల సరిపడే తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. ఒకటి ప్రగళ్ళపల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌కు నిధులు కేటాయించి సాగునీరు అందించాలి. మండలంలో మిగిలిపోయిన పోడు సాగుదారులకు అందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలి. త్రీఫేస్ కరెంటు సౌకర్యం కల్పించాలని, డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలు మాఫీ చేయాలి. ఉపాధి హామీ పథకం పని దినాలు 100 రోజుల నుండి 200 రోజులకు పెంచాలి. రోజు వారి కూలి రూ.600 ఇవ్వాలి, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి. కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలని, చదువుకున్న నిరుద్యోగులందరికీ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలనే పలు తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. మిషన్ భగీరథ పైప్ లైన్ ద్వారా అన్ని గ్రామాలకి తాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆర్భటంగా ఏర్పాటు చేసినప్పటికీ ధాన్యం కొనుగోలు చేయడం లేదని కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలనే తీర్మానాలను ఏకగ్రీవంగా చేశారు. ఇవే కాక అనేక తీర్మానాలు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు మర్మం చంద్రయ్య కొర్సా చిలకమ్మా, బొల్లి సత్యనారాయణ, కొడాలి లోకేష్ బాబు, వాగే ఖాదర్ బాబు, యలమంచి శ్రీనుబాబు, కొమరం చంటి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా నియోజకవర్గ స్థాయి యాదవ వనసమారాధన

- భారీగా తరలివచ్చిన యాదవులు

నవతెలంగాణ-దమ్మపేట

మండల కేంద్రంలో మండల అఖిలభారత యాదవ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. మల్లారం రోడ్‌లో ఈ యాదవ వనసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి యాదవ జిల్లా సంఘం అధ్యక్షుడు కౌడగాని పరమేష్, రాష్ట్ర గోకుల్ ట్రస్ట్ అధ్యక్షుడు నాగ సీతారాములు హాజరయ్యారు. యాదవ వనసమారాధనలో ముందుగా ఉసిరి చెట్టుకు పూజలు చేసిన అనంతరం గోపూజ నిర్వహించి, యాదవుల ఆరాధ్య దైవం శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ స్థాయిలో హాజరైన యాదవులంతా కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో యాదవులంతా ఐక్యమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, సుమారు 2వేల మందితో వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రుగొండ తహసీల్దార్ శ్రావణి, ఏలూరు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు చెవుల శ్రీనివాసరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు చిన్నం రామకృష్ణ, జిల్లా యాదవ సంఘం నాయకులు అల్లాడి పుల్లారావు యాదవ్, దొడ్డకుల రాజేశ్వరరావు యాదవ్, దొడ్డకుల గోపాలరావు యాదవ్, తుమ్మ రాంబాబు యాదవ్, జోనుబోయిన శ్రీనివాసరావు యాదవ్, ఎర్రగొర్ల రాధాకృష్ణ యాదవ్, మారుబోయిన హరిబాబు యాదవ్, అడ్వకేట్ భవాని కృష్ణ యాదవ్, రాచూరి వేణుగోపాలరావు, తాళ్ల శంకర్రావు, తాళ్ల వెంకటేశ్వరరావు, పాకిరం ధనుష్, ఓరుగంటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



భవిష్యత్తు ఉద్యమాలకు వేదికగా 9వ మహాసభలు

- పోడు పట్టాలు రాని గిరిజనులతో పోరాటాలు
- హాజరు కానున్న పోతినేని, కనకయ్య, ఏజే రమేష్‌లు
- మహాసభల ఏర్పాట్లను పర్యవేక్షించిన పుల్లయ్య

నవతెలంగాణ-అశ్వారావుపేట

అశ్వారావుపేట ప్రాంతంలో సీపీఐ(ఎం) భవిష్యత్తు ఉద్యమాలకు వేదికగా సోమవారం మండలంలోని గుంటిమడుగులో జరగబోయే అశ్వారావుపేట మండల మహాసభలు కార్యాచరణ కానున్నాయని పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య తెలిపారు. మహా సభలు నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లను ఆదివారం ఆయన మండల కన్వీనర్ చిరంజీవితో పాటు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్వాసితులను, నివాస స్థలాలు లేని నిరుపేదలను సమీకరించి వారి సంక్షేమం కోసం ఉద్యమాలు చేపడతామని అన్నారు. ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసినా పేదలకు అన్యాయమే జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. అందుకోసం ఈ మహాసభల్లో పేదలు పక్షాన పోరాటాలకు కార్యాచరణ రూపుదిద్దుకోనుందని వారు ప్రకటించారు. పోడు పట్టాలు రాని గిరిజనులను సమీకరించి పోడు పట్టాలు వచ్చే వరకూ పోరాటాలు చేస్తాం అని అని పేర్కొన్నారు. ఈ మహా సభలకు పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఏజే రమేష్, కొక్కెరపాటి పుల్లయ్యలు హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సోడెం ప్రసాద్, మడిపల్లి వెంకటేశ్వరరావు, వర్సా శ్రీ వేణు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి నవోదయ మోడల్ పరీక్షకు అనూహ్య స్పందన

- సద్వినియోగం చేసుకున్న వివిధ పాఠశాలల విద్యార్థులు

నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు మండలం సారపాక బ్రిలియంట్ నవోదయ కోచింగ్ ఆధ్వర్యంలో ఆదివారం భద్రాచలంలో నిర్వహించిన నవోదయ మోడల్ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. జిల్లాలోని మణుగూరు, చర్ల, పాల్వంచ, భద్రాచలం ప్రాంతాల నుండి వివిధ పాఠశాలల్లో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు దాదాపు 60 మందికి పైగా పరీక్షకు హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా నవోదయ కోచింగ్ చైర్మెన్ డాక్టర్ బీఎస్‌ఆర్ మాట్లాడుతూ... ఈ పరీక్షలో ఫస్ట్, సెకండ్ ర్యాంకులను సాధించిన వారికి కోచింగ్ ఉచితంగా ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో చదువుకునే విద్యార్థులకు పరీక్ష పై అవగాహన కల్పించి వారిలో ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ నవోదయ మోడల్ పరీక్షను నిర్వహించామన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆయన అన్నారు. అదేవిధంగా తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆయన కోరారు. ఈ మోడల్ పరీక్ష ఫలితాలను ఈ నెల 28న గురువారం తెలియజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నవోదయ కోచింగ్ చైర్మెన్ డాక్టర్ బీఎస్‌ఆర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

నవతెలంగాణ-పినపాక



మండల పరిధిలో గల బీటీపీఎస్ ప్రహరీ గోడకు ఆనుకొని గుర్తు తెలియని వ్యక్తులు నిల్వ చేసిన ఇసుకను తహసీల్దార్ అద్దంకి నరేష్ ఆదేశాల మేరకు మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ ఆదివారం ఉదయం సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కింగ్ చేసిన ఇసుకను ఎటువంటి అనుమతులు పొందకుండా రోడ్డు కాంట్రాక్ట్ పనులకు, ఇతర నిర్మాణాలకు వినియోగించిన చట్టపరమైన చర్యలు తప్పవని తెలియజేశారు. ఇసుక నిల్వ ఉంచిన వారు ఆధారాలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో సూచించాలన్నారు.

నేడు కొత్తగూడెంకు రాష్ట్ర మంత్రి తుమ్మల

- కూనంనేనితో కలిసి రూ.1.50కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రూ.4కోట్లతో నిర్మించిన గ్రంధాలయ భవనం ప్రారంభోత్సవం

నవతెలంగాణ-కొత్తగూడెం

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం జిల్లా కేంద్రంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి చుంచుపల్లి మండలం నందతాండ నుంచి హౌసింగ్ బోర్డు కాలనీ, రాందాస్ తండా, బంజారా కాలనీ మీదుగా వికలాంగుల కాలనీవరకు రూ.1.50కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం రూ.4కోట్లతో నిర్మించిన నూతన జిల్లా గ్రంథాలయాన్ని వారు ప్రారంభించనున్నారు. అనంతరం పలు ప్రైవేటీ కార్యక్రమాల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొననున్నారు.

ముమ్మరంగా వనభోజనాలు

- కులాలు వారీగా ఏర్పాట్లు
- ఎమ్మెల్యే జారేకు సన్మానాలు
- అభివృద్ధికి సహకరించండి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-అశ్వారావుపేట



కార్తీక మాసం సందర్భంగా నిర్వహించే వనభోజనాలు నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట ఆదివారం ముమ్మరంగా జరిగాయి. అయితే ఆర్యవైశ్య, కమ్మ, కాపు సామాజిక వర్గాలు కులాలు వారీగా ఒకే రోజు తల పెట్టడంతో అశ్వారావుపేట పట్టణం కోలాహలంగా మారింది. ఆర్యవైశ్యులు గుర్రాల చెరువులోని కమ్మోరి వ్యవసాయ క్షేత్రంలో, కమ్మోరు గంగారంలోని అదే సామాజిక వర్గం అల్లూరి కోటేశ్వరరావు వ్యవసాయ క్షేత్రంలో, మున్నూరు కాపులు అశ్వారావుపేట శివారు అదే సామాజిక వర్గం రైతు వ్యవసాయ క్షేత్రాల్లో ఏర్పాటు చేసారు. ఈ మూడు కుల భోజనాలకు ఆయా కులాల్లోని కాంగ్రెస్ నాయకులు సూచన మేరకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సామాజిక వర్గానికి అయినా ఐక్యత అవసరం అని ప్రతీ విషయంలోనూ కలిసికట్టుగా ఉండటం ముఖ్యం అని అన్నారు. రాజకీయాలు, పార్టీలు, కులాలకు అతీతంగా నియోజక వర్గం కేంద్రం అభివృద్ధి చేయడానికి తాను కృషి చేస్తానని ప్రతీ కులం ఆ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు, పార్టీల నాయకులు, వ్యాపారులు, విలేకర్లు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

నవతెలంగాణ-కొత్తగూడెం

డిసెంబర్ 7, 8 తేదీల్లో భూపాలపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు ఉమ్మడి జిల్లాల ఆక్వాటిక్ అండ్ స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ హనుమంత రాజు ఆదివారం తెలిపారు. భూపాలపల్లిలోని సింగరేణి స్విమ్మింగ్ పూల్‌లో జరగనున్న ఈ పోటీలకు కొత్తగూడెం సీఈఆర్ క్లబ్ స్విమ్మింగ్ పూల్‌లో ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల నుండి వివిధ విభాగాల్లో క్రీడాకారులు ఎంపికయ్యారని వివరాలు వెల్లడించారు. గ్రూప్-1 నుండి కె.పవన్, బి.రామ్ సందేశ్, కె.సాయి శ్రీవాత్సవ్, గ్రూప్-2 నుండి ఎస్.చత్రపతి నాథ్, కె.కేశవ, ఐ.భగవత్, డి.ఆశిష్ విస్లాన్, గ్రూప్-3 నుండి సీహెచ్. మోక్ష చంద్రశేఖర రావు, జీ.మాన్విక్, ఆర్.జస్వంత్ సాయి సాత్విక్, గ్రూప్-4 హసన్ చౌదరి కెవిన్ విల్సన్, శ్రీకాంత్, బాలికల నుండి గ్రూప్-3 ఎస్.గాయత్రి, సీహెచ్. రక్షిత, గ్రూప్-5 అమన ప్రియ, ఏకస్వేలు ఎంపికైనట్లు హనుమంత రాజు తెలిపారు. రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, పోస్నెట్, నరహరి, కోచ్‌లు శామ్యూల్, రాంబాబు సంధ్య, సామంత్‌లు అభినందించారు.

గుండెపోటుతో సెర్ప్ ఉద్యోగి మృతి

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



గుండెపోటుతో కాంట్రాక్టు సెర్ప్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన ఆదివారం ఆళ్ళపల్లి మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని మర్కోడు గ్రామానికి చెందిన తాళ్లపల్లి వెంకటనారాయణ (58) శనివారం అర్ధరాత్రి దాటాక హఠాత్తుగా చాతిలో నొప్పి రావడంతో కుప్పకూలారని, గమనించిన భార్య కుటుంబ సభ్యులను పిలిచే లోపే మృతి చెందాడని తెలిపారు. మండలంలో ఐకేపీ బుక్ కీపర్‌గా సుపరిచితుడు, మంచి మనసు గల వెంకటనారాయణ అకాల మరణంతో కుటుంబ సభ్యులు విలపించిన తీరు చూపరులకు సైతం కంటతడి పెట్టించింది. విషయం తెలుసుకున్న స్థానిక మాజీ జడ్పీటీసీ కొమరం హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాయం రామనర్సయ్య, మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాయం నరసింహారావు, న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు కొమరం సత్యనారాయణ, ప్రజాపంథా మాస్ లైన్ జిల్లా నాయకులు మాచర్ల సత్యం, సీపీఐ జిల్లా నాయకులు రేసు ఎల్లయ్య, వెలుగు సిబ్బందితో పాటు పలువురు మృతుడి ఇంటికి చేరుకుని, మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.

టీవీపీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఆదర్శ వివాహం

నవతెలంగాణ-కొత్తగూడెం

హంగుఆర్భాటాలు కాదు, ప్రేమ ఆప్యాయతలతో కూడుకున్నదని నిజమైన వివాహమని, మనసులు తెలుసుకుని పెద్దలు పెళ్లిళ్ల నిర్వహిస్తే ఆ జంటలు జీవితాంతం సుఖంగా ఉంటాయని టీవీపీఎస్ అధ్యక్షులు సతీష్ గుండపనేని అన్నారు. తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వికలాంగురాలైన శారదను సకలాంగుడైన సీతారాములు వివాహం చేసుకోవడానికి ముందుకు వచ్చినందున వారి వివాహమును తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం (టివిపిఎస్) ఆధ్వర్యంలో జరిపించారు. స్థానిక రైటర్ బస్తీ పెద్దమ్మ తల్లి ఆలయంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక. అధ్యక్షులు సతీష్ మాట్లాడారు. 2014 నుంచి ఇప్పటివరకు 10 సంవత్సరాల్లో సుమారు 15 వివాహకులు జరిపించామన్నారు. ఈ వివాహ జంటను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ పార్టీ రాష్ట్ర నాయకులు ఎస్‌కె.సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాం, లయన్స్ క్లబ్ అధ్యక్షులు దస్తగిరి, మాజీ ఉపసర్పంచ్ లగడపాటి రమేష్, లయన్ జయరాం టీవీపీఎస్ ఉపాధ్యక్షులు ఖాదర్ బాబా, దివ్యాంగ ఉద్యోగ సంఘ జిల్లా అధ్యక్షులు జగ్గు దాసు, సంఘ లీగల్ అడ్వైజర్ అరికాల రవికుమార్, ప్రధాన కార్యదర్శి మేడి ప్రవీణ్ కుమార్, రాము, కళా బాబు రెడ్డి, సాయిబాబా, నయీమ్, కాటి నాగేశ్వరరావు, రమణయ్య తదితరులు పాల్గొని వారిని ఆశీర్వదించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం

- పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ వార్షికోత్సవంలో జీఎం

నవతెలంగాణ-ఇల్లందు

క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందని, సింగరేణి సంస్థలో క్రీడలకు, క్రీడాకారులకు యాజమాన్యం అధిక ప్రాధాన్యమిస్తుందని ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ అన్నారు. 2024-25 వార్షిక సంవత్సరంలో నిర్వహించినటువంటి వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా 24 ఏరియాలోని వైసీఓఏ క్లబ్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తదుపరి జీఎం మాట్లాడుతూ 24 ఏరియాలోని రన్స్ అండ్ గోల్స్ స్టేడియం నందు క్రీడాకారులకు అన్ని ఆటల పోటీలు నిర్వహించడం జరిగిందని, ప్రస్తుతం ఉన్నటువంటి కాలానికి అనుగుణంగా ప్రతి ఉద్యోగి తనకు వెసులుబాటు ఉన్న సమయంలో కచ్చితంగా రోజుకు 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలన్నారు. అదేవిధంగా సంక్షేమంలో భాగంగా స్థానిక 24 ఏరియా, జెకె కాలనీ గ్రౌండ్ నందు వాకింగ్ ట్రాక్‌లను, సెంట్రల్ లైటింగ్, ఓపెన్ జిమ్‌లు, పార్కులు ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని, ఇటు ఉత్పత్తిలోనే ఉద్యోగుల సంక్షేమంలో కూడా సింగరేణి సంస్థ ఎప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. కార్మికుల సంక్షేమంలో కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. సింగరేణి సంస్థ మహిళా ఉద్యోగులకు కూడా క్రీడలలో అధిక ప్రాధాన్యత ఇస్తుందని వారు విధులలోనే కాకుండా క్రీడలలో ప్రతిభ చాటారని వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. తదుపరి వివిధ క్రీడల్లో గెలుపొందిన ఉద్యోగులకు అభినందనలు తెలిపి, బహుమతులు ప్రధానం చేశారు. ఏరియా క్రీడాకారులు జీఎంను ఘనంగా సన్మానించారు. యస్వోటు జియం వెంకటేశ్వర్లు, అధికారుల సంఘం అధ్యక్షులు శివ ప్రసాద్, డిజియం (పర్సనల్) జీవి మోహన్ రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కే.సాయి స్వరూప్, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ నజీర్ అహ్మద్, ప్రాతినిధ్యసంఘం ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మంచి నాయకున్ని కోల్పోయింది

- పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

నవతెలంగాణ-పినపాక



కాంగ్రెస్ పార్టీ ఒక మంచి నాయకుడిని రోడ్డు ప్రమాదం రూపంలో కోల్పోయిందని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం పినపాక మండలంలో ఆమె పర్యటించారు. ఇటీవల రహదారి ప్రమాదంలో మరణించిన శ్రీనివాసరెడ్డి కుటుంబాన్ని మంత్రి సీతక్క పరామర్శించారు. వారి స్వగ్రామంకు వెళ్లి ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. శ్రీనివాస రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, అన్ని విధాలుగా అండగా వుంటామని భరోసా నిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-కరకగూడెం



ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ శ్రేణులు నిరంతరం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ మూడో మహాసభ కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్, కుంజ కృష్ణకుమారి ప్రాంగణంలో ఉకె.నరసింహరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మచ్చ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అధిక ధరలు నిరుద్యోగం ఆకలి దారిద్రంలో భారతదేశ నూట ఐదవ స్థానంలో ఉందని ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడానికి జమిలి ఎన్నికలు ప్రజల మధ్య చీలిక తేవడానికి మతం పేరుతో రాజ్యమేలుతున్నారని అన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాలన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైఫల్యం చెందిందన్నారు. జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న మాట్లాడుతూ మండలంలో పోడు భూముల పోరాటం ద్వారా రైతులుగా మార్చిన ఘనత సీపీఐ(ఎం) పార్టీ కే ఉందన్నారు. పట్టాలు సాధించడంతోపాటు తునికి ఆకు బోనస్సు, మంచినీరు, రోడ్లు ఇతర వలస ఆదివాసి గ్రామాల సమస్యలపై నిక్కచ్చిగా పోరాడిన పార్టీ సీపీఐ(ఎం) అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గద్దల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి కొమరం కాంతారావు, సర్ప సత్యం, బిలపాటి శంకరయ్య, కనితి రాము, కోవాసి వెంకటేశ్వర్లు, అడమయ్య, పద్దం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



విద్యార్థులు చిన్నప్పటి నుంచే మంచి ఆలోచనలతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, తద్వారా తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చేందుకు ప్రత్యేక కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఆదివారం పాల్వంచలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేసి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వసతి గృహ ఉపాధ్యాయులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. విద్యార్థులకు వేడి నీరును అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వసతి గృహంలో బాలికలకు అందిస్తున్న సౌకర్యాలపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారిని దాసరి అనసూయ, ఏఎస్సీడబ్ల్యూ ఓ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి

- సీఎంకి ఎమ్మెల్యే కూనంనేని వినతి

నవతెలంగాణ-కొత్తగూడెం



జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలతోపాటు ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఫోర్త్ ఎస్టేటుగా, ప్రభుత్వానికి, ప్రజలకు వారిదిగా పనిచేస్తూ చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న జర్నలిస్టులకు నిలువనీడలేని పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. జర్నలిస్టులకు గూడు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సాధ్యమైనంత త్వరలో ఇండ్ల స్థలాలు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరానని, తన విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలో చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే ప్రకటనలో తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య మృతి

- సర్పంచ్‌గా ప్రస్థానం, మూడుసార్లు ఎమ్మెల్యేగా ప్రజాసేవ
- నివాళులర్పించిన రాజకీయ పార్టీల నేతలు

నవతెలంగాణ-ఇల్లందు



ఇల్లందు మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య (70) అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకిద్దరు భార్యలు నలుగురు సంతానం ఉన్నారు. ఇల్లందు మండలంలోని హనుమంతులపాడు స్వగ్రామం. సీపీఐ పార్టీలో చేరి తొలుత హనుమంతులపాడు గ్రామపంచాయతీ సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. నాటి బూర్గంపాడు నియోజకవర్గం నుండి 1983లో సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో ఇల్లందు నియోజకవర్గంలో సీపీఐ నుండి మిత్రపక్షాల అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. తెలుగుదేశం పార్టీలలో చేరి టీడీపీ ఇల్లందు అభ్యర్థిగా 2009లో పోటీ చేసి మూడో పర్యాయం ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2014లో తెరాస టికెట్ పై...2019లో ఇండిపెండెంట్‌గా పోటీ పోటీ చేసి ఓడిపోయారు.

నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, పార్టీల నేతలు

మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య మృతికి మాజీ ఎంపీపీ చీమల నాగరత్న జానీ, సుదిమళ్ళ మాజీ సర్పంచ్ పద్మ, తెలుగుదేశం పార్టీ నాయకులు ముద్రగడ వంశీ, పాలమాలు బాలకృష్ణ, కారు నర్సన్న, చాందావత్ రమేష్ బాబు, శ్యామ్ తీవారి, కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు, అభిమానులు అనేకమంది పట్టణ ప్రముఖులు సందర్శించారు. పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు వారు తెలిపారు.

పెండింగ్‌లో ఉన్న కోడి గుడ్ల బిల్లులు ఇవ్వాలి

- తెలంగాణ మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ)

నవతెలంగాణ-కొత్తగూడెం



7 నెలలుగా పెండింగ్‌లో ఉన్న కోడి గుడ్ల బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, మార్కెట్‌లో గుడ్డు ఖరీదు రూ.7లు ఉంటే, ప్రభుత్వం ఇస్తున్నది రూ.5లు మాత్రమే నని, అదనంగా రూ.2లు కార్మికుల మీద ఆర్థిక భారం పడుతుందని, గత ఏడు నెలలుగా బిల్లులు లేక, వారానికి మూడు గుడ్లు పెట్టేది ఎట్లా....? అని అంగన్వాడి కేంద్రాలకు వేస్తున్న మా దిరిగా స్కూల్లకు కోడిగుడ్లు ప్రభుత్వం సప్లై చేయాలని తెలంగాణ మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు జి.పద్మ, కార్యదర్శి సిహెచ్.సుల్తానా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా పిల్లలకు వంట చేసి పెడుతున్న మేము, మేము పెట్టిన వంట తిన్న పిల్లలు డిగ్రీలు, పీజీ చేశారని తెలిపారు. ఇప్పుడు మీరు పెట్టకపోతే మానేయండి అని చెప్పడం సరైనది కాదన్నారు. అధికారుల ఇలాంటి బెదిరింపులు ఆపాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజన కార్మికులకు ప్రభుత్వం ఇస్తా నన్న రూ.10వేలు ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమ సౌకర్యం కల్పించాలని, కాటన్ బట్టలు యూనిఫామ్‌గ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం ఈ నెల 28, 29 తేదీల్లో ఎంఈఓ ఆఫీసుల ముందు జరిగే ధర్నా కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా కోశాధికారి రామలక్ష్మి, జిల్లా కమిటి సభ్యులు వెంకట నరసమ్మ, రాణి, కుమారి, స్వరూప, క్రాంతి, నాగ దుర్గ, శైలజ, నిరోషా, నాగుల దేవి, మంగ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌లు, సిబ్బంది ఆరోగ్యాల పట్ల జాగ్రత్త వహించాలి

- మెగా వైద్య శిబిరంలో డీఎస్పీ

నవతెలంగాణ-ఇల్లందు



సబ్ డివిజన్లో పనిచేసే పోలీసు అధికారులు, సిబ్బంది ఆరోగ్యాల పట్ల జాగ్రత్త వహించాలని డీఎస్పీ చంద్రభాను కోరారు. ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని అయిత ఫంక్షన్ హాలులో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసీజీ, గైనకాలజీ, బీపీ, షుగర్, దంత సమస్యలు, కళ్ళ పరీక్షలు, ఆర్థోపెడిక్, యురాలజీ, ఫిజియోతెరపి, గుండె సంభంధిత పరీక్షలు, రక్త పరీక్షలు చేసే విధంగా నిపుణులైన వైద్యులు చేత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో భర్తీ అయినప్పుడు కఠినమైన శిక్షణతో, పూర్తి శారీరక సామర్థ్యంతో, ఆరోగ్యంగా శిక్షణా కేంద్రాల నుండి ప్రజలకు సేవలు అందించడానికి బయటకు రావడం జరుగుతుందన్నారు. ఆ తర్వాత విధులలో చేరినప్పటి నుండి నిత్యం శాంతి భద్రతల పరిరక్షణతో పాటు, ప్రజలకు సేవలందిస్తూ పోలీసులు విశ్రాంతి లేని జీవితాన్ని గడపాల్సి వస్తుందన్నారు. చాలా సందర్భాల్లో నిద్రాహారాలు మాని విధులు నిర్వర్తించాల్సి వస్తుందని, అందుమూలంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. పోలీసులు అప్పుడప్పుడు కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితి సరిగా లేనప్పుడు కూడా తప్పనిసరిగా విధులు నిర్వర్తించాల్సి వస్తుందని అన్నారు. అదేవిధంగా నిత్యం ప్రజలకు వైద్య సేవలందిస్తూ, తాము అడగగానే పోలీస్ కుటుంబాలకు కూడా వైద్య చికిత్సలు చేయడానికి విచ్చేసిన వైద్య బృందానికి కూడా ఎస్పీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులందరినీ శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. సీఐ సత్యనారాయణ, సీఐ టేకులపల్లి సురేష్, గుండాల సీఐ రవీందర్, ఎస్సైలు రతీష్, రాజమౌళి, శ్రీకాంత్, నాగుల్ మీరా, సూర్య, పట్టణంలోని ప్రముఖ వైద్యులయిన హర్షవర్ధన్, రవి తేజస్వి, సాయి చరిష్మ, రామ్ నివాస్, అశోక్ కుమార్‌లు పాల్గొన్నారు.

ప్రచారోద్యమ గోడపత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-కొత్తగూడెం

జనవిజ్ఞాన వేదిక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ అధ్వర్యంలో డార్విన్ పరిణామ సిద్ధాంత ప్రచారోద్యమ గోడపత్రిక ఆవిష్కరించారు. స్థానిక జెవివి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షులు ఆర్.వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఆహ్వానితులు అడపాల కస్తూరి జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు కె.నాగేశ్వరరావు ప్రధాన కార్యదర్శి మోహనరావు పాల్గొన్నారు. మానవుని రూపం, వివిధ దశలవారీ రూపాంతరం చెంది నేటి పరిస్థితి ఏర్పడిందని ఈ భూమండలంలోని సకల జీవరాశులు వివిధ దశలలో రూపాంతరాలు చెంది ఈ దశకు వచ్చాయని డార్విన్ సిద్ధాంతం తెలియజేసిందని అన్నారు. ఏదో అతీత శక్తి మానవుల ప్రస్తుత రూపంతో జన్మించేలా చేసిదనేది అవాస్తవమన్నారు. ఇంకా ఈ సమావేశంలో మండల బాధ్యులు పాల్గొని సందేశాలిచ్చారు.

ఆదివాసీ ప్రజల సంక్షేమమే పోలీసుల ప్రధాన లక్ష్యం

- ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎస్పీ

నవతెలంగాణ-అశ్వాపురం



మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన వేములూరు, మనుబోతులగూడెం, మల్లయ్య గుంపు, అయితయ్య గుంపు, సంతోష్ గుంపు, నాగేశ్వరరావు గుంపు, గుండ్ల మడుగు వలస గొత్తికొయ గ్రామాలలో నివసించే ఆదివాసీ ప్రజలకు వేములూరు గ్రామంలో ఆదివారం అశ్వాపురం పోలీసుల ఆధ్వర్యంలో రోటరీ క్లబ్, భద్రాచలం వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎస్పీ రోహిత్ రాజు ప్రారంభించారు. ఈ శిబిరంలో ఏడు గుత్తికోయ గ్రామాల నుంచి సుమారు 400 కుటుంబాలకు వైద్య పరీక్షలు హించారు. నిపుణులైన వైద్యులచే వైద్య చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం అక్కడ ఉన్న యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజల సంక్షేమం కోసం జిల్లా పోలీసు శాఖ తరపున ఎల్లప్పుడూ కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు గ్రామాలలోని ఆదివాసీ ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా దోమలు అధికమై మలేరియా, డెంగ్యూ లాంటి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమ చుట్టుప్రక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిషేధిత సీపీఐ మావోయిస్టులు తమ మనుగడ కోసం ఆదివాసీ ప్రాంతాలు అభివృద్ధి చెందకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఈ మెడికల్ క్యాంపు ఏర్పాటుకు సహకరించిన రోటరీ క్లబ్ వారికి, వైద్య బృందానికి, అశ్వాపురం పోలీస్ అధికారులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించిన వైద్యులను సన్మానించారు. అనంతరం మనుబోతులగూడెం, మల్లయ్య గుంపు, గుత్తి కోయ గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఎస్బీ ఇన్స్పెక్టర్ నాగరాజు, అశ్వాపురం సీఐ అశోక్ రెడ్డి, ఎస్సైలు తిరుపతి రావు, రవుఫ్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్, బాలాజీ పాల్గొన్నారు.





కుల మతాలకు అతీతంగా వన సమారాధన నిర్వహించడం అభినందనీయం

- మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

కుల, మతాలకు అతీతంగా ఒక కాలనీలో నివసించే వారందరూ ఒక కుటుంబ సభ్యులు కలిసి వనభోజనాలు చేయటం అభినందనీయం ఆదర్శం అని తెలంగాణ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ వీరయ్య అన్నారు. ఆదివారం వెంకటేశ్వర కాలనీ మొదటి లైన్‌లోని స్థానిక ప్రజలు ఐక్యంగా ఎట్టపాక మేడువాయి వెంకన్న తోటలో నిర్వహించిన వన సమారాధన కార్యక్రమానికి పొదెం వీరయ్య ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ప్రముఖ సంఘ సేవకులు గాదే మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... కార్తీకమాసంలో నిర్వహించి వనభోజనాలు కుల భోజనాలు కాకూడదని అన్నారు. పెద్దలు, పిల్లలు అందరూ కలిసిమెలిసి ఆటపాటలతో ఒకే కుటుంబ సభ్యులాగా ఇటువంటి కార్యక్రమంలో నిర్వహించడం ద్వారా మనుషుల మధ్య ఐక్యత అనుబంధాలు పెరుగుతాయని స్పష్టం. ఇటువంటి కార్యక్రమాల ద్వారా అందరూ ఒక చోటికి చేరి కాలనీలో ఉన్న సమస్యలను కూడా పరిష్కరించుకుండేందుకు ప్రణాళిక రూపొందించుకోవచ్చని అన్నారు. కాలనీ వాసుల మధ్య నెలకొన్న ఈ ఐక్యత అనురాగాలు భవిష్యత్తులో కూడా కొనసాగాలని తద్వారా కాలనీ ఊరు కూడా అభివృద్ధి అవుతుందని ఈ సందర్భంగా పోదాం వీరయ్య స్పష్టం చేశారు. అనంతరం చిన్నారులు డాన్సు వేసి పాటలు పాడుతూ ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో గొల్ల భూపతి రావు, కామేశ్వరరావు, శ్రీధర్, మాధవ్ సురేందర్‌తో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుర్తించిన ప్రతీ సమస్య పరిష్కారానికి కృషి

- 'హలో శుభోదయం'లో ఎమ్మెల్యే జారే

నవతెలంగాణ-అశ్వారావుపేట



గుర్తించిన ప్రతీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని పేరాయిగూడెం పంచాయతీలో ఆయన ఆదివారం స్థానిక సమస్యలు గుర్తింపు కోసం హలో శుభోదయం నిర్వహించారు. ఉదయం 7 గంటలు నుంచే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు కావాలని స్థానికులు అడగటంతో త్వరలోనే సమస్యలు పరిష్కరించి మౌలిక వసతుల విషయంలో తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీలకు కట్టుబడి ఉన్నామని, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు పారదర్శకంగా అందిస్తామని, నియోజకవర్గంలో ప్రజలకు ఏ సమస్యలు ఉన్నా నేరుగా తనని కలవ వచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్, పీఆర్ డీఈ శ్రీధర్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీఈవో సోయం ప్రసాద్, కార్యదర్శి కోటమర్తి శ్రీరామ మూర్తి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మ రాంబాబు, జూపల్లి రమేష్, జూపల్లి ప్రమోద్, మండల పరిషత్ కో-ఆప్షన్ మాజీ సభ్యులు ఎస్.కే పాషా, మాజీ ఎంపీటీసీ సభ్యులు మిండ హరిక్రిష్ణలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
9
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం నవంబర్25, 2024 www.navatelangana.com

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామంలో ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి(శివాలయం) వారి ఆలయంలో ఆదివారం దైవిజ్ఞులు, ఆలయ అర్చకులు కాశవఝల నరసింహమూర్తి ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి మాట్లాడుతూ కార్తీకమాసంలో సత్యనారాయణస్వామి వ్రతం చేసుకుంటే అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో, సిరి సంపదలతో వెలిగొందుతారని అన్నారు. అనంతరం వచ్చిన భక్తుల కు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శివాలయం ఉత్సవ కమిటీ చైర్మన్ యన్నం పిచ్చిరెడ్డి, పెద్దమళ్ళ మోహన్రావు, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కోన సత్యనారాయణగుప్తా, లక్ష్మికుమార్‌రెడ్డి, తల్లపరెడ్డి రామిరెడ్డి, కోన మల్లికార్జునరావు, రాంబాబు, బండి వెంకటేశ్వరరావు, భాష, శీలం దుర్గారెడ్డి, రోసిరెడ్డి, నాగరాజు భక్తులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు రాంబాబుకు సన్మానం

నవతెలంగాణ-మధిర

మధిరలో మున్నూరు కాపు వనసమారాధన ఆత్కూరు తోటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వన సమారాధన కార్యక్రమానికి హాజరైన ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ విప్, జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఆర్‌జెసి కృష్ణల చేతుల మీదుగా జడ్పీహెచ్ఎస్ ఇల్లూరు పాఠశాల గణిత ఉపాధ్యాయుడు ఆవల రాంబాబుకు ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు వచ్చిన సందర్భంగా సన్మానించారు.

మున్నూరు కాపు వన సమారాధన

నవతెలంగాణ-ఎర్రుపాలెం



మున్నూరు కాపు వన సమారాధన మహెూత్సవ కార్య క్రమానికి మున్నూరు కాపు కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్య క్రమాలను సంతోషంగా నిర్వహించుకున్నారు. తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయ సమీపంలో మామిడి తోటలో ఆదివారం వనభోజన మహెూత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా మామిడి తోటలో జరిగిన కార్యక్రమంలో తొలుత ఉసిరిచెట్టు దగ్గర వనదేవతకు మహిళలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, పొంగళ్ళు చేసి కార్తీక దీపాలను వెలిగించారు. మున్నూరు కాపు కుటుంబాలన్నీ సపరివార కుటుంబ సమేతంగా ఉదయం నుండి సాయంత్రం వరకు వనభోజన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులు గేమ్, డాన్సులు లాంటి వివిధ రకాలైన వినోద కార్యక్రమాలు కుటుంబ సభ్యులు బంధుమిత్రుల మధ్య సంతోషంగా గడిపారు. ఇక నుండి మున్నూరు కాపులు నిర్వహించే ప్రతి కార్యక్రమానికి ఇదే విధంగా సంఘ సభ్యులు తమ సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ముదిగొండ



ముదిగొండ పారిశ్రామిక ప్రాంతం రహదారితో పాటు, న్యూలక్ష్మీపురం, సువర్ణాపురం రహదారులు అధ్వానంగా తయారయ్యాయని, రోడ్లు పూర్తి స్థాయిలో దెబ్బతిని భారీ గుంతలు పడ్డాయని మరమ్మతులు నిర్వహించి బిటి వేయాలని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం, కోదాడ ప్రధాన రహదారి ముదిగొండ నుండి వెంకటగిరి క్రాస్ రోడ్డు వరకు, ముదిగొండ, వల్లభి మార్గమధ్యలో సువర్ణాపురం వరకు దుమ్ము ధూళితో వాహనదారులు, ప్రజలు సహజీవనం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముదిగొండ ప్రధాన రహదారులన్నీ మురికిమయంగా మారాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముదిగొండ నుండి న్యూలక్ష్మీపురం, సువర్ణాపురం రహదారిని కాంట్రాక్టర్ అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం చేయడం వల్ల కంకర దుబ్బ, దూళితో ప్రజలు నరకయాతనతో రాకపోకలు కొనసాగిస్తున్నారని, ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డును బిటి రహదారిగా మార్చి ప్రజలు, వాహనదారుల కష్టాలను తీర్చాలని బట్టు పురుషోత్తం కోరారు.



ప్రజా పోరాటాల ప్రణాళిక రూపొందిద్దాం

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు

నవతెలంగాణ- పెనుబల్లి

ప్రజా పోరాటాల ప్రణాళిక రూపొందిద్దామని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు అన్నారు. పార్టీ మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు అధ్యక్షతన ఆదివారం పలు గ్రామాలలో పార్టీ జెండాలను ఆవిష్కరించి గ్రామంలో బైక్ ర్యాలీ, ప్రచారం నిర్వహించారు. రానున్న మూడు సంవత్సరాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ప్రజా పోరాటాల ప్రణాళికను రూపొందించాలన్నారు. 26న పెనుబల్లి మండలంలో సప్తపది ఫంక్షన్ హాల్‌లో 13వ డివిజన్ మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. మహాసభలో మండల వ్యాప్తంగా ఉన్న ఎన్నో ప్రజా సమస్యల వెలికి తీసి వాటిపై తీర్మానాలు చేసి పోరాటాలు ప్రణాళికను రూపొందించి ప్రజాసంక్షేమానికి పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సభలో పార్టీ సీనియర్ నాయకులు తాండ్ర రాజేశ్వరరావు, పార్టీ మండల కమిటీ సభ్యులు కండే సత్యం, తడికమళ్ళ చిరంజీవి, చెమట విశ్వనాథం, గుడిమెట్ల బాబు, నల్లమల అరుణ, ప్రతాప్, చలమాల నరసింహారావు, ఐద్వా మండల కార్యదర్శి మిట్టపల్లి నాగమణి, సభ్యులు పోతిని బూచాలు, మరకాల వెంకటేశ్వరరావు, ఏసు రావు, అంజనేయులు, తడికమల్ల ప్రసాదు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంక గాంధీ విజయం పట్ల మంత్రి తుమ్మల హర్షం

నవతెలంగాణ-ఖమ్మం

కేరళలో వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో ప్రియాంక గాంధీ ఘనవిజయం సాధించడం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. వయనాడ్ ప్రజల తీర్పు అమోఘం అన్నారు. మొదటి సారి ప్రత్యక్ష రాజకీయాల్లో ఆరెగంట్రం చేసిన ప్రియాంక గాంధీ అత్యధిక మెజరిటీతో ఘన విజయం సాధించడం పట్ల అక్కడి ప్రజలు గాంధీ కుటుంబం పట్ల, నెహ్రూ వారసత్వం పట్ల ఎంత విధేయత చూపుతున్నారో మరో మారు నిరూపితం అయిందన్నారు. వయనాడ్లో రాహుల్ గాంధీ రికార్డును ప్రియాంక గాంధీ బ్రేక్ చేసి ప్రజల అభిమానాన్ని చూరగోన్నారు. విద్యా వంతులైన కేరళ ప్రజలు కాంగ్రెస్‌కు అండగా ఉండటం వారిపట్ల గౌరవాన్ని, నమ్మకాన్ని సూచిస్తుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు గాంధీ కుటుంబంతోనే సాధ్యం అని కేరళ ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. ప్రియాంకా గాంధీకి అత్యధిక మెజారిటీ ఇచ్చి గెలిపించిన వయనాడ్ ప్రజలకు తెలంగాణ ప్రజల తరపున మంత్రి తుమ్మల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వల్లభిలో పద్మశాలీలు వనసమారాధన

- ఆటపాటలతో సందడి చేసిన జబర్దస్త్, ఢీ సెలబ్రేటి పవన్

నవతెలంగాణ-ముదిగొండ



మండలపరిధిలో వల్లభి గ్రామంలో కార్తీకమాసం సందర్భంగా పద్మశాలీలు గ్రామ సమీపాన ఉన్న మామిడి తోటలో వనసమారాధన మహెూత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం నాయకులు ఏనుగుల వెంకటేశ్వర్లు కృషితో కుటుంబసమేతంగా, పిల్లాపాపలతో, బంధుమిత్రులతో వనసమరాధన కార్యక్రమంలో పాల్గొని ఆట పాటలతో సంతోషంగా గడిపారు. వనసమరాధనకు ముఖ్యఅతిథిగా హాజరైన జబర్దస్త్, ఢీ సెలబ్రిటీ పవన్ నృత్యం, ఆటపాటలతో ఉత్సాహపరిచి అలరించారు. అనంతరం మహిళలు చిన్నారులు, కుటుంబ సమేతంగా జబర్దస్త్ పవన్‌తో సంబరంగా సెల్ఫీలు తీసుకున్నారు. వనసమరాధనలో భాగంగా చిన్నారులకు ఆటలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మహెూత్సవానికి కృషి చేసిన ఏనుగుల వెంకటేశ్వర్లు దంపతులను పద్మశాలీలు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీల నాయకులు ఏనుగుల వెంకటేశ్వర్లు, ఏనుగుల ఉపేందర్, ఏనుగుల వీరబాబు, బొమ్మ లింగయ్య, బింగి వెంకటనారాయణ, ఏనుగుల రమేష్, పద్మశాలి యూత్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-మధిర



1996 -98 ఇంటర్మీడియట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మధిరలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పండుగగా వాతావరణాన్ని నెలకొల్పింది. ఈ సందర్భంగా 26 సంవత్సరాల తర్వాత ఎక్కడెక్కడికో వెళ్ళిన వారు కొందరు, ఎక్కడెక్కడో స్థిర పడిన వారు కొందరు, ఉద్యోగాల్లో కొందరు, సహధర్మచరినిలుగా కొందరు, వివిధ స్తితుల్లో జీవిస్తూ తమ మిత్రులను కలవాలనే కలంపులో ఆనాటి విద్యార్థులైన కొంత మంది విద్యార్థులకు ఆలోచన కలిగింది. ఈ కార్యక్రమంలో ఎస్కే. నజీర్, కాజీపురం అబ్దుల్ కురేష్, ఎస్కే. గాలి బాషా, బాలసాని కొండ, నెలకుర్తి వెంకటేశ్వర్లు, ఎర్రుపాలెం ఈనాడు రిపోర్టర్ ఆర్కే.ఎండ్లూరి రాజు, అప్పటి ప్రిన్సిపాల్ ఎస్. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వన సమారాధనలతో ఐక్యత

ఆర్యవైశ్య, కుమ్మర ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం



ప్రతి ఏడాది కార్తీక మాసంలో నిర్వహించే ఆత్మీయ వనభోజనాలతో అందరిలో ఐక్యత పెంపొందుతుందని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నగరంలోని చెరుకూరి వారి మామిడి తోటలో నిర్వహించిన ఆర్యవైశ్య వనసమారాధనకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి హాజరై.. అందరినీ ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ నిత్యం ఉరుకులు.. పరుగుల జీవితంలో ఇలా అందరూ ఒకచోటికి చేరడం ఎంతో ఆనందాన్ని నింపుతుందని అన్నారు. కార్యక్రమంలో పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, ఆర్యవైశ్య సంఘ నాయకులు పులిపాటి ప్రసాద్, చిన్ని కృష్ణారావు, గుమ్మడవెల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు అనంతరెడ్డి, స్ఫూర్తి రాధాకృష్ణ, ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ బాయ్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బల్లేపల్లిలో కుమ్మర వనభోజనాలకు హాజరు

నగరంలోని బల్లేపల్లిలో మలీదు జగన్ మామిడి తోటలో నిర్వహించిన కుమ్మర వన భోజనాలకు ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి హాజరయ్యారు. సంఘానికి అన్ని రకాలుగా అండగా ఉంటామని అభయమిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, పద్మశ్రీ వనజీవి రామయ్య, నాయకులు స్ఫూర్తి రాధాకృష్ణ, మొగిలిచర్ల సైదులు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా పలు సామాజికవర్గాల వన సమారాధనలు

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి పట్టణంలోని వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు కార్తీకమాసం సందర్భంగా ఆదివారం పట్టణ శివారులోని వివిధ ప్రాంతాల్లో కార్తీక వన సమారాధన కార్యక్రమాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆర్యవైశ్యులు అయ్యగారిపేట-కాకర్లపల్లి రోడ్డులోని వాణి గురుకులం ఆవరణలోని మామిడితోటలో సామూహిక వన భోజన కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కౌండిన్య గౌడసంఘం ఆధ్వర్యంలో పట్టణ శివారులోని శ్రీమెట్టాంజనేయస్వామి ఆలయ సమీపంలోని మామిడితోటలో ఆనందోత్సవాల నడుమ అట్టహాసంగా వన సమారాధన కార్యక్రమాన్ని జరుపుకున్నారు. కమ్మ సామాజికవర్గ ఆత్మీ సమ్మేళన కార్యక్రమం పట్టణంలోని అర్బన్ పార్కులో ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకున్నారు. కౌండిన్య గౌడసంఘం, ఆర్యవైశ్య సంఘ వన సమారాధన కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఆయా సంఘాల ఆతిథ్యాన్ని స్వీకరించారు. కమ్మవారి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. వన సమారాధన కార్యక్రమాలు ఆయా కుల సంఘాల ముఖ్య బాధ్యుల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయా వనభోజన కార్యక్రమాల్లో చిన్నారులు ఆటపాటలు, నృత్యాలతో అలరించారు.

సంఘటిత శక్తిని ప్రదర్శించాలి : ఎంపీ వద్దిరాజు

- ఘనంగా మున్నూరుకాపు వనసమారాధన

నవతెలంగాణ-ఇల్లందు



రాష్ట్ర జనాభాలో 20శాతానికి పైగా ఉన్న మున్నూరుకాపులు ప్రతి సందర్భంలో సంఘటిత శక్తిని ప్రదర్శించాలని, రాజకీయంగా మరింతగా ఎదిగేందుకు ముందుకు సాగాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మున్నూరుకాపు వనసమారాధన లలితాపురంలోని మామిడితోటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మున్నూరుకాపులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మున్నూరు కాపు అధ్యక్షులు పింగళి నరేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్తీక మాస వనసమారాధనలో ఎంపీ వద్దిరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వనసమారాధనలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ దిండిగల రాజేందర్, శీలంశెట్టి వీరభద్రం, పింగళి నరేష్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇల్లందు మున్నూరుకాపు సంఘం ప్రముఖులు అతిథులు ఎంపీ రవిచంద్ర, ఆకుల గాంధీ, సుధీర్, రాజేందర్, పింగళి నరేష్ లను గజమాల వేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పగడాల చందర్, ఎలమందల వాసు, కటకం పద్మావతి, కొక్కు సరిత, పాలెపు ఆనంద్, ఆకుల రాజేందర్, పసుపులేటి విజయలక్ష్మీ కల్వల సుధాకర్, పోతునూరి మాధవ్, రాజూరి మంజుల, పెద్దినేని హరినాథ్, పెద్దినేని రామకృష్ణ, రాజూరి వైశాఖ, కూతురు అరుణ్ కుమార్, గుండపల్లి సతీష్, చిట్టి రాహూల్ తదితరులు పాల్గొన్నారు.

తాటి చెట్టుపై నుండి పడి గీత కార్మికుడికి గాయాలు

- మంగయ్యను ప్రభుత్వం ఆదుకోవాలి
- గీత కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దూసరి శ్రీరాములు

నవతెలంగాణ-చింతకాని



మండల పరిధిలోని పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన ఎడవెల్లి మంగయ్య గీత కార్మికుడు తాటి చెట్టు పైనుండి కిందపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఎడవల్లి మంగయ్య గీత కార్మికుడు తాడిచెట్టు నుండి కళ్ళు గీసుకొని జీవనం కొనసాగిస్తూ ప్రతిరోజు లాగానే ఆదివారం తన ఇంట్లో ఆవరణలో ఉన్న తాడిచెట్టు పైకి కళ్ళు తీసేందుకు ఎక్కాడు. ప్రమాదవశాస్తూ తాటి చెట్టుపై నుండి జారి పడటంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని వెంటనే 108 సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగయ్య వృత్తిని ఆసరాగా చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాడని, ఇతనికి ఆర్థిక స్థితిగతులు సరిగా లేకపోవడంతో వృత్తినే నమ్ముకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడని తెలిపారు. మంగయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మికుల రాష్ట్ర అధ్యక్షులు దూసరి శ్రీరాములు ప్రభుత్వాన్ని కోరారు.

మహిళలపై దాడులను అరికట్టే వరకు పోరాడాలి

- ఐద్వా వన్‌టౌన్ కార్యదర్శి భాగం అజిత

నవతెలంగాణ-ఖమ్మం కార్పోరేషన్

మహిళలపై దాడులను అరికట్టే వరకు పోరాడాలని ఐద్వా వన్‌టౌన్ కార్యదర్శి భాగం అజిత అన్నారు. ఆదివారం స్థానిక ముస్తఫా నగర్‌లో ఐద్వా వన్ టౌన్ మండల కమిటీ సమావేశం వన్ టౌన్ అధ్యక్షురాలు ఎస్‌కే.ఫరీద అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మనం మహిళలుగా ఎన్నో దాడులకు, హింసకు,కట్టు బాట్లకు గురౌతున్నామని, ఒక ప్రక్క ప్రభుత్వాలు, పాలకులు మహిళా సాధికారత కోసం మేము అది చేసాం ఇది చేసాం అని ఊక దంపుడు ఉపన్యాసాలు ఎన్ని చెప్పినా మహిళల మీద జరిగే దాడులు, అత్యాచారాలు, హత్యలు రోజు రోజుకు పెరిగి పోతూనే ఉన్నాయన్నారు. ఈ రకమైన దాడులను అరికట్టేందుకు ప్రభుత్వాల పైన, పాలకుల పైన ఒత్తిడి తీసుకొస్తూ ప్రజలలో మమేకమై పోరాడితేనే కనీసం మనకు ఆనాడు అంబేద్కర్ రాజ్యాంగంలో పొందు పరచిన హక్కులనైనా కాపాడుకుంటామని, అందు కోసం అందరం కలసి కట్టుగా పోరాడి మన హక్కులను సాధించుకుందాం అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సుగుణ, ఎస్‌కే.షబాన, గౌసియా, లాల్ బీ, పర్వీన్, ఉష నాగమణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-పాల్వంచ రూరల్



నియోజవర్గ ని అన్ని విధాల అభివృద్ధి పథంలో తీసుకు వెళ్లటానికి శక్తివంతం లేకుండా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తోగ్గూడెం పంచాయతీలో నూతన అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే విధంగా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ డిఈ రామకృష్ణ, సిడిపిఓ లక్ష్మీ ప్రసన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులో 'సీతక్క'

నవతెలంగాణ-మణుగూరు



పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ మంత్రి దనసరి సీతక్క ఆదివారం మణుగూరుకు వచ్చారు. ఓ ప్రయివేట్ కార్యక్రమానికి పాల్గొనేందుకు వచ్చిన మంత్రి సీతక్కను సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ లేబర్ యూనియన్ అధ్యక్షులు వెలగపల్లి జాన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో భోగ రాజలింగు, గౌరవ యూనియన్ ముఖ్య సలహాదారు, పి. నారాయణ సన్మానించారు.

ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- ఐటీడీపీఓ బీ.రాహుల్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

సోమవారం భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని ఆయన తెలుపుతూ సంబంధిత యూనిట్ అధికారులు ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య మృతికి నివాళి

నవతెలంగాణ-ఇల్లందు

మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య మృతికి న్యూ డెమోక్రసీ పూలమాల వేసి నివాళులర్పించింది. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, సిపిఐ ఇల్లందు డివిజన్ నాయకులు దేవరకొండ శంకర్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి, టిపిటిఎఫ్ జిల్లా నాయకులు భూక్య బాలు తదితరులు పాల్గొన్నారు.

100 ఏండ్లుగా పేదల పక్షాన సీపీఐ

- జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

నవతెలంగాణ-బోనకల్

100 ఏళ్ల నుంచి సిపిఐ పేదల పక్షాన పోరాడుతున్న ఘనమైన చరిత్ర ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాదరావు అన్నారు. మండల పరిధిలోనే బ్రాహ్మణపల్లి గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం పోటు ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్‌రావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకొని డిసెంబర్ 26న శతాబ్ది ఉత్సవాలకు సన్నద్ధమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో శ్రామిక ప్రజల దళిత, బహుజనుల, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం, సమ సమాజ స్థాపన ఏర్పడాలని, సమాజంలో కుల వివక్షత, ఆర్థిక, సాంఘిక, అసమానతలు తొలిగిపోవాలని పోరాటాలు చేస్తుందని అన్నారు. 100 ఏళ్లలో ఎన్నో చారిత్రాత్మక పోరాటాలు, పాలకులు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించినప్పుడల్లా సిపిఐ ప్రజల పక్షాన నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీ నారాయణ, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ గ్రామ కార్యదర్శి గుడిదె కృష్ణ, మండల నాయకులు మందడపు వెంకటేశ్వరరావు, వంగాల నరసింహ, మడుపల్లి వెంకటేశ్వర్లు, గుడిద నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 2 నుండి పీఎల్‌జీఏ వార్షికోత్సవాలు

- ప్రజాపునాదిని, స్వీయాత్మక శక్తులను పెంచుకుందాం
- విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం
- 'కగార్' విప్లవ ప్రతిఘాతక యుద్ధాన్ని తిప్పికొడుదాం!
- మావోయిస్టు పార్టీ సెంట్రల్ మిలటరీ కమిషన్ పిలుపు

నవతెలంగాణ-చర్ల

డిసెంబర్ రెండవ తేదీ నుండి ఎనిమిదోవ తేదీ వరకు దేశవ్యాప్తంగా పిఎల్‌జీఏ వార్షికోత్సవాలను ఆనందోత్సవాల నడుమ జరుపుకుందామని సెంట్రల్ మిలటరీ కమిషన్(సీఎంసీ) పిలుపునిచ్చింది. ఆమెరకు ఆదివారం 18 పేజీల లేఖను పాత్రికేలకు మావోయిస్టు పార్టీ పంపింది. అందులో ముఖ్యంగా ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా! దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయసాధన కోసం ప్రజాయుద్ధాన్ని కొనసాగిస్తున్న


పీ.ఎల్.జీ.ఏ. 24వ వార్షికోత్సవాలను 2024 డిసెంబర్ 2 నుండి 8 వరకు దేశవ్యాప్తంగా విప్లవోత్సాహంతో జరుపుకుందాం.
ప్రజాపునాదిని, స్వీయాత్మక శక్తులను పెంచుకుందాం.

ప్రజావిముక్తి గెరిల్లా సైన్యానికి (పీఎల్‌జీఏ) డిసెంబర్ 2 నాటికి 24 ఏళ్ల నిండుతాయి. ఈ సందర్భంగా డిసెంబర్ 2 నుండి 8 వరకు పీఎల్‌జీఏ వార్షికోత్సవాలను దేశవ్యాప్తంగా అటవీ, మైదాన, పట్టణ ప్రాంతాల్లో విప్లవోత్సాహంతో, దృఢ సంకల్పంతో జరపాల్సిందిగా యావత్తు పార్టీ కమిటీలకు, పార్టీ శ్రేణులకు, పీఎల్‌జీఏ కమాండ్లకు, యూనిట్లకు, విప్లవ ప్రజా కమిటీలకు, ప్రజాసంఘాలకు, విప్లవ ప్రజానీకానికి సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎంసీ) పిలుపునిస్తోందని తెలిపింది."రాజకీయ, నిర్మాణ, సైనిక కృషి ద్వారా ప్రజాపునాదిని, స్వీయాత్మక శక్తులను పెంచుకుందాం. పార్టీ, పీఎల్‌జీఏ, ఐక్య సంఘటనలను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం, అభివృద్ధి చేద్దాం అని పిలుపునిచ్చారు. దేశవ్యాప్త విప్లవోద్యమ నిర్మూలనకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న 'కగార్' విప్లవ ప్రతిఘాతక యుద్ధాన్ని తిప్పికొడుదామని" ఈ సందర్భంగా యావత్తు విప్లవ శిబిరానికి సీఎంసీ పిలుపునిస్తోంది. పీఎల్‌జీఏ 23వ వార్షికోత్సవాల సందర్భంగా యావత్తు పార్టీ, పీఎల్‌జీఏకు, ప్రజా నిర్మాణాలకు, విప్లవ ప్రజానీకానికి సీఎంసీ ఇచ్చిన కర్తవ్యాల సాధన కోసం గత సంవత్సరకాలంగా ఉత్సాహంతో, దృఢసంకల్పంతో, ధైర్యసాహసాలతో కృషిచేస్తున్న యావత్తు పార్టీ కమిటీలకు, పార్టీ శ్రేణులకు, పీ.ఎల్.జీ.ఏ. కమాండ్లకు, కమాండర్లకు-యోధులకు, విప్లవ ప్రజాకమిటీలకు (ఆర్‌పీసీలకు), ప్రజాసంఘాల నాయకులకు కార్యకర్తలకు, ప్రజా మిలీషియా సభ్యులకు, విప్లవ ప్రజానీకానికి సీఎంసీ విప్లవాభినందనలు తెలియజేస్తోంది. గత సంవత్సర కాలంగా కొనసాగుతున్న విప్లవ ప్రతిఘాతక 'సూరజ్‌కుండ్' వ్యూహాత్మక పథకపు దాడిని, అందులో భాగంగా ఈ సంవత్సరం జనవరి నుండి కొనసాగుతున్న 'కగార్' విప్లవ ప్రతిఘాతక యుద్ధాన్ని సాహసోపేతంగా ఎదుర్కొంటూ సాగుతున్న రాజకీయ, సైనిక, నిర్మాణ, టెక్నికల్, సాంస్కృతిక కృషిలో పాల్గొంటున్న కామ్రేడ్స్ కందరికీ సీఎంసీ విప్లవాభినందనలు తెలియజేస్తోంది. భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో విప్లవ ప్రతిఘాతక సూరజ్ కుండ్ వ్యూహాత్మక పథకపు దాడిని, అందులో భాగంగా సాగుతున్న కగార్ దాడిని ఓడించడానికి పోరాడుతూ గత 10 నెలల కాలంలో (2023 డిసెంబర్ నుండి 2024 అక్టోబర్ వరకు) దేశవ్యాప్తంగా 254 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరితో పాటుగా దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలలో ఎందరో అసువులు బాసారు వారందరికీ సీఎంసీ మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తూన్నదని, వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించడంతో వాళ్ళ త్యాగాలకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని ఆ లేఖలో పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన విద్యా విధానం 2020ను రద్దు చేయాలి

- నల్లగొండ జిల్లా టీఎస్ యూటీఎఫ్ మహాసభల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ విద్యా రంగంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన విద్యా విధానం 2020ను వెంటనే రద్దు చేయాలని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ గార్డెన్స్‌లో అమరజీవి బలరాం వేదిక, ఎల్లందుల భిక్షం ప్రాంగణంలో టీఎస్‌యూటీఎఫ్ నల్లగొండ జిల్లా 6వ మహాసభలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన విద్యావిధానం భారత దేశ ప్రజల ఆలోచనలకు అనుగుణంగా లేదని, ఇది పూర్తిగా ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు, ప్రయివేటు యూనివర్సిటీలకు అనుకూలంగా ఉన్నదని విమర్శించారు. అలాగే, ఎన్ఈపీ 2020 కార్పొరేటీకరణ, కాషాయీకరణకు దారి తీసేదిగా ఉన్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, కాలేజీల్లో ఆధునీకరణ శాస్త్రీయ విద్యను బోధించేలా చూడాలని తెలిపారు. రాష్ట్రంలో వివిధ కేటగిరీల కింద ఉన్న పాఠశాలలు, కళాశాలను ఒకే చోట చేర్చి ఒకే తరగతి గది విధానాన్ని అమలుచేయాలని కోరారు. శాసనమండలిలో 99 శాతం తాను హాజరై విద్యారంగ పరిరక్షణ కోసం కృషి చేసినట్టు చెప్పారు. ప్రభుత్వం ప్రీ ప్రైమరీ నుంచి మూడో తరగతి వరకు అంగన్వాడీ పాఠశాలల్లో కొనసాగిస్తామని ప్రకటించడం పట్ల మండలిలో చర్చ జరిగిందని, ఇది తప్పని, పునరాలోచించుకొని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. ఈ మహాసభల్లో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య, రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జి.నాగమణి, గ్రంథాలయ మాజీ అధ్యక్షులు రేగట్టే మల్లికార్జున్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఎస్ నరేందర్‌రెడ్డి, యాదాద్రి భువనగిరి ప్రధాన కార్యదర్శి ముక్కర్ల యాదయ్య, అధ్యక్షులు ఎం. దామోదర్, పౌర స్పందన వేదిక జిల్లా అధ్యక్షులు అంకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు మందులు అమ్మకం


- డీసీఏ దాడుల్లో పట్టివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిర్దేశించిన ధర కన్నా ఎక్కువ ధరకు అమ్ముతున్న మందులను డ్రగ్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్ అంబర్‌పేటలోని ఒక మెడికల్ షాప్‌లో దాడి చేసి ఇట్వేజ్-200 క్యాప్సుల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనిని పాట్నానగర్‌లోని టాస్క్ ఇంటర్నేషనల్ ప్రయివేట్ లిమిటెడ్ తయారు చేస్తుండగా, చెన్నైలోని స్కినోసియన్ ఫార్మాస్యుటికల్స్ మార్కెటింగ్ చేస్తున్నది. దీనిని ఎంఆర్పీ రూ.299కిగా లేబుల్‌పై ముద్రించి అమ్ముతున్నారు. ఇది డ్రగ్స్ (ప్రైస్ కంట్రోల్) ఆర్డర్, 2013ను ఉల్లంఘించినట్టని అధికారులు తెలిపారు. ఇట్రాకాన్ జోల్ క్యాప్సుల్స్ 200 ఎంజీని ఒక్కో క్యాప్సుల్‌ను రూ.22.12 చొప్పున 10 క్యాప్సుల్స్ ను రూ.221.2కు అమ్మాలని కేంద్ర ప్రభుత్వం సీలింగ్ విధించింది. దీనికి జీఎస్టీ 12 శాతం కలుపుకున్నా రూ.247.74కు మించకుండా అమ్మాల్సి ఉంటుంది. అయితే 10 క్యాప్సుల్స్‌ను రూ.51.25 అధికంగా కలిపి అమ్ముతున్నారు. దీంతో అధికారులు మందులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాబాయి వర్సెస్ అబ్బాయి

- అధికంగా 11.28 శాతం ఓటింగ్ శరద్‌పవార్ పార్టీకే
- వాటిని సీట్లగా మలుచుకోలేకపోయిన వైనం
- 86 సీట్లలో పోటీ.. పది సీట్లకే పరిమితం
- అట్టడుగు స్థానానికి ఎన్సీపీ(ఎస్పీ)
- అజిత్ పవార్ ఎన్సీపీకి 9.01 శాతమే ఓటింగ్
- ఆయన పార్టీ పోటీ చేసింది 58 స్థానాలు.. గెలిచింది 41 సీట్లు
- ఇందులో 29 శరద్ పార్టీ మీదనే



ముంబయి : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తుది ఫలితాల విడుదలయ్యాయి. మ్యాజిక్ ఫిగర్‌ను దాటి దాదాపు 230కి పైగా స్థానాల్లో విజయం సాధించిన మహాయుతి మళ్లీ అధికారాన్ని చేపట్టనున్నది. అక్కడి ప్రాంతీయ పార్టీలైన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ), శివసేనలు రెండుగా చీలి, వైరి పక్షాలుగా బరిలో నిలవటంతో.. గతంతో పోలిస్తే ఈ సారి ఎన్నికలు చాలా ఆసక్తికరంగా మారాయి. రాజకీయాల్లో చాణక్యుడిగా చెప్పబడే శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీని.. ఆయన అన్న కొడుకు అయిన అజిత్ పవార్ చీల్చటంతో అది రెండుగా విడిపోయింది. ఈ ఎన్నికల్లో శరద్‌పవార్ నాయకత్వంలోని ఎన్సీపీ(ఎస్పీ) మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) నుంచి, అజిత్ సారథ్యంలోని ఎన్సీపీ మహాయుతి కూటమిలో భాగమై ఢీ కొన్నాయి.

ఈ ఎన్నికల్లో బాబాయి శరద్ పవార్, అబ్బాయి అజిత్ పవార్‌ల పార్టీలకు వచ్చిన ఓటింగ్ శాతం, దక్కిన సీట్లు ఆసక్తికరంగా మారాయి. ఎన్సీపీ(ఎస్పీ) 11.28 శాతం ఓటింగ్‌ను పొందింది. అయితే, అజిత్ వర్గానికి వచ్చిన ఓట్ల శాతం 9.01 శాతమే కావటం గమనార్హం. అయితే, ఎక్కువ ఓట్లను పొందినప్పటికీ.. శరద్‌పవార్ పార్టీ మాత్రం వాటిని సీట్లుగా మలుచుకోలేకపోయింది. దీంతో ఆ పార్టీ 86 స్థానాలకు పోటీ చేస్తే.. పది సీట్లలోనే విజయం సాధించింది. రాష్ట్రంలోని కీలక పార్టీలన్నిటితో పోల్చుకుంటే..ఇది చాలా తక్కువ. దీంతో అధిక సీట్లు గెలిచిన ప్రధాన పార్టీల జాబితాలో ఎన్సీపీ(ఎస్పీ) అట్టడుగున ఉన్నది. అయితే, ఇది శరద్ పవార్‌కు ఘోరమైన ఓటమిగా రాజకీయ పరిశీలకులు అభివర్ణిస్తున్నారు.

ఇక అజిత్ పవార్ పార్టీ 58 స్థానాల్లో పోటీ చేసింది. ఇందులో 41 స్థానాలను దక్కించుకున్నది. ఈ విషయంలో బాబాయి కంటే అబ్బాయి చక్కని ప్రదర్శనను కనబర్చారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అయితే, ఈ ఎన్నికల్లో అజిత్ పార్టీకి దక్కిన ఓటింగ్ శాతం 9.01 మాత్రమే. ఇది ఎన్సీపీ(ఎస్పీ) దక్కించుకున్న దానితో పోలిస్తే 2.27 శాతం తక్కువ. ఎక్కువ సీట్లను గెలుచుకున్న అజిత్ పార్టీ.. మహాయుతిలో కీలకంగా వ్యవహరించే అవకాశాన్ని దక్కించుకున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. కూటమిలో సీఎం పదవిని డిమాండ్ చేయొచ్చనీ, అదీ కాకపోతే మంత్రి వర్గంలో కీలక బెర్తులపై పట్టు బిగించే అవకాశం అజిత్ పవార్ పార్టీకి మెండుగా ఉన్నదని అంచనా వేస్తున్నారు.

ఇక ఈ రెండు పార్టీల మధ్య జరిగిన ప్రత్యక్ష పోరులో 29 సీట్లలో అజిత్ పార్టీ విజయం సాధించింది. మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో ఎంవీఏ మంచి ప్రదర్శనను కనబర్చింది. బారామతి లోక్‌సభ నియోజకవర్గం పవార్ కుటుంబాలకు ప్రతిష్టాత్మకంగా మారింది. అయితే, ఈ స్థానంలో శరద్ పవార్ కూతురు సుప్రియా సూలే.. అజిత్ భార్య సునేత్రపై విజయం సాధించి, పట్టు నిలుపుకున్నారు. ఎంపీ ఎన్నికల్లో అజిత్ పవార్ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగలటంతో, ఆయన పనైపోయిందని అంతా అనుకున్నారు. అయితే, ఈ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అజిత్‌కు కొత్త ఊపునిచ్చాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. అంతేకాదు.. బారామతి అసెంబ్లీ స్థానం నుంచి తన తమ్ముడి కుమారుడైన ఎన్సీపీ(ఎస్పీ) అభ్యర్థి యోగేంద్ర శ్రీనివాస్ పవార్‌ను అజిత్ పవార్ ఓడించి 'లోక్‌సభ' ఓటమికి సమాధానమిచ్చాడని అంటున్నారు.

కౌన్ బనేగా మహా సీఎం





(మొదటిపేజీ తరువాయి)

అధికార మహాయుతి కైవసం చేసుకుంది. బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఆ పార్టీ ఒంటరిగా 132 సీట్లు గెలుచుకుంది. ఈ విజయం ఊహించనిది..ఎందుకంటే మహారాష్ట్ర ఎన్నికలలో ఇంతకు ముందు ఏ కూటమి 200 సీట్ల మ్యాజిక్ ఫిగర్ దాటలేకపోయింది. మహాయుతి విజయంతో బీజేపీ, శివసేన (శిండే), అజిత్ పవార్ నేత ృత్వంలోని ఎన్సీపీ శిబిరంలో సంబరాల వాతావరణం నెలకొంది. మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరు అవుతారనే దానిపై ఇప్పుడు అందరి దృష్టి ఉంది.

ముఖ్యమంత్రి ఎప్పుడు, ఎవరు?

మహారాష్ట్రలో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవానికి సంబంధించి కొత్త అప్‌డేట్ బయటకు వచ్చింది. స్వల్పవ్యవధిలోనే మహాయుతి ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవం జరగవచ్చని, తొలుత ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి మాత్రమే ప్రమాణ స్వీకారం చేస్తారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే ముఖ్యమంత్రి ఎవరన్నదానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఇందుకు సంబంధించి మహాయుతిలో ఆ ముగ్గురు నేతలు, ఆయా పార్టీల ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి రేసులో దేవేంద్ర ఫడ్నవీస్ ముందంజలో ఉన్నారని కమలం పార్టీ లీకులు వదులుతోంది. రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన రెండో బ్రాహ్మణుడు ఫడ్నవీస్. కాగా మూడోసారి ఈ పదవిని ఆయనే చేపడతారని రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఫడ్నవీస్ సీఎం కావాలని బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

అయితే, ఏక్‌నాథ్ శిండే స్టాండ్ ఏమిటన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తు సీఎం, శివసేన చీలిక నేత కూడా అయిన శిండే తమ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు.తనకు మరో ఛాన్స్ ఇవ్వాలని కోరుతున్నారు. ఎన్నికల్లో శివసేన ఉద్ధవ్ వర్గానికి గట్టి పోటీనిచ్చి 57 సీట్లు గెలుచుకున్నాయి. శివసేన (యూబీటీ) కేవలం 20 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. మరోవైపు, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ కూడా సమావేశం అయింది. ఈ సమావేశంలో పార్టీ నాయకుడిగా అజిత్ పవార్‌ను ఎన్నుకున్నారు. శరద్ పవార్ తన కెరీర్‌లోనే అతిపెద్ద ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఆయన పార్టీ కేవలం 10 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. పవార్ పార్టీ కూడా అబ్బాయి అజిత్ పవార్ నేత ృత్వంలోని శిబిరం కంటే వెనుకబడి ఉంది. అజిత్ వర్గం 41 సీట్లు గెలుచుకుంది.

సీఎం పదవిపై ఎన్సీపీ కూడా రేసులో ఉన్నట్టు ఛగన్ భుజ్‌బల్ చెప్పారు. అజిత్ పవార్ కూడా ముఖ్యమంత్రి కావచ్చు అని మీడియాతో అన్నారు.

ఇలా మూడు పార్టీలు సీఎం కుర్చీ కోసం ఎత్తులు,పై ఎత్తులు వేస్తున్నాయి. అయితే ఈ మూడు పార్టీల నుంచి ఎవరు సీఎం అవుతారో.. కలిసి నిర్ణయించుకోండి" అనేలా ఢిల్లీ పెద్దలు ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం.అయితే బీజేపీ కేంద్ర నాయకత్వం నిర్ణయం మీదే మహారాష్ట్ర సీఎం పదవి ఆధారపడి ఉంటుందన్నట్టు ఆ రాష్ట్ర పెద్దలు అంటున్నారు.నిశితంగా గమనిస్తే..గత అసెంబ్లీ ఎన్నికల్లో ఫడ్నవీస్ ను పక్కనబెట్టి..శివసేను చీల్చిన శిండేకు సీఎం కుర్చీ ఇచ్చింది. ఇప్పుడు కూడా అదే చేస్తుందా.లేక ఫడ్నవీస్‌కు ముఖ్యమంత్రి అవకాశం ఇస్తుందా లేక అజిత్ పవార్ ఛాన్స్ ఇస్తుందా..ఇదేదీ కాకుండా తెరపైకి మరోకరిని తెస్తుందా..? అంతా హైకమాండ్ మీద ఆధారపడి ఉన్నదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చారిత్రాత్మకం

ప్రజలకిచ్చిన హామీలన్ని నెరవేరుస్తాం

- వరిపంట సాగులో తెలంగాణ టాప్
- అర్హులందరికి రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ : పౌరసరఫరాల, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ- హుజూర్‌నగర్‌టౌన్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చారిత్రాత్మకమని పౌరసరఫరాల, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. డిసెంబర్ 7నాటికి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతుందున రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని కౌండిన్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విజయోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ సూర్యాపేట జిల్లా అభివృద్ధి ప్రగతి నివేదికను వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కొనసాగిన నిరంకుశ పాలనను ప్రజలు వ్యతిరేకించి కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడంతో ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలైన.. మహిళలందరికీ ఉచితంగా బస్సు సౌకర్యం, ఆరోగ్య శ్రీ పథకం ద్వారా వైద్య ఖర్చులకిచ్చే మొత్తాన్ని రూ. 10 లక్షలకు పెంచినట్టు చెప్పారు. అధికారం చేపట్టిన 10నెలల్లోనే 50వేల ఉద్యోగ నియామకాలు, గృహలక్ష్మి పథకం కింద రూ. 500లకు వంట గ్యాస్, 200యూనిట్ల విద్యుత్‌ను అందిస్తున్నట్టు తెలిపారు.

రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశామని, ఇంకా కానీవారికి జనవరి నాటికి పూర్తి చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా ఇండ్లు లేని నిరుపేదలందిరికీ రూ॥5లక్షలు అందించి ఇంటి నిర్మాణం చేపట్టనున్నామని చెప్పారు. నీటి పారుదల శాఖ ద్వారా కాళేశ్వరం ప్రాజెక్ట్ మరమ్మతులు చేపట్టడంతో పాటు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగుకు నీరందించే లక్ష్యంతో శాఖ పని చేస్తుందన్నారు. నూతన ప్రాజెక్టులు, లిఫ్టుల నిర్మాణంతో పాటు పాత వాటికి మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 158 మెట్రిక్ టన్నుల వరిపంట సాగై దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి సన్నరకం వరిపంటకు రూ.500 బోనస్ రైతులకు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో రూ. 300కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం చేపట్టి విద్యార్థులకు నాణ్యమైన కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వం అందిస్తుందన్నారు. హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించామని, హైదరాబాద్ టూ విజయవాడ వయా హుజూర్‌నగర్ - కోదాడ మీదుగా రైల్వేలైన్‌కు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో పసలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక అకాడమీ చైర్మెన్ డా. అలైఖ్య కోదాడ, తుంగతుర్తి ఎమ్మెల్యేలు ఉత్తమ్ పద్మావతి, మందుల సామేలు, రాష్ట్ర టూరిజమ్ కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేశ్‌రెడ్డి, రాష్ట్ర మార్కెట్ కమిటీ సభ్యులు చెవిటి వెంకన్నయాదవ్, హుజూర్‌నగర్, కోదాడ, నేరేడుచర్ల మున్సిపల్ చైర్‌పర్సన్లు గెల్లి అర్చనరవి, ప్రమీల, బచ్చలకూరి ప్రకాష్, వైస్‌చైర్మెన్ కోతి సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవ పరిణామానికి బలమైన ఆధారాలు

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. ఆధునిక దేశంగా చెప్పుకునే అమెరికాలోనూ ఈ పాఠాలు చెప్పకపోవడం అందుకేనని తెలిపారు. ఈ సిద్ధాంతం బోధించకుండా శాస్త్రీయ అధ్యయనానికి అర్థమే ఉండదని తెలిపారు. మన దేశంలోనూ పదవ తరగతి వరకు దీన్ని తీసేసే కుట్ర చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పబ్బం గడుపుకునేందుకే మత సిద్ధాంతాలని చెప్పారు. ప్రజల్లో సత్య దృక్పథం పెంచేందుకు వాస్తవాలను చెప్పాలని సూచించారు. పరిణామ వాదానికి వ్యతిరేకంగా సృష్టి వాదాన్ని కోటాను కోట్ల మంది నమ్ముతున్న సమయంలో చార్లెస్ డార్విన్ చెప్పిన సత్యంతో ప్రజలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.గెలిలియో సూర్య కేంద్ర సిద్ధాంతం ప్రతిపాదించినప్పుడు, డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినప్పుడు.... వ్యతిరేకత ఎదురైనా వెనక్కి తగ్గలేదని గుర్తుచేశారు. ప్రజల్లో శాస్త్ర ప్రచారం, మూఢ నమ్మకాలను తొలగించేందుకు జీవ పరిణామ సిద్ధాంతం గొప్ప అవకాశమని అభిప్రాయపడ్డారు. ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా జీవ పరిణామ సిద్ధాంతం గొప్ప సైన్సు అని తెలిపారు. 1859 నవంబర్ 24 నాడు, చార్లెస్ డార్విన్ తన ప్రతిష్టాత్మక " ఆరిజన్ ఆఫ్ స్పీసిస్" గ్రంథాన్ని ప్రచురించిన రోజని,అందువల్ల నవంబర్ 24 తేదీని ప్రపంచ పరిణామ దినోత్సవంగా ప్రపంచమంతా జరుపుకుంటున్నామని తెలియజేశారు.డార్విన్ సిద్ధాంతాలపై నేటికీ ఆంక్షలు కొనసాగటం ఎంతో విచారకరమని అన్నారు. డాక్టర్ దాసరి ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఆధునిక వైద్యశాస్త్ర రంగంలో అనేక విప్లవత్మక పరిశోధనలకు, ఆవిష్కరణలకు మూలం డార్విన్ ప్రతిపాదించిన జీవ పరిణామ సిద్ధాంతమని నొక్కివక్కాణించారు. అంతటి ప్రాధాన్యత కలిగిన జీవ పరిణామవాద సిద్ధాంతంపై జేవీవీ ప్రచార ఉద్యమాన్ని చేపట్టడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జీవ పరిణామ సిద్ధాంత విశేషాలను ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలని ఆయన కోరారు.


చెలిమల రాజేశ్వర్ మాట్లాడుతూ ఆరంభం నుంచి డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం పలు మతాల ఆంక్షలను తట్టుకునీ, అనేక రుజువులతో నేటికీ నిలబడిందని గుర్తుచేశారు. తన ప్రఖ్యాత బిగిల్ ఓడ పర్యటన, తదనంతరం 20 సంవత్సరాలకుపైగా ఆయన చేసిన కఠోర అధ్యయనం, పరిశోధనల వల్లనే ఇంతటి మహత్తర జీవ పరిణామ సిద్ధాంతానికి రూపం ఇచ్చారని ఆయన కొనియాడారు. శాస్త్రవేత్తల పరిశోధనలు, త్యాగాల వల్లనే సమాజం అభివృద్ధి చెందుతున్నదనీ, ప్రజల జీవితాలను మెరుగుపరిచే అటువంటి శాస్త్రవేత్తల కృషిని అడ్డుకోవడం తగదని ఆయన హితవు చెప్పారు.

సీసీఎంబీ రీసెర్చ్ స్కాలర్ ఆదిత్య మాట్లాడుతూ జీవులన్నిటి మధ్య సారూప్యం ఉందనీ, దానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉదాహరణకు మనుషులపై వివిధ రకాల మందుల, వైద్య చికిత్సల ప్రభావాల గురించి అంచనా వేసేందుకు ముందుగా ప్రయోగశాలలో ఎలుకలపై, కోతులపై శాస్త్రవేత్తలు పరీక్షలు చేస్తారని గుర్తు చేశారు. జీవుల మధ్య వాటి డీఎన్ఏ జన్యువుల మధ్య సారూప్యం ఉంది కాబట్టే శాస్త్రవేత్తలు ఇలాంటి పరిశోధనలు చేయగలుగుతున్నారని వివరించారు. కోతి నుంచి మనిషి వచ్చాడని చెప్పే పరిణామ సిద్ధాంత ప్రకటనను చాలా యాంత్రికంగా అర్థం చేసుకుంటున్నారనీ, దానివల్ల గందరగోళానికి లోనవుతున్నారని అన్నారు. ఈ శాస్త్ర ప్రకటన సరైన అర్థం, ఒకే ఉమ్మడి జీవి నుంచి కోతులు, మానవులు పరిణామం చెందాయని వివరించారు.జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా రాజా మాట్లాడుతూ శాస్త్రీయ అవగాహనను మన సమాజంలో, ప్రధానంగా విద్యార్థుల్లో పెంపొందించడానికి డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని జేవీవీ నిర్ణయించిందని తెలిపారు. నవంబర్ 24 నుంచి ప్రారంభించి 2025 ఫిబ్రవరి 28 జాతీయ సైన్స్ దినోత్సవం వరకు ఈ జీవపరిణామ సిద్ధాంత ప్రచారోద్యమానికి జేవీవీ పిలుపునిచ్చిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 1000 కి పైగా ఉపన్యాసాలు, సభలు, సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. అలాగే, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డిబేట్, పోస్టర్ డిజైన్, క్విజ్, మొదలగు కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ ప్రచారోద్యమాన్ని ప్రజలలోకి విస్తతంగా తీసుకువెళ్ళడం కోసం పుస్తకాలు, బుక్‌లెట్స్, పీపీటీ స్లైడ్స్, మొదలగు ప్రచార సామాగ్రిని సిద్ధం చేస్తున్నామన్నారు. జేవీవీ చేపట్టిన ఈ విస్తృత శాస్త్ర ప్రచార ఉద్యమానికి సహకరించాలని సైన్స్ ప్రియులు, ఉపాధ్యాయులు, మేధావులు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జేవీవీ రాష్ట్ర నాయకులు రావుల వరప్రసాద్, పి.ఆనంద్ కుమార్, జగన్మోహన్ రావు, ఎం.శ్రీనివాస్, రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, యు.సాయిబాబా, కురుమయ్య, లక్ష్మీనరసయ్య, ఎం రంగాచారి, రాములయ్య అల్తాఫ్, చాగంటి సాయి తదితరులు పాల్గొన్నారు.

ధర్మం కంటే అధర్మమే ఎక్కువ

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

- ముగిసిన లోక్ మంథన్ కార్యక్రమం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నేటి సమాజంలో ధర్మం కంటే అధర్మమే ఎక్కువైపోయిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో స్వార్థం పెరిగిపోతున్నదని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో శిల్పారామంలో లోక్‌మంథన్ కార్యక్రమం ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మనలో సంతోషం ఉందని పూర్వీకులు చెప్పారనీ, కానీ, నేడు చాలామంది సంతోషం బయట వెతుక్కుంటున్నారని చెప్పారు. వస్తురూపేణా సంతోషం కోరుకుంటే అది ఎక్కువ కాలం నిలవదన్నారు. ఋషుల ఆలోచనలో మనది సనాతన దేశమని చెప్పారు. మనదేశంలో విదేశీయులు, ఆంగ్లేయులు ఆక్రమణలకు వచ్చి సంస్కృతిని చిన్నాభిన్నం చేసినప్పటికీ మన దేశం నేటికీ నిలబడి ఉందన్నారు. భౌతిక జీవనం ఎలా సాగించాలో,మన పూర్వీకులు ఎప్పుడో చెప్పారని తెలిపారు. ఆధ్యాత్మిక బాటలో ఉంటే ధర్మం నిలబడుతుందని చెప్పారు. విజ్ఞానం ముందు ధర్మం ఉండదా? అని ప్రశ్నించారు. విజ్ఞానం ఉపయోగించేవారి తీరును బట్టి ధర్మం నిలుస్తుందని చెప్పారు. ప్రతిఒక్కరూ ధర్మం గురించి ఆలోచించాలని సూచించారు. మనం వేరే గ్రౌండ్‌లోకి వెళ్లొద్దనీ, వేరే వాడిని మన గ్రౌండ్‌లోకి పిలువాలి అని అన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ..వనవాసి, గ్రామవాసి, నగరవాసి అనే తేడాలేదనీ, అందరూ భారతీయులేనని చెప్పారు. అక్కడక్కడా ఆదివాసీల పట్ల వివక్ష ఉందనే మాటలు వినిపిస్తున్నాయన్నారు. విదేశాల్లోనూ మన సాంప్రదయాలను ఆచరిస్తున్నారని తెలిపారు. న్యూజిలాండ్ పార్లమెంటులో నెమలి ఉంటుందనీ, అది వాళ్ల సాంప్రదాయపు నృత్యం అని చెప్పారు. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ..ప్రపంచానికే భారత్ ఆధ్యాత్మిక కేంద్రంగా ఉందని చెప్పారు. విదేశీయులు మన విజ్ఞానాన్ని ధ్వంసం చేశారన్నారు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నా మన ధర్మం, దేశం నిలబడి ఉందన్నారు. సనాతన ధర్మాన్ని, కాపాడటానికి లోక్‌మంథన్ కార్యక్రమాలు జరగాల్సి ఉందని చెప్పారు. మన దేశం విభిన్న జాతులు, విభిన్న సంస్కృతుల కేంద్రమని తెలిపారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..దేశంలో ఆధ్యాత్మికత పెరుగుతుండటం, అభివృద్ధి జరుగుతుండటంతో కొన్ని శక్తులు సహించలేక అరాచకాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. దేశాల మధ్య యుద్ధాలు జరుగుతున్న సమయంలో అంతర్జాతీయ వేదికలపై శాంతి కోసం మోడీ ప్రయత్నిస్తున్నారని చెప్పారు. దేశాన్ని విశ్వగురువుగా చేయడం కోసం ప్రతి ఒక్కరూ కదలి రావాలని కోరారు.

డేటా ఎంట్రీ కీలకమైనది

- డోర్ లాక్, వలసలు వారి వివరాలను సేకరించండి : జార్ఖండ్ నుంచి కలెక్టర్లు, ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో భట్టి విక్రమార్క ఆదేశం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సమగ్ర కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుందనీ, డేటా ఎంట్రీ దశ చాలా ముఖ్యమైందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకూడదని అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం ఆయన జార్ఖండ్ రాజధాని రాంచి నుంచి సమగ్ర కుటుంబ సర్వే వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారులు,కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. డేటా ఎంట్రీలో నాణ్యత చాలా ముఖ్యమైందన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. సర్వే దశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. కాబట్టి వారికి ఫోన్‌కాల్ చేసి సర్వే గురించి తెలియజేయడం ద్వారా ఆ వివరాలను నమోదు చేయాలని సూచించారు. వారిని అందుబాటులో ఉండమని కోరాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని తెలిపారు. కొన్ని వసతి గృహాల్లో, రెసిడెన్షియల్ పాఠశాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పాఠశాల్లో ఆహారం, పరిశుభ్రతపై ప్రధానంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గం ప్రత్యేక దృష్టికి సాధించిందని చెప్పారు. ఈ రకమైన సమస్యలు తలెత్తకూడదనే మెస్, కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని గుర్తు చేశారు. ఫుడ్ పాయిజన్, అపరిశుభ్రత వంటి అంశాలకు తావు లేకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్ర వెంకటేశం, జీహెచ్ఎంసీ కమిషనర్, అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

యువతను రాజకీయాల వైపు మళ్లించేందుకు..

- వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ : మన్‌కీ బాత్‌లో మోడీ

న్యూఢిల్లీ : యువతను ముఖ్యంగా రాజకీయేతర నేపథ్యం ఉన్న యువతను రాజకీయాల వైపు మళ్లించేందుకు 2025 జనవరిలో వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌ను నిర్వహించనున్నట్టు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించే యువజనోత్సవాల్లో భాగంగా న్యూఢిల్లీలో జనవరి 11, 12 తేదీల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. దేశం నలుమూలల నుంచి రెండు వేల మంది యువత ఇందులో పాల్గొంటారని చెప్పారు. అలాగే కనీసం లక్ష మంది యువతను రాజకీయాల్లోకి చేర్చేందుకు వివిధ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రధాని చెప్పారు. మన్ కీ బాత్ ప్రసంగంలో మోడీ ఈ విషయాలను తెలిపారు. అలాగే నవంబర్ 24న ఎన్‌సీసీ డే అని గుర్తు చేస్తూ యువతలో క్రమశిక్షణ, నాయకత్వం, సేవ స్ఫూర్తిని ఎన్‌సీసీ నింపుతుందని చెప్పారు. అలాగే సమాజం కోసం నిస్వార్థంగా పని చేస్తున్న కొంత మంది యువకులను మోడీ ఈ సందర్భంగా ప్రశంసించారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్లు పొందడంలో వృద్ధులకు లక్నోకు చెందిన వీరేంద్ర, భోపాల్ చెందిన మహేష్ మొబైల్ ద్వారా చెల్లింపులు చేయడంలోనూ సహాయ పడుతున్నారని చెప్పారు. ఇటీవల తన గయానా పర్యటన గురించి మోడీ వెల్లడించారు.

వచ్చేనెల 21న ఓయూలో భారీ కృతజ్ఞత సభ

- కాంగ్రెస్ ప్రజాపాలనకు ఏడాది పూర్తి : పోస్టర్ ఆవిష్కరణలో ఎంపీ చామల, చనగాని దయాకర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనకు ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా వచ్చే నెల 21న ఉస్మానియా యూనివర్సిటీలో కృతజ్ఞత బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర వెల్లడించారు. ఆదివారం హైదరాబాద్‌లోని చామల నివాసంలో ఓయూ నేతలతో కలిసి ఆయన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చామల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఉద్యోగాల భర్తీ జరిగిందన్నారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతికత లేదని చెప్పారు. పదేండ్లు రాష్ట్రాన్ని పాలించినా కేసీఆర్ నిరుద్యోగులను పట్టించుకోలేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 54000 ఉద్యోగాల భర్తీ చేసినట్టు తెలిపారు. తెలంగాణ యువత కోరుకున్న ప్రజా పాలన వచ్చిందన్నారు. నిరుద్యోగులకు కొత్తగా న్యూఇయర్‌లో మరిన్ని ఉద్యోగాల భర్తీ చేస్తామన్నారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో నిరుద్యోగులకు వరంగా మారబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర నాయకులు నూక కిరణ్ యాదవ్, మీడియా కో ఆర్డినేటర్ వచన్ కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు చేడే మహేందర్, మల్లికార్జున కోట, దనుజయ్, ఓయు ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు మెడ శ్రీను, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మనువాదమా! పెరుగుతున్న హింసకు నువ్వూ కారణమే!

- ఎస్.పుణ్యవతి

'మొగుడ్ని కొట్టి మొగసాలకు ఎక్కింది' లాంటి సామెతలు యదాలాపంగా వాడుతూ, మాట్లాడుతూ ఉంటాం. అయితే దీనికి పూర్తి విరుద్ధంగా అసలు సమస్య ఉన్నది. మన దేశంతో సహా ప్రపంచ దేశాల్లో సుమారు నూటికి 30 మంది స్త్రీలు భర్తల చేత దెబ్బలు తింటున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే) 5 కూడా ఇదే చెప్తోంది. 'మొగుడు కొట్టినందుకు కాదు తోడికోడలు దెప్పినందుకు' లాంటి సామెతలు కూడా వాడేస్తుంటాం. అంటే మొగుడు చేతిలో దెబ్బలు తినడానికి సిద్ధపడతాం. కానీ ఇంటిగుట్టు బయటకు రావద్దు. అందుకే నూటికి 87 మంది ఆడవాళ్లు తమ మీద జరుగుతున్న దౌర్జన్యాలు బయటికి చెప్పనే చెప్పరంట. ఇది కూడా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే రిపోర్టే చెప్తుంది. 'ఏదో కుటుంబాల్లో గొడవలు వస్తుంటాయి, సరిపెట్టుకో రాదూ' అని చుట్టూ ఉన్న బంధు మిత్ర వర్గం ఉచిత సలహాలు పారేస్తుంది. కానీ ఇది సరిపెట్టుకునే సమస్యలాగా లేదు. ఇది ఎవరో 'మహిళా మండలి వాళ్ళు' చేసే గోల మాత్రం కాదు. సాక్షాత్తు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) చెప్తోంది. స్త్రీల పైన యదేచ్ఛగా సాగే హింస కారణంగా ఆడవాళ్ల శారీరక, మానసిక ఆరోగ్యం కూడా పూర్తిగా దెబ్బతింటుందని, జీవితాంతం వాళ్లకి ఆరోగ్య సమస్యలు ఏదో ఒక రూపంలో వస్తున్నాయని చెప్తోంది. ఈ హింస కారణంగా కుటుంబంలో పిల్లల పైన కూడా ఏదో ఒక రకంగా ప్రభావం పడుతోందని చెప్తుంది. మగ పిల్లలు పెళ్ళాన్ని, తల్లిని, ఆడవాళ్ళని వేధించడం సహజం అనుకుంటే ఆడపిల్లలు హింసను భరించటం మన తలరాత అని అనుకునే పరిస్థితి ఉంటుంది.

ఎందుకీ హింస? మూలం ఎక్కడ?

ఆసియా దేశాల్లో హింస చాలా ఎక్కువ ఉంటుంది. పారిశ్రామిక విప్లవాలు వచ్చిన యూరప్, అమెరికాలో కూడా హింస ఉన్నా, కనీసం ఇది తప్పు అనే భావం కూడా బలంగా ఉంటుంది. స్త్రీలు హింసకు ఎదురు తిరిగి పోరాడే తత్వమైనా ఉంటుంది. అయితే మన దగ్గర అలా కాదు. సీతా, సావిత్రి కథలు మన నోళ్లు ముగిస్తాయి. ఇది ఒక భాగం అయితే మనలాంటి దేశాల్లో స్త్రీల శ్రమకు గుర్తింపు చాలా తక్కువగా ఉండటం కూడ ఒక కారణం. ఆడవాళ్లు చాకిరీ చేయక కాదు. కానీ వాళ్ళ శ్రమకి ఎక్కడా గుర్తింపు ఉండదు. 'పెయిడ్ ఎంప్లాయిమెంట్' వేతనంతో కూడిన ఉపాధి అని ఏదైతే అంటుంటామో ఆ వేతనంతో కూడిన ఉపాధి కొన్ని పాశ్చాత్య దేశాలతో పోల్చుకుంటే మన దగ్గర తక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో రైతు, వ్యవసాయ కుటుంబాల్లో స్త్రీలు మగవాళ్ళకన్నా ఎక్కువే చాకిరీ చేస్తారు. దాని పని అంటానికి లేదు చాకిరి అనటమే సరైనది. కానీ ఆ చాకిరికి ఎక్కడా ఏ ప్రభుత్వం లెక్క కట్టదు. అనివార్యంగా ఇష్టం ఉన్నా లేకపోయినా భర్తను వదిలి పోవడానికి లేదు. పక్షికైనా గూడున్నదే మోగాని స్త్రీకి నాది అని చెప్పుకునే ఇల్లు లేదు. ఇల్లు అయినా, పొలం అయినా ఆమె పేరుతోటి ఉండేది చాలా తక్కువ మందికి. 'పో' అంటే ఇంట్లో నుంచి పోవాల్సిందే. దానికి తోడు ఆడవాళ్ళకి చదువులు తక్కువ. బయటకు పోయి ఏదైనా ఉద్యోగం చేసుకుని బతికే అవకాశాలు తక్కువ. ఇట్లాంటి రకరకాల కారణాల వల్ల ఎదురు తిరిగే మనస్తత్వమూ తక్కువ. హింసను మౌనంగా భరించక తప్పని పరిస్థితి.

మనువాదం వాట తక్కువేం కాదు

బాలికైనా, యువతైనా, ముసలిదైనా స్త్రీ స్వతంత్రించి గృహ కార్యాలను చేయరాదు. బాల్యంలో తండ్రి చెప్పు చేతల్లోనూ, యవ్వనంలో భర్త అధీనంలోనూ, భర్త మరణానంతరం పుత్రుని అధీనంలోనూ ఉండాలి. స్త్రీ స్వేచ్ఛగా ఉండరాదని మనువు శాసనం. స్త్రీ తన తండ్రిని, భర్తను, కొడుకులను ఎన్నడు విడిచి ఉండరాదు. అట్లు వీరికి దూరంగా ఉండాలని కాంక్షిస్తే మాత పితరుల వంశాలు రెండింటికి చెడ్డ పేరు వస్తుంది. భర్తకు తన పట్ల ఇష్టం ఉన్నా లేకున్నా భార్య చిరునవ్వుతో ఉండటం, ఇంటి పనులలో నేర్పరితనాన్ని కలిగి ఉండటం, గృహ సామగ్రిని పదిలంగా అమర్చడం, పొదుపుతనాన్ని కలిగి ఉండాలి (147, 148, 149, 150). చూడండి ఎంత చక్కగా సెలవిస్తున్నాడో భర్తకి తన మీద ఇష్టం ఉన్నా లేకపోయినా భార్య చిరునవ్వుతో ఉండాలి అంట. చూశారా? భర్త ఎటువంటి వాడైనా అతన్ని నిరాదరణ చేయకూడదట. అతనే దేవుడని పూజించాలి అంట. ఇన్ని మంత్రాలు, ఉపోద్ఘాతాలు మన నెత్తిమీద తట్టలకొద్దీ కుమ్మరించాక ఇంకా మన గురించి మనం ఆలోచించే ధైర్యం ఎక్కడిది, ఓపిక ఎక్కడిది, ఎదురు తిరిగే శక్తి ఎక్కడిది.

చట్టాల దారి చట్టాలదే!

దీర్ఘకాల స్వాతంత్ర ఉద్యమం అందులో అంతర్భాగంగా సాగిన మహిళా ఉద్యమం ఫలితంగా కొన్ని చట్టాలు అయితే వచ్చాయి. హిందూ వివాహ చట్టం, బాల్య వివాహ నిరోధ చట్టం, భారత శిక్షా స్మృతిలో వరకట్న మరణానికి సంబంధించిన కొన్ని సవరణలు వంటివి వచ్చాయి. ఎన్ని చట్టాలు ఉన్నా స్త్రీ ధర్మాలు సాంప్రదాయాల పేరుతో స్త్రీలను లొంగదీసే భావాలు భావోద్వేగాలకు కొరవలేదు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు మహిళా లోకం రుణపడి ఉంటుంది. మనుధర్మ శాస్త్రాన్ని అందుకే దగ్ధం చేశాడేమో. ■



నేల సగం - నింగి సగం.. మహిళదే. కానీ అవకాశాల్లోనే సుదూరంగా వుంది. ఇక హింస గురించి ఎంత చెప్పకున్నా తక్కువే. అన్ని రంగాల్లో తన శక్తియుక్తులను చాటుకుంటున్నా హింసను భరిస్తూనే ఉన్నది. నేడు మహిళలపై హింసా నిర్మూలన దినం సందర్భంగా నేటి సమాజంలో స్త్రీల స్థితిగతులపై మహిళా ఉద్యమ నేతల అధ్యయనం...



మహిళలపై హింస మానవ హక్కుల ఉల్లంఘన

- కొండవీటి సత్యవతి

ప్రతి ఏడాది నవంబర్ నెలలో 14 తేదీ నుండి పిల్లల హక్కుల క్యాంపెయిన్ జరుగుతుంది. నవంబర్‌లోనే ట్రాన్స్ జెండర్ మృతులను జ్ఞాపకం చేసుకునే రోజు జరుపుకుంటాం. నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 అంతర్జాతీయ మానవ హక్కుల దినం వరకు 16 రోజులపాటు స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా అనేక అవగాహనా సదస్సులు, కార్యక్రమాలు జరుగుతాయి. ప్రతి సంవత్సరం ఒక నినాదంతో ఈ ప్రదర్శనలు జరుతాయి. ఈ ఏడాది నినాదం "Towards Beijing +30: UNiTE to End Violence Against Women and Girls"గా యూ.ఎన్ పేర్కొన్నది. 16 రోజుల ఏక్టివిజం రావడానికి ముగ్గురు మహిళల పోరాటం, ఆత్మ త్యాగం ముఖ్యమైనవి.

1960లో డొమినికన్ రాజ్యంలో పాట్రియా, మినెర్వా, మారియా అనే పేర్లతో అక్కచెల్లెళ్ళు ఆ దేశ నియంత మీద పోరాటం చేసి ధైర్యంగా నిలబడినప్పుడు రాజు వారిని హత్య చేయించాడు. ఆ తర్వాత వారు ముగ్గురూ 'మీరా బెల్ సోదరీమణులు'గ ప్రాచుర్యం పొందారు. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా మహిళలపై హింసకు ప్రతీకగా నిలిచింది. 1999లో ఐక్య రాజ్య సమితి ఈ రోజు అధికారికంగా గుర్తించి మహిళలపై హింసకు వ్యతిరేక దినంగా ప్రకటించి ఒక థీంతో జరుపుతోంది. ఈ పదహారు రోజులూ మహిళలకు వివిధ కార్యక్రమాలతో అవగాహన కల్పిస్తుంటారు.

అవగాహన పెంచాలి

ప్రపంచవ్యాప్తంగా ఈ నాడు నెలకొన్న భయానక వాతావరణం, యుద్ధాలు, పెట్రేగిపోతున్న మతోన్మాద శక్తులు స్త్రీల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. గ్రామ స్థాయి నుంచి గ్లోబల్ స్థాయి వరకు ఎలాంటి తేడాలు లేకుండా హింస స్త్రీల జీవితాలను అతలాకుతలం చేస్తుంది. ఇంట్లో కుటుంబ హింస, పనిచేసే చోట లైంగిక వేధింపులు, పబ్లిక్ స్థలాల్లో లైంగిక దాడులు పెచ్చుమీరిపోతున్నాయి. స్త్రీలకు, పిల్లలకు రక్షణ లేని పరిస్థితులు పెరిగిపోతున్నాయి. ఈ హింసలను ఎదుర్కోవడానికి భారత ప్రభుత్వం ఎన్నో రక్షణ చట్టాలను చేసింది. గృహహింస నిరోధక చట్టం 2005, పనిచేసే చోట లైంగిక వేధింపుల నిషేద చట్టం 2013, పిల్లల మీద లైంగిక దాడుల నిసేధ చట్టం 2012... ఇలా ఎన్నో చట్టాలు వచ్చాయి. అయినా ఎందుకు హింస తగ్గడం లేదు అనేది తప్పకుండా ఆలోచించాల్సిన అంశం. ఈ చట్టాల అమలు తీరు పేలవంగా ఉండడం, నేరాలకు సరైన శిక్షలు సకాలంలో పడకపోవడం ముఖ్య కారణాలు. ఉదాహరణకి గృహ హింస నిరోధక చట్టంలో కేసు తీర్పు 60 రోజుల్లో రావాలి. కానీ ఆరేండ్లకు కూడా రాని పరిస్థితి. న్యాయ స్థానాల్లో కేసులు పేరుకుపోవడం తప్ప స్త్రీలకు ఎలాంటి న్యాయమూ జరగకపోవడం వల్ల హింసలో మగ్గుతున్న స్త్రీలకు ఎలాంటి వెసులుబాటు దొరకడం లేదు.

పోరాటమే ఆయుధం

అన్ని రంగాల్లోను బలంగా వేళ్ళూనుకునిపోయిన పితృస్వామ్యం స్త్రీలకు ఎలాంటి న్యాయమూ అందనివ్వడం లేదు. స్త్రీలపై హింస తగ్గాలంటే అన్ని చట్టాలను కఠినంగా అమలుచెయ్యాలి. నేరానికి తగిన శిక్షలను విధించి అమలు చెయ్యాలి. తమ కోసం అమలులో ఉన్న చట్టాల గురించి మహిళలకు పెద్ద ఎత్తున అవగాహన కలిగించాలి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనేక సపోర్ట్ సిస్టమ్‌ల గురించి పెద్ద ఎత్తున ప్రచారం చెయ్యాలి. అంటే పల్స్ పోలియో గురించి ఏ స్థాయిలో ప్రచారం చేసి అవగాహన కలిగించారో ఆ స్థాయిలో చట్టాల గురించి, సహాయ సంస్థల గురించి ప్రచారం చెయ్యాలి. 181 హెల్ప్‌లైన్ ఉందని, భూమిక హెల్ప్‌లైన్‌కి ఫోన్ చేసి మీ సమస్యలు చెప్పుకోండని, సఖి సెంటర్‌లు మీ కోసమే ఉన్నాయి, వచ్చి మీ సమస్యలను పంచుకోండి లాంటి క్యాంపెయిన్స్ పెద్ద ఎత్తున చేపట్టి హింసలో నలుగుతున్న మహిళలకు అండగా ఉంటే వారిపై జరుగుతున్న హింస కొంతవరకైనా తగ్గే అవకాశం ఉంది. కుటుంబం, సమాజం, రాజకీయ నాయకులు స్త్రీల మీద హింసను వారి మానవ హక్కుల ఉల్లంఘనగా అర్థం చేసుకుని దానికి తగిన ఆచరణకు సిద్ధమైనప్పుడు స్త్రీలపై హింస అంతమౌతుంది. అంతవరకు పోరాటమే ఆయుధం. ■



కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం

(మొదటిపేజీ తరువాయి)

కందాల ప్రమీల, సీనియర్ నాయకులు బోళ్ల నర్సింహారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ చిన్న వెంకులు, మండల కార్యదర్శి చింతపల్లి లూర్దు మారయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోదానీ దోస్తానా !

(మొదటిపేజీ తరువాయి)

పార్టీకి చెందిన సంజయ్ సింగ్ గళం విప్పారు. ప్రతిపక్ష పార్టీలు 'మోదానీ' అంటూ గగ్గోలు పెడుతుంటే మోడీ ప్రభుత్వం ఏ విధంగా స్పందించింది? పార్లమెంటులో చర్చకు నిరాకరించింది. మోడీ, అదానీ మధ్య సంబంధాలపై ప్రతిపక్షాలు చేసిన తీవ్రమైన వ్యాఖ్యలను రికార్డుల నుండి తొలగించింది. ఇరువురి మధ్య సంబంధాలపై కథనాలు రాసిన పాత్రికేయులను వెంటాడింది. మోడీ, అదానీ మధ్య సంబంధాలను బట్టబయలు చేసినందుకే రాహుల్, మొయిత్రాలను లోక్‌సభ సభ్యత్వాలకు అనర్హులుగా ప్రకటించారని ప్రతిపక్షాలు మండిపడ్డాయి. తప్పుడు పనులు, చట్ట ఉల్లంఘనలకు సంబంధించి నిర్దిష్ట ఆధారాలు అందిస్తూ అదానీ వ్యవహారాలపై కాంగ్రెస్ వంద ప్రశ్నలు సంధిస్తే ప్రభుత్వం దున్నపోతు మీద వాన పడిన చందంగా వ్యవహరించి, విచారణకు సిద్ధపడలేదు. సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ జరిపించాలని డిమాండ్ వచ్చినప్పటికీ దానిని ప్రభుత్వం తోసిపుచ్చింది. దీంతో ఈ వ్యవహారం వెనుక ఏదో రహస్యం దాగి ఉందన్న అనుమానాలు పెరిగాయి. ఆరోపణలపై స్పందించేందుకు మోడీ ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు. ప్రభుత్వం నిస్పాక్షిక విచారణకు ఆదేశించలేదు సరికదా కనీసం పార్లమెంటులో చర్చకు కూడా అనుమతించలేదు. కొన్ని కేసుల్లో కేంద్ర సంస్థలు చేపట్టిన దర్యాప్తులు నత్తనడక నడిచాయి.

ఎదురు దెబ్బలు

అదానీకి పవన విద్యుత్ ప్రాజెక్టును అప్పగించాల్సిందిగా మోడీ తమ దేశాధ్యక్షుడిపై ఒత్తిడి తెచ్చారని శ్రీలంక అధికారి ఒకరు పార్లమెంటరీ కమిటీ ఎదుట వాంగ్మూలం ఇచ్చారు. అయితే అందుకు మోడీ ఎలాంటి రాజకీయ మూల్యం చెల్లించుకోలేదు. అదానీతో కుదుర్చుకున్న ఒప్పందాలన్నింటినీ కెన్యా రద్దు చేసుకుంది. అదానీని తమకు మోడీయే పరిచయం చేశారని కెన్యా ప్రభుత్వం అంగీకరించింది కూడా. బంగ్లాదేశ్‌లో విద్యుత్ సరఫరా కాంట్రాక్టుపై పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగాయి. విద్యుత్ ప్లాంటు నెలకొల్పిన జార్ఖండ్‌లోనూ అదే పరిస్థితి. ఇజ్రాయిల్‌తో అదానీ కుదుర్చుకున్న రక్షణ కాంట్రాక్ట్ ఓ ఫార్స్ అని, భారత్‌లో ఉత్పత్తులే జరగడం లేదని కాంగ్రెస్ చెబుతోంది. ఇండొనేషియా నుండి బొగ్గు కొనుగోలు విషయంలో ఇన్వాయిస్ ధరను అధికంగా చూపారంటూ పెద్ద ఎత్తున అలజడి చెలరేగినప్పటికీ విచారణ జరపలేదు. తాజాగా అమెరికా ప్రాసిక్యూటర్లు అదానీపై అవినీతి, మోసం ఆరోపణలు మోపుతూ న్యూయార్క్ కోర్టులో కేసు వేశారు.

అదానీ ముడుపులపై దర్యాప్తు చేపట్టాలి

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి ఈఏఎస్ శర్మ లేఖ

విశాఖపట్నం : సెకీ నుంచి విద్యుత్తు ఒప్పందాలు చేసుకునేందుకు గౌతమ్ అదానీ భారీ ముడుపులు చెల్లించడంపై దర్యాప్తు చేపట్టాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రి మంత్రి నిర్మలా సీతారామన్‌కు భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ లేఖ రాశారు. అదానీపై అమెరికా కోర్టు కేసు నమోదు కేంద్ర ప్రభుత్వం, సెబీ సహా ఇతర ప్రభుత్వ సంస్థల వైఫల్యాన్ని సూచిస్తోందని పేర్కొన్నారు. భారత వ్యాపారవేత్త అదానీ, ఆయన మేనల్లుడు సాగర్‌తోపాటు మరో ఆరుగురిపై మోసం, లంచం ఆరోపణలపై అమెరికా కోర్టులో కేసు నమోదైన నేపథ్యంలో శనివారం రాసిన లేఖలో లేవనెత్తిన అంశాలు ఇలా ఉన్నాయి. 'అమెరికా డిస్ట్రిక్ట్ కోర్టు, ఎస్ఈసీ రెండూ కూడా అమెరికాలో న్యాయవ్యవస్థకు చెందినవి కావడం, రెండోది సెబీ భారత్‌లో అత్యుత్తమ సంస్థ కావడంతో మీరు, మీ సహోద్యోగులు ఎప్పటిలానే వారి అభియోగాలు, నేరారోపణలను పక్కన పెట్టలేరు. అమెరికా, భారత్‌లో ఎఫ్‌బీఐ నిష్పక్షపాతంతో దర్యాప్తు చేపట్టాలి. అదానీపై అభియోగాలను తిరస్కరించడం, రక్షించడంతో మీ శాఖ దేశీయ పెట్టుబడిదారుల, ప్రజల ప్రయోజనాలను దెబ్బతీయడమే కాకుండా మీ శాఖ వివరించలేని నిశ్చలత స్థితికి పడిపోయింది. అదానీ అంశం కేంద్ర, రాష్ట్ర సంస్థల విచ్ఛిన్నంపై తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తుతోంది. ఇది దేశ ప్రజలను మోసగించడం, మిలియన్ల మంది విద్యుత్ వినియోగదారుల ప్రయోజనాలను దెబ్బతీయడమే.

ముగ్గురు ముస్లిం యువకుల బలి

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో జామా మసీదు సర్వే హింసాత్మకంగా మారింది. సర్వేను తీవ్రంగా వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున గుమిగూడారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో పోలీసులు బాష్పవాయువు, ప్లాస్టిక్ బుల్లెట్లు ప్రయోగించడంతో ముగ్గురు ముస్లిం యువకులు ప్రాణాలు కోల్పోయారని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. మొరాదాబాద్ డివిజనల్ కమిషనర్ అనన్య కుమార్ మాట్లాడుతూ "ఘర్షణ సమయంలో నయీమ్, బిలాల్, నిమన్ చనిపోయారు. అధికారులతో సహా 20 నుంచి 22 మంది పోలీసులకు గాయాలయ్యాయి. గాయపడిన అధికారుల్లో సంభాల్ సీఓ, సంభాల్ ఎస్పీ పీఆర్‌ఓ, ఒక ఎస్‌డీఎం ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు మహిళలతో సహా 15 మందిని అదుపులోకి తీసుకున్నారు" అని డివిజనల్ కమిషనర్ చెప్పారు. "మొఘల్ కాలం నాటి జామా మసీదును అడ్వకేట్ కమిషనర్ నేతృత్వంలోని బృందం రెండో సారి సర్వే చేయటానికి వచ్చింది. ఆదివారం ఉదయం సర్వే మొదలు పెడుతుండగా.. మసీదు ప్రాంతం వద్ద స్థానికులు అధిక సంఖ్యలో గుమిగూడారు. సర్వేను వారు వ్యతిరేకించారు. మసీదులోకి అధికారులు రాకుండా అడ్డుకున్నారు. స్థానికులు మాపై రాళ్లు విసిరారు. పదికి పైగా వాహనాలకు నిప్పు పెట్టారు" అని పోలీసులు తెలిపారు. సర్వేను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున చేరుకున్న గుంపును చెదరగొట్టటానికి పోలీసులు భాష్ప వాయువును ప్రయోగించారు. ఇక్కడ చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.



మొఘలుల కాలంలో మసీదు నిర్మించారని, ఆ ప్రాంతంలో హరిహర టెంపుల్ ఉన్నదని స్థానిక కోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. దీనిపై గత మంగళవారం సర్వే నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించిన కొద్ది గంటల్లోనే హడావిడిగా మసీదును అధికారులు సర్వే చేశారు. అప్పటి నుంచి అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొన్నది. తాజాగా, ఫొటోలు, వీడియోలు తీసేందుకు రెండోసారి కూడా సర్వేకు అధికారులు రావటంతో హింసాత్మక పరిస్థితులు చోటు చేసుకున్నాయి. కొందరు దుండగులు పోలీసుల పైకి రాళ్లు విసిరారనీ, దీంతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావటానికి పోలీసులు బాష్పవాయువును ప్రయోగించి, కొంత వరకు బల ప్రయోగం చేశారని జిల్లా ఎస్పీ కృష్ణ కుమార్ విష్ణోయ్ తెలిపారు. రాళ్లు విసిరినవారినీ, ప్రేరేపించినవారిని గుర్తించామనీ.. వారిపై చర్యలుంటాయని చెప్పారు. అక్కడ పరిస్థితి అదుపులోనే ఉన్నదని సంభాల్ ఘటనపై యూపీ డీజీపీ ప్రశాంత్ కుమార్, జిల్లా మేజిస్ట్రేటు రాజేంద్ర పేసియా చెప్పారు. సర్వే నివేదికను ఈనెల 29న న్యాయస్థానానికి అందించనున్నట్టు సమాచారం.

ఎన్నికల్లో అవకతవకల నుంచి దృష్టి మరల్చేందుకే బీజేపీ హింస : ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ విమర్శ

తాజా ఘటనపై ఉత్తర ప్రదేశ్‌లోని ప్రధాన ప్రతిపక్షం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) చీఫ్ అఖిలేశ్ యాదవ్ స్పందించారు. ఎన్నికల్లో అవకతవకల ఆరోపణల నుంచి దృష్టి మళ్లించేందుకే బీజేపీ ఈ హింసను ప్రేరేపించిందని ఆయన విమర్శించారు. ఎన్నికల గురించి చర్చ జరగకుండా అంతరాయాన్ని కలిగించేందుకు ఉద్దేశపూర్వకంగానే సర్వే టీమ్‌ను ఆదివారం ఉదయం అక్కడికి పంపించారని పేర్కొన్నారు. ఈ మేరకు సంభాల్ ఘటనకు సంబంధించిన ఒక వీడియోను ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. బీజేపీ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది.

తెలంగాణ విముక్తికి మరో ఉద్యమం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి తెలంగాణను విముక్తి చేయడానికి మరో ఉద్యమం చేపట్టాల్సిన అవసరముందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివార హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామరక్ష అని ప్రొఫెసర్ జయశంకర్ చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకుని పోరాటాలకు సిద్ధం కావాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని వ్యాఖ్యానించారు. "సమైక్య రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ పాలనలో ప్రతి వర్గం, ప్రతి మనిషి బతుకు చిద్రమైన పరిస్థితి. మళ్లీ ఈ రోజు రాష్ట్రంలో ఆ పరిస్థితులు కనబడుతున్నాయి. అదే నిర్బంధం, అదే అణిచివేత, అవే దుర్భర పరిస్థితులు, ఆందోళనకరమైన వాతావరణం. నాడు ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన కేసీఆర్ స్ఫూర్తితో నేడు మళ్లీ ఢిల్లీలోని పార్టీల మెడలు వంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే తెలంగాణలో బతుకు అంధకారమైందని రైతులు, ఆటో కార్మికులు, నిర్మాణ రంగంలో ఉండే కూలీలు అట్టడుగు స్థాయి నుంచి సంపన్న వర్గాల వరకు అందరూ బాధపడుతున్నారు" అని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని కొంతమంది బీరాలు పలుకుతున్నారని విమర్శించారు. అలాంటి వారు ఒక సారి చరిత్ర పుటలను తిరగేసి చూడాలని హితవు పలికారు. "60 ఏండ్ల తెలంగాణ ఉద్యమంపై కేసీఆర్ చెరిగిపోని సంతకం చేశారు. 2009 నవంబర్ 29న దీక్ష చేపట్టారు. 'కేసీఆర్ సచ్చుడో...తెలంగాణ వచ్చుడో' అన్న మాట దేశ రాజకీయాలను కదిలించింది. ఉద్యమంలో ఉన్న నిర్బంధాలు ఇప్పుడు మళ్లీ కనిపిస్తున్నాయి. వాటిని ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలి" అని కేటీఆర్ పిలుపు నిచ్చారు. దీక్షా దివస్‌ను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రకటించారు. ఈ నెల 29న రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో, పార్టీ కార్యాలయాల్లో దీక్షా దివస్ ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వాటిని విజయవంతం చేసేందుకు పార్టీలోని సీనియర్ నాయకులకు జిల్లాల వారీగా బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు. దీక్షా దివస్ చివరి రోజు డిసెంబర్ 9న మేడ్చల్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణతో కార్యక్రమాన్ని ముగించనున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలందరూ పాల్గొంటారని కేటీఆర్ తెలిపారు.



నిమ్స్‌లో అన్నదానం

"మలిదశ తెలంగాణ ఉద్యమంలో నిమ్స్ హాస్పిటల్ పాత్ర ఎంతో ఘనమైనది. నాడు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిమ్స్‌కు తరలించడం జరిగింది. దీక్ష ముగిసే వరకు ఉద్యమానికి కేరాఫ్‌గా నిమ్స్ నిలిచింది. స్వరాష్ట్ర ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారిన పాత జ్ఞాపకాలను స్ఫూర్తిగా తీసుకుంటూ నవంబర్ 29న నిమ్స్ ఆస్పత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తాం. రోగులకు పండ్లు, బట్టలు పంచుతాం" అని కేటీఆర్ తెలిపారు.

అదానీపై జేపీసీ వేయాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించనున్నట్టు కేంద్రం వెల్లడించింది. మరోవైపు వక్ఫ్‌సవరణ బిల్లుపై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఈ నెల 29న తన నివేదికను పార్లమెంట్ కు సమర్పించే అవకాశం ఉంది. అలాగే వక్ఫ్‌బిల్లుతో సహా మొత్తం 16 బిల్లులను ఆమోదించుకునేందుకు జాబితా చేసింది.

పార్టీ ఫిరాయింపుల నిరోధక బిల్లు తీసుకురావాలి : కెఆర్ సురేష్ రెడ్డి (బీఆర్ఎస్)

ప్రభుత్వం తెచ్చే 16 బిల్లులతో పాటు "పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం సవరణ బిల్లు"ను కూడా తీసుకురావాలని బీఆర్ఎస్ ఎంపీ కెఆర్ సురేష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం అఖిల పక్ష సమాశానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులే కాదు, ప్రయివేట్ మెంబర్ బిల్లులపై కూడా పార్లమెంట్ లో సమగ్రంగా చర్చ జరగాలని కోరారు. కోర్టులపై ఇప్పటికే కేసుల ఒత్తిడి ఎక్కువగా ఉందని, పార్లమెంట్ పరిధిలోని అంశాలను కోర్టులకు తీసుకువెళ్లకుండా చట్టసభల్లోనే పరిష్కరించాలని కోరారు. "వక్ఫ్ చట్ట సవరణ బిల్లు మైనారిటీలకు వ్యతిరేకంగా ఉంటే తాము వ్యతిరేకిస్తామని అన్నారు. సమాజంలో విభజన, విభేదాలకు దారితీసే చర్యలను తాము సమర్థించమని పేర్కొన్నారు. విభజన చట్టం హామీలు పదేండ్లయినా పూర్తిగా అమలు కాలేదని, కాబట్టి ఇందులో సవరణలు చేస్తూ బిల్లు తీసుకురావాలని అన్నారు. సేకరణ చట్టానికి వ్యతిరేకంగా ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. "గిరిజన-ఆదివాసీ, దళితుల" భూములను సేకరిస్తోందని విమర్శించారు. ఈ అంశాలన్నింటినీ పార్లమెంటులో ప్రస్తావిస్తామని, చర్చకు పట్టుపడతామని అన్నారు.

లేటరల్ ఎంట్రీ ఉద్యోగాల భర్తీపై పార్లమెంటరీ కమిటీ

లేటరల్ ఎంట్రీతో ఉద్యోగాల భర్తీ సమస్యను పరిశీలించడానికి పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ శాఖల్లోని కీలక పోస్టుల భర్తీకి సంబంధించి ఈ ఏడాది ప్రారంభంలో రాజకీయ దుమారం రేపిన అంశాన్ని పార్లమెంటరీ కమిటీ పరిశీలించనుంది. లోక్‌సభ సెక్రెటేరియట్ వెల్లడించిన వివరాల ప్రకారం 2024-25లో పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, లా అండ్ జస్టిస్‌పై డిపార్ట్‌మెంట్ సంబంధిత పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఎంపిక చేసిన సబ్జెక్టులలో సివిల్ సర్వీసెస్‌లో లేటరల్ ఎంట్రీ ఒకటి ఉంది. ఈ ఏడాది ఆగస్టులో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీపీఎస్సీ) కాంట్రాక్ట్ ప్రాతిపదికన లేటరల్ ఎంట్రీ మోడ్ ద్వారా భర్తీ చేయడానికి 45 పోస్టులను (10 జాయింట్ సెక్రెటరీలు, 35 డైరెక్టర్లు, డిప్యూటీ సెక్రెటరీల) ప్రకటన చేసింది. ఈ ప్రకటన ప్రతిపక్షాలతో పాటు లోక్ జనశక్తి పార్టీ (జేఎల్‌పీ), జేడీయూ వంటి ఎన్‌డీఏ మిత్రపక్షాల నుండి వ్యతిరేకత వ్యక్తం అయింది. సీపీఐ(ఎం)తో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్‌జేడీ తేజస్వీ యాదవ్‌లతో సహా పలువురు నాయకులు షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ), ఓబీసీ రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తుందని ధ్వజమెత్తారు. దీంతో ప్రభుత్వం తన ప్రకటనను రద్దు చేయాలని యూపీపీఎస్సీని కోరింది. బ్యూరోక్రాట్‌లు సాధారణంగా సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్ ప్రాసెస్ ద్వారా రిక్రూట్ చేయబడతారు. అయితే లేటరల్ ఎంట్రీ నియామకాలకు రిజర్వేషన్ కోటా వర్తించదు. ఇప్పటివరకు, 63 నియామకాలు లేటరల్ ఎంట్రీ ద్వారా జరిగాయి. వాటిలో 35 నియామకాలు ప్రయివేట్ రంగం నుంచి ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం ప్రస్తుతం 57 మంది అధికారులు మంత్రిత్వ శాఖలు/విభాగాల్లో పదవుల్లో ఉన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2018లో ఈ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు.

శాసనసభాపక్ష నేతగా హేమంత్ సోరెన్

(మొదటిపేజీ తరువాయి)

అప్పగించారన్నారు. అంతకు ముందు ఇండియా బ్లాక్ నేతల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయనను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు మద్దతు ప్రకటించారన్నారు. హేమంత్ సోరెన్‌ను జార్ఖండ్ శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారని కాంగ్రెస్ నాయకుడు సుబోధ్‌కాంత్ సహాయ్ తెలిపారు. ఆయన 28న సీఎంగా ప్రమాణం చేసే అవకాశం ఉన్నది. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో హేమంత్ సోరెన్ నేతృత్వంలోని ఇండియా ఫోరం మూడింట రెండొంతుల మెజారిటీ సాధించింది. 81 స్థానాలకు జరిగిన ఈ ఎన్నికల్లో ఫోరం 56 స్థానాలు గెలిచింది. ప్రతిపక్ష బీజేపీకి కేవలం 24 సీట్లే దక్కాయి.



కింగ్, ప్రిన్స్ శతక మోత



పెర్త్‌లో భారత బ్యాటర్లు పరుగుల పండుగ చేసుకున్నారు. కింగ్ విరాట్ కోహ్లి (100 నాటౌట్) అజేయ సెంచరీతో మెరువగా.. ప్రిన్స్ యశస్వి జైస్వాల్ (161) మరో భారీ సెంచరీతో అదరగొట్టాడు. జైస్వాల్, విరాట్ శతక మోతతో భారత్ రెండో ఇన్నింగ్స్‌ను 487/6 వద్ద డిక్లరేషన్ ఇచ్చింది. ఆస్ట్రేలియాకు 534 పరుగుల రికార్డు లక్ష్యాన్ని నిర్దేశించింది. పేసర్లు బుమ్రా, సిరాజ్‌లు నిప్పులు చెరగటంతో ఆసీస్ అప్పుడే 3 వికెట్లు కోల్పోయింది. నేడు నాల్గో రోజు ఆటలోనే లాంఛనం ముగించేందుకు బుమ్రాసేన రంగం సిద్ధం చేసుకుంది.

- యశస్వి 161, కోహ్లి 100
- పెర్త్ టెస్టులో గెలుపు ముంగిట భారత్
- భారత్ రెండో ఇన్నింగ్స్ 487/6 డిక్లేర్డ్
- ఆసీస్ లక్ష్యం 534, ప్రస్తుతం 12/3

భారత్, ఆసీస్ తొలి టెస్టు మూడో రోజు

నవతెలంగాణ-పెర్త్

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టులో టీమ్ ఇండియా విజయం ముంగిట నిలిచింది. 534 పరుగుల రికార్డు ఛేదనలో ఆతిథ్య ఆస్ట్రేలియా 4.2 ఓవర్లలో 12/3తో పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. పేసర్లు జశ్‌ప్రీత్ బుమ్రా (2/1), మహ్మద్ సిరాజ్ (1/7) ఆసీస్ బ్యాటర్లను వణికించారు. ఆసీస్ విజయానికి మరో 522 పరుగులు అవసరం కాగా.. భారత్ విజయానికి ఏడు వికెట్ల దూరంలో నిలిచింది. అంతకుముందు.. భారత క్రికెట్ కింగ్, ప్రిన్స్ శతక మోత మోగించారు. యశస్వి జైస్వాల్ (161, 297 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (100 నాటౌట్, 143 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలతో కదం తొక్కారు. కెఎల్ రాహుల్ (77, 176 బంతుల్లో 5 ఫోర్లు) అర్థ సెంచరీతో మెరువగా.. నితీశ్ కుమార్ రెడ్డి (38 నాటౌట్, 27 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), వాషింగ్టన్ సుందర్ (29, 94 బంతుల్లో 1 సిక్స్), దేవదత్ పడిక్కల్ (25, 71 బంతుల్లో 2 ఫోర్లు) రాణించారు. 134.3 ఓవర్లలో 487/6 పరుగుల వద్ద భారత్ రెండో ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్ ప్రకటించింది. నేడు నాల్గో రోజు ఆటలో టీమ్ ఇండియా గెలుపు లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.

యశస్వి అదరగొట్టాడు

ఓవర్‌నైట్ స్కోరు 172/0తో మూడో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన భారత్.. ఓపెనర్ల మెరుపులతో పెర్త్ టెస్టుపై తిరుగులేని పట్టు సాధించింది. యశస్వి జైస్వాల్ కాస్త దూకుడు పెంచి ఆడగా.. రాహుల్ తనదైన శైలిలోనే పరుగులు పిండుకున్నాడు. 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 205 బంతుల్లో సెంచరీ సాధించాడు. సచిన్ టెండూల్కర్ తర్వాత ఆసీస్ గడ్డపై తొలి టెస్టులోనే శతకం సాధించిన అతి పిన్న వయస్కుడిగా యశస్వి నిలిచాడు. సెంచరీ అనంతరం జోరు పెంచిన జైస్వాల్.. మరో 70 బంతుల్లోనే 150 మార్క్ చేరుకున్నాడు. ద్వి శతకం ఊరిస్తుండగా సహనం కోల్పోయిన జైస్వాల్.. ఆసీస్ పార్ట్‌టైమ్ పేసర్ మార్ష్‌కు వికెట్ కోల్పోయాడు. రాహుల్ 77 పరుగుల వద్ద వికెట్ కోల్పోయాడు. దీంతో 201 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తొలి సెషన్లో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయిన భారత్.. రెండో సెషన్లో నాలుగు వికెట్లు చేజార్చుకుంది. పడిక్కల్ కాసేపు క్రీజులో నిలిచినా.. నిలకడగా ఆడలేదు. 275/1తో పటిష్టంగా కనిపించిన భారత్.. రిషబ్ పంత్ (1), ధ్రువ్ జురెల్ (1) సహా జైస్వాల్ వికెట్లతో 321/6కి పరిమితమైంది. చివరి నాలుగు వికెట్లను ఆసీస్ పడగొడుతుందనే అనిపించింది.

కింగ్ కోహ్లి కొట్టేశాడు

కొంతకాలంగా అంచనాలను అందుకోలేకపోతున్న విరాట్ కోహ్లి.. అచ్చొచ్చిన ప్రత్యర్థి ఆసీస్‌పై శతకంతో చెలరేగాడు. లంచ్ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన కోహ్లి మరో ఎండ్‌లో వికెట్లు పడుతున్నా సహనంగా ఆడాడు. వాషింగ్టన్ సుందర్ (29) జతగా కోహ్లి కీలక భాగస్వామ్యం నమోదు చేశాడు. వికెట్ల పతనం అడ్డుకున్న ఈ జోడీ 176 బంతుల్లో 89 పరుగులు జోడించింది. లయాన్ ఓవర్లో భారీ షాట్‌కు వెళ్లిన సుందర్ వికెట్ కోల్పోయాడు. క్రీజులోకి కోహ్లికి జతకలిసిన తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డి (38 నాటౌట్) ధనాధన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. వచ్చీ రాగానే సిక్సర్ బాదిన నితీశ్ కుమార్..ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు. మూడు ఫోర్లు, రెండు సిక్సర్లు కొట్టిన నితీశ్ 27 బంతుల్లోనే 38 పరుగులు చేశాడు. లబుషేన్ ఓవర్లో స్వీప్ షాట్‌తో బౌండరీ బాదిన విరాట్ కోహ్లి 'వంద' అభివాదం చేశాడు. 8 ఫోర్లు, 2 సిక్సర్లు కొట్టిన విరాట్ కోహ్లి ఆసీస్ బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్నాడు. అవుట్‌ఫీల్డ్ మరీ నెమ్మదిగా ఉండటంతో భారత్ విలువైన పరుగులను కోల్పోయింది. నితీశ్, కోహ్లి జోడీ 54 బంతుల్లోనే 77 పరుగులు జోడించారు. దీంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 487/6 పరుగులు చేసింది. ఆధిక్యం 533 పరుగులు ఉండటంతో.. కోహ్లి సెంచరీ సాధించగానే బుమ్రా భారత ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్ ప్రకటించాడు. ఆసీస్ బౌలర్లలో స్పిన్నర్ నాథన్ లయాన్ (2/96) రెండు వికెట్లు పడగొట్టగా.. స్టార్క్, కమిన్స్, హాజిల్‌వుడ్, మార్ష్‌లు తలా ఓ వికెట్ పడగొట్టారు. హాజిల్‌వుడ్ ఇన్నింగ్స్ ఆసాంతం మెరుపు బంతులు సంధించినా వికెట్ల వేటలో సఫలం కాలేదు.



బుమ్రా నిప్పులు

మూడో రోజు ఆఖర్లో ఛేదనకు వచ్చిన ఆస్ట్రేలియాకు పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా పీడకల మిగిల్చాడు. రెండో ఇన్నింగ్స్‌లో 4.2 ఓవర్లలోనే ఆసీస్ మూడు వికెట్లు చేజార్చుకుంది. ఇన్నింగ్స్ నాల్గో బంతికే యువ ఓపెనర్ నాథన్ మెక్‌స్వీనీ (0)ను డకౌట్ చేసిన బుమ్రా.. మార్నస్ లబుషేన్ (3)ను సైతం వికెట్ల ముందు అవుట్ చేశాడు. నైట్ వాచ్‌మెన్ పాట్ కమిన్స్ (2)ను సిరాజ్ స్లిప్స్‌లో క్యాచౌట్‌గా వెనక్కి పంపించాడు. 534 పరుగుల రికార్డు ఛేదనలో కంగారూలు 12 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయింది. ఆసీస్‌కు మరో 522 పరుగులు అవసరం కాగా.. టీమ్ ఇండియా విజయానికి మరో 7 వికెట్ల దూరంలో నిలిచింది.

స్కోరు వివరాలు :

భారత్ తొలి ఇన్నింగ్స్ : 150/10

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 104/10

భారత్ రెండో ఇన్నింగ్స్ : జైస్వాల్ (సి) స్మిత్ (బి) మార్ష్ 161, రాహుల్ (సి) కేరీ (బి) స్టార్క్ 77, దేవదత్ పడిక్కల్ (సి) కేరీ (బి) హాజిల్‌వుడ్ 25, విరాట్ కోహ్లి నాటౌట్ 100, రిషబ్ పంత్ (స్టంప్డ్) కేరీ (బి) లయాన్ 1, ధ్రువ్ జురెల్ (ఎల్బీ) కమిన్స్ 1, వాషింగ్టన్ సుందర్ (బి) లయాన్ 29, నితీశ్ కుమార్ రెడ్డి నాటౌట్ 38, ఎక్స్‌ట్రాలు : 55, **మొత్తం : (134.3 ఓవర్లలో 6 వికెట్లకు) 487 డిక్లేర్డ్.**

వికెట్ల పతనం : 1-201, 2-275, 3-313, 4-320, 5-321, 6-410.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 26-2-111-1, జోశ్ హాజిల్‌వుడ్ 21-9-28-1, పాట్ కమిన్స్ 25-5-86-1, మిచెల్ మార్ష్ 12-0-65-1, నాథన్ లయాన్ 39-5-96-2, లబుషేన్ 6.3-0-38-0, ట్రావిశ్ హెడ్ 5-0-26-0.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : మెక్‌స్వీనీ (ఎల్బీ) బుమ్రా 0, ఉస్మాన్ ఖవాజా నాటౌట్ 3, పాట్ కమిన్స్ (సి) కోహ్లి (బి) సిరాజ్ 2, మార్నస్ లబుషేన్ (ఎల్బీ) బుమ్రా 3, ఎక్స్‌ట్రాలు : 4, **మొత్తం : (4.2 ఓవర్లలో 3 వికెట్లకు) 12.**

వికెట్ల పతనం : 1-0, 2-9, 3-12.

బౌలింగ్ : జశ్‌ప్రీత్ బుమ్రా 2.2-1-1-2, మహ్మద్ సిరాజ్ 2-0-7-1

పంత్ @ 27 కోట్లు

ఐపీఎల్ వేలంలో రిషబ్ పంత్‌కు రికార్డు ధర

శ్రేయస్‌కు రూ.26.75 కోట్లు, అయ్యర్‌కు రూ.23.75 కోట్లు







నవతెలంగాణ-జెడ్డా

ఐపీఎల్ 2008 ఆటగాళ్ల వేలంలో వికెట్ కీపర్ బ్యాటర్ ఎం.ఎస్ ధోని రికార్డు ధరతో చరిత్ర సృష్టించిన సన్నివేశం 2024 ఆటగాళ్ల మెగా వేలంలో పునరావృతం అయ్యింది. యువ ఆటగాడు రిషబ్ పంత్ ఐపీఎల్ వేలం చరిత్రలోనే అత్యధిక ధర సొంతం చేసుకున్నాడు. రూ.27 కోట్ల భారీ ధరతో లక్నో సూపర్‌జెయింట్స్ పంత్‌ను దక్కించుకుంది. శ్రేయస్ అయ్యర్ సైతం కండ్లుచెదిరే ధర సాధించాడు. పంజాబ్ కింగ్స్ రూ.26.75 కోట్లకు గత సీజన్ టైటిల్ నెగ్గిన కెప్టెన్‌ను సొంతం చేసుకుంది. యువ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్ ఊహించని రీతిలో రూ.23.75 కోట్లు దక్కించుకున్నాడు. విదేశీ ఆటగాళ్లలో జోశ్ బట్లర్ రూ.15.75 కోట్లు (గుజరాత్ టైటాన్స్), మిచెల్ స్టార్క్ 11.75 కోట్లు (ఢిల్లీ క్యాపిటల్స్), కగిసో రబాడ రూ.10.75 కోట్లు (గుజరాత్ టైటాన్స్) ఆకర్షణీయ ధర దక్కించుకున్నారు. సౌదీ అరేబియా రాజధాని జెడ్డా వేదికగా ఐపీఎల్ 2025 ఆటగాళ్ల మెగా వేలం ఆదివారం మొదలైంది. డెవిడ్ వార్నర్, జానీ బెయిర్‌స్టో, దేవదత్ పడిక్కల్, ఉమేశ్ యాదవ్‌లను ఎవరూ తీసుకోలేదు.

సరికొత్త చరిత్ర : ఐపీఎల్ వేలంలో రిషబ్ పంత్ చరిత్ర సృష్టించాడు. పంత్ కోసం లక్నో సూపర్‌జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ పోటీపడ్డాయి. ధర రూ.10 కోట్లు దాటిన తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎంట్రీ ఇచ్చింది. లక్నోతో రూ. 20.50 కోట్ల వరకు పోటీపడింది. రూ.20.75 కోట్లతో వేలంలో లక్నో దక్కించుకోగా.. ఢిల్లీ క్యాపిటల్స్ ఆర్‌టీఎం కార్డ్ ప్రయోగించింది. దీంతో రూ.27 కోట్ల ఫైనల్ బిడ్‌తో లక్నో సూపర్‌జెయింట్స్ స్టార్ ఆటగాడిని దక్కించుకుంది. శ్రేయస్ అయ్యర్ సైతం రికార్డు ధర అందుకున్నాడు. కోల్‌కత నైట్‌రైడర్స్, పంజాబ్ కింగ్స్‌తో పాటు ఢిల్లీ క్యాపిటల్స్ శ్రేయస్‌పై ఆసక్తి చూపించాయి. కోల్‌కత ఆర్‌టీఎం వాడుకోలేదు. దీంతో రూ.26.75 కోట్లకు శ్రేయస్ అయ్యర్ పంజాబ్ గూటికి చేరుకున్నాడు. రూ.26.50 కోట్ల వరకు ఢిల్లీ క్యాపిటల్స్ శ్రేయస్ కోసం ప్రయత్నించింది. పేసర్ అర్షదీప్ సింగ్‌ను పంజాబ్ కింగ్స్ తిరిగి తీసుకుంది. ఆర్‌టీఎంతో రూ.18 కోట్లకు కొనుగోలు చేసింది. జోశ్ బట్లర్, కగిసో రబాడలు గుజరాత్ టైటాన్స్ గూటికి చేరారు. మిచెల్ స్టార్క్‌ను ఢిల్లీ తీసుకుంది. ఆరుగురు దిగ్గజ ప్లేయర్ల మొదలైన వేలం.. రికార్డు ధరతో ప్రకంపనలు సృష్టించింది.

వెంకటేశ్ వావ్ : యువ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్ కోసం ఫ్రాంచైజీలు పోటీపడ్డాయి. మంచి పేస్, ధనాధన్ బ్యాటింగ్‌తో అయ్యర్ విలువైన ఆల్‌రౌండర్‌గా పేరు గడించాడు. కోల్‌కత మొదటి నుంచి అయ్యర్ కోసం పోటీపడింది. లక్నో, బెంగళూర్ సైతం రేసులో నిలిచినా రూ.23.75 కోట్లతో అయ్యర్‌ను కోల్‌కత దక్కించుకుంది. వెంకటేశ్ అయ్యర్ కోసం రూ.23.75 కోట్ల వరకు వెళ్లిన కోల్‌కత.. శ్రేయస్ అయ్యర్‌ను రూ.10 కోట్ల తర్వాత పట్టించుకోలేదు. కెఎల్ రాహుల్ రూ.14 కోట్లకు ఢిల్లీ క్యాపిటల్స్‌కు వెళ్లాడు. హ్యారీ బ్రూక్ రూ.6..25 కోట్లు, జేక్ ఫ్రేసర్ మెక్‌గుర్క్ రూ.9 కోట్లకు, నటరాజన్ రూ.10.75 కోట్లకు క్యాపిటల్స్‌కు దక్కారు. ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ మళ్లీ సూపర్‌కింగ్ అయ్యాడు. రూ.9.75 కోట్లకు చెన్నై అతడిని తీసుకుంది. డెవాన్ కాన్వే రూ.6.25 కోట్లు, రాహుల్ త్రిపాఠి రూ.3.40 కోట్లు, రచిన్ రవీంద్ర రూ.4 కోట్లు, అఫ్గాన్ స్పిన్నర్ నూర్ అహ్మద్ రూ.10 కోట్లకు సూపర్‌కింగ్స్‌కు శిబిరంలో చేరారు.

సన్‌రైజర్స్ సూపర్ : సన్‌రైజర్స్ హైదరాబాద్ వేలంలో మంచి వ్యూహం అమలు చేసింది. మహ్మద్ షమి రూ.10 కోట్లు, హర్షల్ పటేల్ రూ.8 కోట్లు, రాహుల్ చాహర్ రూ.3.20 కోట్లు, ఆడం జంపా రూ.2.40 కోట్లు, ఇషాన్ కిషన్ రూ.11.25 కోట్లతో కొనుగోలు చేసింది. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ రూ.12.25 కోట్లకు గుజరాత్ టైటాన్స్‌కు దక్కాడు. ప్రసిద్ కృష్ణ రూ.9.50 కోట్లకు టైటాన్స్‌తో చేరాడు. క్వింటన్ డికాక్ (రూ.3.60 కోట్లు), రెహ్మానుల్లా గుర్బాజ్ (రూ.2 కోట్లు), రఘువంశీ (రూ. 3 కోట్లు), నోకియా (రూ.6.50 కోట్లు)ను కోల్‌కత కొనుగోలు చేసింది. నమన్ ధిర్ (రూ.5.25 కోట్లు), రాబిన్ (రూ.0.65 కోట్లు), ట్రెంట్ బౌల్ట్ (రూ.12.50 కోట్లు)ను ముంబయి ఇండియన్స్ తీసుకుంది.

నవచిత్రం

మానవతా విలువలకు కేరాఫ్ 'మిస్టర్ మాణిక్యం'


సముద్ర ఖని

దర్శకుడిగా ఎంతో మంచి పేరు సంపాదించుకున్న సముద్రఖని, నటుడిగానూ అన్ని భాషల ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకుంటున్నారు. 'అల వైకుంఠపురములో', 'క్రాక్' నుంచి మొదలు పెడితే 'హనుమాన్' వరకు ప్రతి సినిమాలోనూ తాను ధరించిన పాత్రలకు నూటికి నూరు శాతం న్యాయం చేశారు. తన అద్భుత నటనతో తెలుగువారికి చేరువైన సముద్రఖని ఇప్పుడు 'మిస్టర్ మాణిక్యం' ద్వారా ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నంద పెరియసామి దర్శకత్వంలో జీపీ రేఖా రవి కుమార్, చింతా గోపాలకృష్ణా రెడ్డి, రాజా సెంథిల్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

డిసెంబర్ 28న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ఏషియన్ సునీల్ నారంగ్ చేతుల మీదుగా సినిమా ఫస్ట్ లుక్, రిలీజ్ డేట్ పోస్టర్ ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో విడుదల చేశారు.

ఈ సందర్భంగా సముద్రఖని మాట్లాడుతూ,"విమానం' తర్వాత నేను ప్రధానపాత్రలో నటించిన సినిమా ఇది. ఈ సినిమా 'విమానం' సినిమాకి మించిన మంచి పేరు తెస్తుందన్న నమ్మకం ఉంది. మానవతా విలువలు ప్రధానాంశంగా రూపొందిన సినిమా ఇది. ప్రతి ఒక్కరి మనసులను హత్తుకునే అనేక అంశాలు ఇందులో వున్నాయి. కుటుంబంతో సహా థియేటర్లకు వచ్చి చూసేంత క్లీన్ కంటెంట్ ఉన్న సినిమా ఇది' అని అన్నారు.

'ఈ సినిమాకి పనిచేసిన సముద్రఖని, నాజర్, భారతీరాజా... ఇలా ప్రతి ఒక్కరూ ఒక మంచి సినిమాకు పనిచేశామన్న సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. నిర్మాతగా ఇది నాకు మొదటి సినిమా. చింతా గోపాలకృష్ణారెడ్డి, రాజా సెంథిల్ నుంచి ప్రోత్సాహం లభించడంతో మేం ముగ్గురం కలసి ఈ సినిమా నిర్మించాం' అని నిర్మాతలలో ఒకరైన రవి అన్నారు. దర్శకుడు నంద పెరియసామి మాట్లాడుతూ, 'మానవతా విలువలతో కూడిన, వాస్తవ సంఘటనలకు అద్దం పట్టే విధంగా ఉండే కథాంశంతో దీన్ని రూపొందించాను. ఇందులో సముద్రఖని భార్యగా అనన్య నటించారు' అని తెలిపారు.

థ్రిల్ చేసే సీరియల్ కిల్లర్




జో శర్మ, మోహన్ వడ్లపట్ల

దర్శక, నిర్మాత మోహన్ వడ్లపట్ల తెరకెక్కించిన చిత్రం 'ఎం4ఎం' (మర్డర్ ఫర్ మోటీవ్).

ప్రతిష్టాత్మక గోవా ఫిలిం ఫెస్టివల్‌లోని (ఇఫీ) కళా అకాడమీ వేదికపై ఇండియన్ మోషన్ పిక్చర్స్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ చేతుల మీదుగా ఈ చిత్ర హిందీ ట్రైలర్ విడుదలైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ట్రైలర్ అద్భుతంగా ఉంది. సీరియల్ కిల్లర్ కాన్సెప్ట్ చాలా కొత్తగా ఉంది. ఆసక్తికర కంటెంట్‌తో ఇటువంటి చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల కోసం గొప్ప ప్రయత్నం చేసినందుకు దర్శక, నిర్మాత మోహన్ వడ్లపట్లను అభినందిస్తున్నాను. ఈ చిత్రం ద్వారా హీరోయిన్‌గా పరిచయం అవుతున్న జో శర్మకి ఈ సినిమా మంచి సక్సెస్ అవ్వాలి' అని అన్నారు. దర్శక, నిర్మాత మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ, 'ఈ సబ్జెక్ట్ యూనివర్సల్. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీప్రేక్షకులు మా మూవీని చూసి థ్రిల్ అవుతారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషలలో ఈ సినిమాని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నాం. ఈ సినిమాతో సంబీత్ ఆచార్య, జోశర్మలకు పాన్ ఇండియా స్కేల్‌లో కొత్త అధ్యాయం మొదలవుతుంది' అని తెలిపారు.

'మా మూవీ ట్రైలర్‌ను గోవాలో లాంచ్ చేయటం కొత్త అనుభూతిని ఇచ్చింది. సీరియల్ కిల్లర్ కాన్సెప్ట్ కొత్తగా, చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. ఇలాంటి కాన్సెప్ట్‌తో రావడం 110 ఏళ్ల సినీ చరిత్రలో ఫస్ట్ టైమ్. ఈ సినిమాలో హీరోయిన్‌గా చేయడం గర్వంగా ఉంది' అని జోశర్మ చెప్పారు.


రామ్‌చరణ్, కియారా అద్వానీ

సంక్రాంతి బరిలో 'గేమ్ ఛేంజర్'

రామ్ చరణ్ కథానాయకుడిగా డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాని ఎస్వీసీ, ఆదిత్యరామ్ మూవీస్ సంస్థలు తమిళంలో విడుదల చేస్తుండగా, హిందీలో ఏఏ ఫిలిమ్స్ అనిల్ తడాని రిలీజ్ చేస్తున్నారు.

ఇప్పటికే ఈ చిత్రం నుంచి వచ్చిన పాటలు సోషల్ మీడియాను షేక్ చేశాయి. 'జరగండి', 'రా మచ్చా' పాటలు యూట్యూబ్‌లో చార్ట్ బస్టర్‌లుగా నిలిచాయి. ఇక మరోసారి శ్రోతల్ని, అభిమానుల్ని కట్టి పడేసేందుకు మూడో పాటను రిలీజ్ చేయబోతున్నారు. న్యూజిలాండ్‌లో రామ్‌చరణ్, కియారా అద్వానీలపై షూట్ చేసిన ఈ మెలోడీ గీతాన్ని ఈనెల 28న రిలీజ్ చేస్తున్నారు. ఈ అప్డేట్ తెలియజేస్తూ రిలీజ్ చేసిన పోస్టర్‌లో కలర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్‌లో రామ్‌చరణ్, కియారా ఎంతో కూల్‌గా కనిపిస్తున్నారు.

డిసెంబర్ 21న అమెరికాలో చరిష్మా డ్రీమ్స్ రాజేష్ కళ్లెపల్లి ఈచిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను అత్యంత భారీగా నిర్వహించబోతున్నట్లుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. టీజర్‌తో అంచనాలు పెంచిన చిత్రయూనిట్ ముున్ముందు మరిన్ని ప్రమోషనల్ కంటెంట్‌తో ఆడియెన్స్ ముందుకు రానుంది.

రామ్ చరణ్ ఈ చిత్రంలో రెండు పవర్‌ఫుల్ పాత్రల్లో మెప్పించనున్నారు. కార్తీక్ సుబ్బరాజ్ కథ అందించారు. సరిగమ ద్వారా ఈ చిత్ర ఆడియో రిలీజ్ అవుతోంది. నార్త్ అమెరికాలో ఈ చిత్రాన్ని శ్లోకా ఎంటర్టైన్మెంట్స్ భారీ ఎత్తున రిలీజ్ చేయనుంది. ప్రపంచవ్యాప్తంగా ఈసినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదల ప్రేక్షకుల ముందుకు రానుంది.

ప్రేక్షకులకు కృతజ్ఞతలు : సత్యదేవ్


సత్యదేవ్

సత్య దేవ్, డాలీ ధనంజయ్ నటించిన మల్టీస్టారర్ చిత్రం 'జీబ్రా'. ఈశ్వర్ కార్తీక్ దర్శకుడు. పద్మజ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్, ఓల్డ్ టౌన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, ఎస్ పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మించారు. ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా విశేష ఆదరణతో మంచి విజయాన్ని అందుకుంది.

ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో హీరో సత్య దేవ్ మాట్లాడుతూ, 'డైరెక్టర్ ఈశ్వర్ కార్తీక్‌కి థ్యాంక్స్. ఈ సినిమాతో నన్ను రాటుతేలేలా చేశాడు. చిరంజీవి చెప్పినట్లు 'జీబ్రా' సూపర్ హిట్ అయింది. అన్నింటికీ అతీతంగా ఈ సినిమా సూపర్ హిట్ అయింది. ప్రతి చోటా హౌస్ ఫుల్స్ అవుతున్నాయి. ఆడియన్స్ నుంచి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వస్తుంది. ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు.




గాయని మంగ్లీకి అరుదైన గౌరవం

తన విలక్షణ గాత్రంతో సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటూ టాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్నారు సింగర్ మంగ్లీ.

ప్రైవేట్ సాంగ్స్‌తో మొదలైన ఆమె ప్రయాణం సినిమా పాటలతో బిజీగా సాగుతోంది. ఫోక్, డివోషనల్, ఐటెం సాంగ్స్‌కి కేరాఫ్‌గా నిలిచింది. క్లాస్, మాస్ అనే తేడా లేకుండా ప్రతి సాంగ్‌లో తన మార్క్ చూపిస్తుంది. అలాగే సొంత యూట్యూబ్ ఛానల్‌లో కూడా రకరకాల పాటలను పాడుతూ క్రేజ్ సొంతం చేసుకుంది. 'జార్జి రెడ్డి' మూవీలోని రాయల్ ఎన్ఫీల్డ్ సాంగ్ మంగ్లీకి మంచి పేరు తెచ్చింది. ఆ తర్వాత 'రాములో రాములా', 'సారంగదరియా..' వంటి అనేక పాటలతో విశేష శ్రోతకారదణను సొంతం చేసుకుంది. సంగీత ప్రపంచంలో ఆమె అందుకున్న విజయాలకు గానూ ఇటీవలే సంగీత నాటక అకాడమీ నుంచి 'ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్' యువ పురస్కారానికి ఎంపికైంది. ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అతిరథ మహారథుల సమక్షంలో ఆమె అందుకున్నారు. ఈ పురస్కారం తనకు మరింత బాధ్యతను పెంచిందని సత్యవతీ చౌహాన్ అలియాస్ మంగ్లీ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

గ్రామీణ నేపథ్యంలో 'వశిష్ఠ'


సుమన్ తేజ్, నాగబాల సురేష్

సుమన్ తేజ్, అను శ్రీ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'వశిష్ఠ'. ఈ చిత్రాన్ని బేబి నేహా సమర్పణలో లిటిల్ బేబీస్ క్రియేషన్స్ బ్యానర్ పై నోరి నాగప్రసాద్ నిర్మిస్తున్నారు. మైథలాజికల్ సోషల్ డ్రామా కథతో దర్శకుడు హరీశ్ చావా రూపొందిస్తున్నారు.

ఆదివారం ఈ మూవీ పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. తెలుగు టెలివిజన్ అసోసియేషన్ ఫౌండర్, ప్రెసిడెంట్ నాగబాల సురేష్ కుమార్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ నివ్వగా, నిర్మాత లయన్ సాయివెంకట్ స్క్రిప్ట్ అందజేశారు. నటుడు గగన్ విహారి కెమెరా స్విచ్ఛాన్ చేశారు. యాడ్ ఫిలింమేకర్ యమున కిషోర్ ఫస్ట్ షాట్‌కి డైరెక్షన్ చేశారు.

ఈ సందర్భంగా నిర్మాత నోరి నాగప్రసాద్ మాట్లాడుతూ,'ప్రేక్షకులకు ఒక మంచి అనుభూతిని అందించే సినిమా అవుతుంది. స్క్రిప్ట్ వినగానే మా హీరో సుమన్ తేజ్ చాలా హ్యాపీగా ఫీలయ్యారు. ఒక సక్సెస్‌ఫుల్ మూవీతో మీ ముందుకు వస్తాం' అని తెలిపారు. 'విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సోషల్ డ్రామా ఇది. అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది' అని డైరెక్టర్ హరీశ్ చావా చెప్పారు.

హీరో సుమన్ తేజ్ మాట్లాడుతూ,"రంగస్థలం'లాంటి మూవీలో నటించాలనే కోరిక ఉండేది. ఈ కథ విన్నప్పుడు నేను కోరుకున్న స్క్రిప్ట్ ఇదే అనే ఫీల్ కలిగింది. డైరెక్టర్ హరీశ్ ప్రతిభ ఈ సినిమాతో అందరికీ తెలుస్తుంది' అని తెలిపారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886